# కాళేశ్వరంలో ఉపయోగపడింది 55 టీఎంసీలే



- కుంగిన, లోపాలు ఉన్న బ్యారేజీల్లో భారాస నాయకులు నీటిని నింపాలంటున్నారు
- సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో త్వరలో తుమ్మిడిహెట్టికి..
- ప్రజాప్రతినిధులకు ఇచ్చిన ప్రజంటేషన్‌లో మంత్రి ఉత్తమ్

హైదరాబాద్ పెన్ పవర్: ప్రపంచంలో గొప్ప ప్రాజెక్టు.. ఎనిమిదో వింత అని చెప్పిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కింద ఐదేళ్లలో ఉపయోగపడింది 55 టీఎంసీలేనని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు, బ్యారేజీల ప్రస్తుత స్థితిపై మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులకు ప్రభుత్వం అవగాహనా సమావేశం ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.

- మిగతా 4లో...

పెన్ పవర్
తెలంగాణ రౌండప్






నేరస్తునితో ద్విచక్ర వాహనాలను మీడియా ముందు ప్రవేశపెట్టిన పోలీసులు..

# 'టూ' వీలర్ల 'దొంగ' అరెస్ట్..!

## రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం..!






స్వాధీన పరచుకున్న బైకులను పరిశీలిస్తున్న పోలీసులు..

### బాచుపల్లి పోలీసుల చాకచక్యం..!
### పాత నేరస్తున్ని అరెస్ట్.. రిమాండ్‌కి తరలింపు..!

దుండిగల్, పెన్ పవర్, జూలై 7: ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ఓ పాత నేరస్తుడి(హ్యాబిచ్యువల్ అఫెండర్) ని బాచుపల్లి పోలీస్ స్టేషన్ క్రైమ్ సిబ్బంది అరెస్టు చేసి, అతని వద్ద నుంచి రెండు చోరీకి గురైన ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, లేట్ల ప్రవీణ్ (25) తండ్రి రాములు, ప్రస్తుతం ప్రగతి నగర్ ఆర్‌జీకే ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు.. స్వస్థలం కర్నూలు జిల్లా బిజినపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి. ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్నట్లు నిర్ధారించిన బాచుపల్లి పోలీస్ స్టేషన్ క్రైమ్ సిబ్బంది నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు.. విచారణలో భాగంగా నిందితుడి వద్ద నుంచి రెండు యమహా ఆర్‌ఎక్స్-135 మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిలో "ఏపీ 02 ఎఫ్ 6793" నెంబర్ గల వాహనం బాచుపల్లి పోలీస్ స్టేషన్ క్రైమ్ నెంబర్ 603/2026, సెక్షన్ 305(బి) బిఎన్ఎస్ కేసుకు సంబంధించినదిగా, అదేవిధంగా "ఏపీ 01 ఎఫ్ 2675" నెంబర్ గల మరో వాహనం బాచుపల్లి పోలీస్ స్టేషన్ క్రైమ్ నంబర్ 605/2026, సెక్షన్ 305(బి) బిఎన్ఎస్ కేసుకు సంబంధించినదిగా పోలీసులు గుర్తించారు..

- నేరాలే ప్రవృత్తిగా ఎంచుకున్న నేరస్తుడు అరెస్ట్..! 2 ద్విచక్ర వాహనాలు స్వాధీనం..!
- నేరస్తుడు లేట్ల ప్రవీణ్ నుండి యమహా ఆర్‌ఎక్స్-135 బైక్‌లు స్వాధీనం..
- బాచుపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన రెండు కేసులు ఛేదించిన పోలీసులు..
- నిందితుడిపై ఇప్పటికే రెండు పాత క్రిమినల్ కేసులు..
- మంగళవారం కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలింపు..

పోలీసుల దర్యాప్తులో పాత నేరస్తుడిగా గుర్తించిన.. నిందితుడు ప్రవీణ్‌పై ఇప్పటికే బాచుపల్లి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెంబర్ 540/2026 (సెక్షన్ 305(బి) 'బిఎన్ఎస్' కేసు, అలాగే దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెంబర్ 1039/2025 (సెక్షన్ 305(బి) 'బిఎన్ఎస్' కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.. నిందితుడిపై తదుపరి విచారణ కొనసాగుతోందని, వాహనాల చోరీలకు సంబంధించిన మరిన్ని వివరాలను సేకరిస్తున్నట్లు బాచుపల్లి పోలీసులు తెలిపారు. ప్రజలు తమ వాహనాలకు భద్రతా చర్యలు పాటించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా చోరీలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని పోలీసులు సూచించారు.

## ఆదిలాబాద్ లో దారుణం...
### టిఫిన్ తిందామని హోటల్ కి వెళ్తే.. సాంబార్ లో బల్లి..

-5 లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి



## 'ఎస్ఐఆర్" ప్రక్రియ గందరగోళం..!
# ప్రమాదంలో ఓటుహకు..?

### వెంటనే అధికారులు అప్రమత్తం కావాలని బీజేపీ నేత ఆగ్రహం..!



- అస్తవ్యస్తంగా తయారైన సర్..! బాచుపల్లి లో ఓటర్లకు చుక్కలు చూపిస్తున్న వైనం..?
- ఓటు హక్కుతో చెలగాటం వద్దు..! సర్ నిర్లక్ష్యంపై బీజేపీ నేత సీరియస్..
- 'బిఎల్ఓ'ల నిర్లక్ష్యమేనని బీజేపీ స్పష్టమైన ఆరోపణలు..!
- సర్ ప్రక్రియపై వేలాది మంది ఓటర్లకు ఫారాలు అందని పరిస్థితి..
- కేవలం 15--20 శాతం ఓటర్లకే ఎన్యుమరేషన్ ఫారాలు..?
- 'బిఎల్వో'ల అవగాహన లేమి, విధుల్లో నిర్లక్ష్యం,పర్యవేక్షణా లోపంతో గందరగోళం.
- ప్రత్యేక ఓటరు సవరణలో భారీ లోపాలు..! తక్షణ చర్యలక బీజేపీ డిమాండ్..!

-4 లో

# ఘనంగా ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం..

- పద్మశ్రీ మందకృష్ణ మాదిగ 60వ జన్మదిన వేడుకలు జరుపుకుని కేక్ కట్‌చేశారు..
- ఎస్సీ వర్గీకరణ ఫలాలు అందరికీ చేరాలన్న నాయకుల ఆకాంక్ష..



కుత్బుల్లాపూర్, పెన్ పవర్, జూలై 7:కుత్బుల్లాపూర్ మండలం సూరారం మెయిన్ రోడ్డులోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ భవనం పక్కన ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు రాసమల్ల యాదగిరి మాదిగ, అధ్యక్షత వహించగా, జిల్లా అధికార ప్రతినిధి సిలివేరి శ్రీనివాస్ మాదిగ, జిల్లా మాదిగ మహిళా సమాఖ్య నాయకురాలు నడిమిదొడ్డి సలోమి మాదిగ, ముఖ్య అతిథులుగా హాజరై జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ 60వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు.. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మూడు దశాబ్దాల పాటు సాగిన ఉద్యమ ఫలితంగా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధ్యమైందని పేర్కొన్నారు.. ఈ అవకాశాలను మాదిగలు, మాదిగ ఉపకులాల ప్రజలు సద్వినియోగం చేసుకుని విద్య, ఉద్యోగాలు, ఆర్థిక, రాజకీయ రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఇందూరం తిరుపతి మాదిగ, సీనియర్ ఎమ్మార్పీఎస్ నాయకుడు సంఘీ మహేష్ మాదిగ, జిల్లా యువసేన ప్రధాన కార్యదర్శి ఇస్తాం రమేష్ మాదిగ, మట్ట నరసింహులు, వేణుగోపాల్, జాన్సన్ మాదిగ, ఆశీర్వాదం మాదిగ, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు..



- అస్తవ్యస్తంగా తయారైన సర్..! బాచుపల్లి లో ఓటర్లకు చుక్కలు చూపిస్తున్న వైనం..?
- ఓటు హక్కుతో చెలగాటం వద్దు..! సర్ నిర్లక్ష్యంపై బీజేపీ నేత సీరియస్..
- 'బిఎల్ఓ'ల నిర్లక్ష్యమేనని బీజేపీ స్పష్టమైన ఆరోపణలు..!
- సర్ ప్రక్రియపై వేలాది మంది ఓటర్లకు ఫారాలు అందని పరిస్థితి..
- కేవలం 15--20 శాతం ఓటర్లకే ఎన్యుమరేషన్ ఫారాలు..?
- 'బిఎల్వో'ల అవగాహన లేమి, విధుల్లో నిర్లక్ష్యం,పర్యవేక్షణా లోపంతో గందరగోళం.
- ప్రత్యేక ఓటరు సవరణలో భారీ లోపాలు..! తక్షణ చర్యలక బీజేపీ డిమాండ్..!

## అర్హత కలిగిన పౌరుడు ఓటుహక్కును కోల్పోకూడదు..

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి పౌరుని చేతిలో వజ్రాయుధం లాంటిది.. అలాంటి ఓటుహక్కు అనేది అర్హులైన వ్యక్తి కోల్పోకూడదని, అదేవిధంగా అర్హతలేని వ్యక్తులకు ఓటు హక్కుకూడా ఉండకూడదని బీజేపీ నేత బిక్షపతి యాదవ్ సూచించారు.. అవసరమైతే ఈ అంశాన్ని భారత ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లేందుకు భారతీయ జనతా పార్టీ సిద్ధంగా ఉందని హెచ్చరించారు.. సర్ కార్యక్రమం విజయవంతంగా అమలు చేసేందుకు అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, 'బిఎల్ఏ-2లు సిద్ధంగా ఉన్నారని బిక్షపతి యాదవ్ తెలిపారు..

# 'ఎస్ఐఆర్' ప్రక్రియ గందరగోళం..!
# ప్రమాదంలో ఓటుహాకు..?

## వెంటనే అధికారులు అప్రమత్తం కావాలని బీజేపీ నేత ఆగ్రహం..!



'బిఎల్వో'ల అవగాహన లోపమో..! అధికారుల పర్యవేక్షణా లేమితోనో తెలియదు కానీ..! ఓటు హక్కు ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఓ బీజేపీ నేత తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.. నిజాంపేట్ సర్కిల్-58 సిఎంసి పరిధిలోని బాచుపల్లి మండలంలో సర్ ప్రక్రియపై తీవ్ర విమర్శలు తలెత్తుతున్నాయి.. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు ఓటుహక్కు సవరణ ప్రక్రియ ముగించినట్లు సమాచారం.. ఈ నేపథ్యంలో తెలంగాణలో అధికార యంత్రాంగం తమ విధులను కూడా పక్కనపెట్టి 'ఎస్ఐఆర్' ప్రక్రియపై దృష్టి సారించాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ..! 'బిఎల్వో'లు ఇంటింటికి తిరిగి ఓటు సవరణ ఫారాలు అందజేయడంలో విఫలమవుతున్నారా..? లేక మొక్కుబడిగా ఓటర్లకు ఫారాలు అందజేస్తున్న బిఎల్వోలు, ఫారాలు పూరించడంపై ఓటర్లకు అవగాహన కల్పించడంలో విఫలమవుతున్నారా..? అన్నది ప్రశ్నార్థకంగా తయారైందని బీజేపీ నేత బిక్షపతి యాధవ్ ఆరోపిస్తున్నారు.. మరోవైపు ఈ సర్ కార్యక్రమం విజయవంతానికి అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందించేందుకు బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బిఎల్ఏ-2 లుగా సిద్ధంగా ఉన్నారని బిక్షపతి యాదవ్ తెలిపారు..

**సిఎంసి బ్యూరో, పెన్ పవర్, జూలై 7:**

అస్తవ్యస్తంగా సాగుతున్న 'ఎస్ఐఆర్' ప్రక్రియపై, గందరగోళంలో ఓటర్లు ఉన్నారని, బీజేపీ నేత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. కేంద్ర ప్రభుత్వం, భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమం బాచుపల్లి మండల పరిధిలో సమర్థవంతంగా అమలు కాకపోవడంతో..! ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రని భారతీయ జనతా పార్టీ నిజాంపేట్, బండారి లేఔట్ అధ్యక్షుడు బిక్షపతి యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు.. ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 24వ తేదీ వరకు అర్హత కలిగిన ప్రతి ఓటరికు, సంబంధిత బూత్ లెవల్ అధికారి (బిఎల్వో) ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు అందజేసి, వాటిని సేకరించాల్సి ఉంది.. అయితే ఓటరు జాబితాలో చిరునామాలు సరిగా లేకపోవడం, అపార్ట్‌మెంట్లు అధికంగా ఉండడం, 'బిఎల్వో'లకు సరైన అవగాహన లేకపోవడం, కొంతమంది విధులకు హాజరు కాకుండా, ఇతరులతో పని చేయించడం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడం వంటి కారణాల వల్ల ఇప్పటివరకు కేవలం 15 నుండి 20 శాతం మంది ఓటర్లకే ఫారాలు అందినట్లు సమాచారం ఉందని ఆరోపిస్తున్నారు.. ఓటరు వివరాల మార్పులు, కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు వంటి అంశాల్లో 'బిఎల్వో'లకు స్పష్టమైన అవగాహన లేకపోవడంతో ప్రజలు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారని ఆయన తెలిపారు..

### ఈ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు..

(1)..బాచుపల్లి మండలంలోని ప్రధాన కూడళ్లలో ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించిన సూచనలు, అవగాహన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి.. (2)..ఎన్యుమరేషన్ ఫారాల ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సౌండ్ సిస్టమ్‌తో కూడిన ప్రచార వాహనాలను అన్ని కాలనీలలోని వీధుల్లో నిర్వహించాలి.. (3)..ఇంటింటికి ప్రాపర్టీ ట్యాక్స్ డిమాండ్ నోటీసులు అందజేస్తున్న సిబ్బంది ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ఎందుకు చేయడం లేదో గుర్తించి అధికారులు చర్యలు తీసుకోవాలి..(4)..వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వ్యక్తులను "బిఎల్ఏ-2"లుగా, స్వచ్ఛంద కార్యకర్తల సహకారంతో ప్రతి అర్హత కలిగిన ఓటరికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు చేపట్టాలి..(5)..విధుల్లో నిర్లక్ష్యం వహించి అర్హులైన ఓటర్లు ఓటు హక్కు కోల్పోయే పరిస్థితి ఏర్పడితే సంబంధిత "బిఎల్లవో"లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు..

---

## ఇండోనేషియాకు బ్రహ్మోస్ క్షిపణులు.. భారత్‌తో 200 మిలియన్ డాలర్ల డీల్

రక్షణ రంగ ఎగుమ తుల్లో భారత్ మరో కీలక మైలురాయిని అధిగమించింది. ఇండోనేషియాకు సుమారు 200 మిలియన్ డాలర్ల (రూ.1,900 కోట్లు) విలువైన రెండు బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి బ్యాటరీలను సరఫరా చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. మంగళవారం ఇరు దేశాల మధ్య జరిగిన పలు కీలక రక్షణ ఒప్పందాల్లో భాగంగా ఈ డీల్ ఖరారైంది. ఈ ఒప్పందంతో బ్రహ్మోస్ క్షిపణులను కొనుగోలు చేసిన మూడో విదేశీ కస్టమర్‌గా ఇండోనేషియా నిలిచింది. ఇప్పటికే 2022లో ఫిలిప్పీన్స్ మూడు బ్యాటరీల కోసం ఒప్పందం చేసుకోగా, ఈ ఏడాదే వియత్నాం కూడా బ్రహ్మోస్ కొనుగోలుకు అంగీకరించింది. తాజా ఒప్పందంతో ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత్ తన రక్షణ భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసుకుంటోంది. ఈ డీల్ కేవలం బ్రహ్మోస్ క్షిపణులకే పరిమితం కాలేదు. ఆస్ట్రా ఎయిర్-టు-ఎయిర్ క్షిపణి వ్యవస్థలు, కీలకమైన రక్షణ సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, సముద్ర భద్రత వంటి అంశాలపై కూడా ఇరు దేశాలు అంగీకారానికి వచ్చాయి. గత ఏడాది నవంబర్‌లో జరిగిన ఇరు దేశాల రక్షణ మంత్రుల సమావేశంలోనే ఈ ఒప్పందాలపై చర్చలు మొదలయ్యాయి. భారత్‌కు చెందిన డీఆర్‌డీవో, రష్యాకు చెందిన ఎన్పీవో మషినోస్ట్రోయెనియా సంయుక్తంగా బ్రహ్మోస్ క్షిపణిని అభివృద్ధి చేశాయి. ఇది భారత త్రివిధ దళాల్లోనూ సేవలందిస్తోంది. భారత్ మరో అరడజను దేశాలతో బ్రహ్మోస్ అమ్మకాలపై చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. సాధారణంగా ఒక బ్రహ్మోస్ బ్యాటరీలో 4 లాంచర్లు ఉంటాయి. ఒక్కో లాంచర్ పై 3 రెడీ టు ఫైర్ బ్రహ్మోస్ క్షిపణులు ఉంటాయి. ఆ లెక్కన ఒక బ్యాటరీలో మొత్తం 12 క్షిపణులు ఉంటాయి. వీటిని కేవలం 30 సెకన్ల వ్యవధిలోనే వేర్వేరు లక్ష్యాలపై ప్రయోగించవచ్చు.

## కాళేశ్వరంలో ఉపయోగపడింది 55 టీఎంసీలే

-3 పేజీ తరువాయి

"ఐదేళ్లలో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు, పంపుహౌస్‌ల ద్వారా 165 టీఎంసీలు మాత్రమే ఎత్తిపోశారు. ఎగువ నుంచి వరద వస్తే తిరిగి 63 టీఎంసీలు దిగువకు వదిలేశారు. ఇతర నష్టాలు పోను ఐదేళ్లలో 55 టీఎంసీలు మాత్రమే వినియోగించారు. కాళేశ్వరం కట్టక ముందు సూర్యాపేట జిల్లాకు ఎస్సారెస్పీ స్టేజ్-2 కింద ఎన్ని నీళ్లు వచ్చాయో.. కట్టిన తరువాత, కుంగిన అనంతరం కూడా అన్నే నీళ్లు వస్తున్నాయి. నాటి భారాస ప్రభుత్వం కాళేశ్వరాన్ని సరిగా కట్టి ఉంటే ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల్లో రైతులకు ఈ దుస్థితి వచ్చేదా? ఈ విషయాన్ని కాంగ్రెస్ శ్రేణులు.. భారాస నాయకులను ప్రశ్నించాలి. భారాస వారే పొరపాటు చేసి తిరిగి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారు.

**ప్రాణహిత- చేవెళ్ల ఎత్తిపోతలు నిర్మిస్తాం**

కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించినట్లు తుమ్మిడిహెట్టి నుంచి ప్రాణహిత చేవెళ్ల ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తాం. మూడునాలుగు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తుమ్మిడిహెట్టి ప్రాంతానికి వెళ్లి పరిశీలిస్తాం. ఈ పథకం పనులు త్వరలో ప్రారంభించబోతున్నాం. నాడు ఈ పథకాన్ని మేడిగడ్డకు మార్చాలన్న ఒక తప్పుడు నిర్ణయంతో భారాస శాశ్వతంగా తెలంగాణకు నష్టం చేసింది. ప్రాణహిత-చేవెళ్ల నిర్మించి ఉంటే 3,466 మెగావాట్ల విద్యుత్ సరిపోయేది. కాళేశ్వరం పంపులన్నీ నడిపిస్తే 8,450 మెగావాట్ల విద్యుత్ అవసరం అని కాగ్ పేర్కొంది. మొత్తం రాష్ట్రంలో విద్యుత్ వినియోగం ఎంత ఉంటుందో.. ఒక్క కాళేశ్వరానికే అంత అవసరం అని కూడా చెప్పింది.

ఈ ప్రాజెక్టు కుప్పకూలిన తరువాత కూడా పంపింగ్ చేసి బ్యారేజీల్లో నీళ్లు నింపాలని భారాస నాయకులు అంటున్నారు. మరోపక్క గేట్లు తెరిచి ఉంచాలని, నిల్వ చేస్తే ఊళ్లు కొట్టుకుపోతాయని ఎన్డీఎస్ఏ చెప్పింది. ఎన్డీఎస్ఏ సూచనల ప్రకారం కన్సల్టెంట్ సంస్థ ఆఫ్రి ఇండియా-ఐఐటీ బాంబేతో పరీక్షలు చేయిస్తున్నాం. సీడబ్ల్యూసీ ఆమోదంతో పునరుద్ధరణ పనులకు ముందుకు వెళ్తున్నాం. ప్రపంచంలో ఏ బ్యారేజీలో కూడా రెండు, మూడు టీఎంసీల కన్నా నీళ్లు నింపరు. గత ప్రభుత్వంలోని పెద్ద మనుషులు మాత్రం పది టీఎంసీలకు పైగా నిల్వ చేయాలని సూచించారు. గోదావరికి జల కళ అంటూ ఏదో ఘనకార్యం చేసినట్లు ప్రచారం చేసుకున్నారు.

### నీటిని ఎత్తిపోయడం సాధ్యం కాదు

మేడిగడ్డలో 5, అన్నారంలో 10.5, సుందిళ్లలో 8.5 మీటర్ల ఎత్తులో నీటి మట్టం ఉంటేనే పంపుహౌసుల ద్వారా ఎగువకు ఎత్తిపోతలు సాధ్యం. నిల్వ లేకుండా పంపుహౌస్‌లు నడిపించి నీటిని ఎత్తిపోయడం అసాధ్యం. కాళేశ్వరం బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయడమే లోపాలకు కారణమైందని ఎన్డీఎస్ఏ చెప్పింది.

**ప్రజంటేషన్‌లో నీటిపారుదల సంయుక్త కార్యదర్శి కె.శ్రీనివాస్**

# ఆదిలాబాద్ లో దారుణం... టిఫిన్ తిందామని హోటల్ కి వెళ్తే.. సాంబార్ లో బల్లి..

**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ మధ్య హోటల్ తిండి తినాలంటేనే భయం వేస్తోంది. హోటళ్లలో జరుగుతున్నా తనిఖీల్లో వెలుగులోకి వస్తున్న ఘటనలు, బడా హోటళ్లలో సైతం కిచెన్ లో ఎలుకలు తిరగడం, ఏ మాత్రం పరిశుభ్రత లేకపోవడం వంటి ఘటనలు ఒక పక్క... బిర్యానీలో బల్లి, కుళ్ళిన చికెన్ వంటివి కనిపించిన ఘటనలు వెరసి జనం హోటల్ ఫుడ్ అంటేనే భయపడుతున్నారు. ఇప్పుడు ఆదిలాబాద్ లో మరో దారుణం జరిగింది. టిఫిన్ తిందామని హోటల్ కి వెళ్లిన కస్టమర్ సాంబార్ లో బల్లి చూసి అవాక్కయ్యాడు. మంగళవారం ( జులై 7 ) జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి... ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ హోటల్ కు టిఫిన్ తినేందుకు వెళ్ళాడు ఓ కస్టమర్. సాంబార్ లో బల్లి ప్రత్యక్షమవ్వడంతో అవాక్కయ్యాడు కస్టమర్. హొటెల్ నిర్వాహకుడికి విషయం చెప్పగా.. అతనికి క్షమాపణ చెప్పాడు. అంతటితో ఆగకుండా... ఫుడ్ సేఫ్టీ అధికారులకు కూడా ఫిర్యాదు చేశాడు కస్టమర్.కస్టమర్ ఫిర్యాదుతో హోటల్ కు చేరుకొని పరిస్థితి పరిశీలించారు అధికారులు. ఈ ఘటనపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు









## ఢిల్లీ హైకోర్టులో 'కాక్రోచ్ పార్టీ' విజయం.. ఎక్స్ లో మళ్లీ సందడి స్టార్ట్!

**హైదరాబాద్ పెన్ పవర్:** కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఎక్స్ అకౌంట్‌పై కేంద్ర ప్రభుత్వం విధించిన నిషేధాన్ని ఢిల్లీ హైకోర్టు ఎత్తివేసింది. నీట్ యూజీ పరీక్షల నిర్వహణ నేపథ్యంలో నెలకొన్న గందరగోళం కారణంగా సీజేపీ ఎక్స్ ఖాతాను నిలిపివేసినట్లు ప్రభుత్వం తెలపగా, ప్రస్తుతం ఆ పరీక్షలు పూర్తయినందున ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కోర్టు అభిప్రాయపడింది. ఈ మేరకు కాక్రోచ్ పార్టీ దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ జరిపిన జస్టిస్ స్వర్ణకాంత శర్మ నేతృత్వంలోని ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. పరీక్షల నిర్వహణ సమయంలో తీసుకున్న ముందస్తు జాగ్రత్తల వల్ల సీజేపీ అకౌంటును నిషేధించినా ప్రస్తుతం ఆ పరిస్థితిని కొనసాగించాల్సిన అవసరం లేదని ధర్మాసనం తేల్చిచెప్పింది. గత మే నెలలో నీట్-యూజీ పరీక్షల పేపర్ లీక్ అవడం, ఆ తర్వాత దేశంలోని విద్యా వ్యవస్థలోని లోపాలు ఒక్కొక్కటిగా వెలుగుచూడటంపై సీజేపీ ఎక్స్ వేదికగా భారీ ఉద్యమం నిర్వహించింది. ప్రభుత్వంపై విమర్శలతో మొదలైన ఉద్యమం రోజుల వ్యవధిలోనే విస్తృత ప్రచారం, గుర్తింపు తెచ్చుకోవడంతో రాజకీయంగా వేడి పుట్టించింది. ఇదే సమయంలో నీట్ పేపర్ లీకు ఘటనతో ప్రభుత్వం తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంది. ప్రభుత్వంపై మరింత ప్రెజర్ పెంచేలా కాక్రోచ్ పార్టీ సోషల్ మీడియాలో ప్రచారం చేయడంపై కేంద్రం కన్నెర్ర జేసిందని అంటున్నారు. దీంతో విద్యార్థుల్లో అయోమయం సృష్టిస్తున్నారన్న కారణంతో సీజేపీ అకౌంటును దేశంలో నిషేధించారు. జాతీయ భద్రతా కారణాల దృష్ట్యా కేంద్ర ఎలక్ట్రానిక్స్ సమాచార సాంకేతిక శాఖ తరఫున ఐటీ చట్టం సెక్షన్ 69(ూా) కింద సీజేపీ ఎక్స్ ఖాతాను బ్లాక్ చేయించారు. కాగా, కేంద్రం చర్యలపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వం ఏకపక్షంగా తన ఖాతాను నిలిపివేసిందని, ఇది భావప్రకటన స్వేచ్ఛకు విరుద్ధమని ఆయన తరఫు న్యాయవాదులు వాదించారు. గత విచారణల్లో కోర్టు తక్షణ ఉపశమనం కల్పించేందుకు నిరాకరించినప్పటికీ, తాజా విచారణలో కీలక మలుపు చోటుచేసుకుంది. న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణ కాంత శర్మ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసు విచారించగా, కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. 'నీట్ పరీక్షలకు ముందు విద్యార్థుల మధ్య అలజడి సృష్టించే అవకాశం ఉన్నందున ఈ చర్య తీసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం పరీక్షలు ముగిసినందున అకౌంట్ అన్‌బ్లాక్ చేసేందుకు ఎటువంటి అభ్యంతరం లేదని కోర్టుకు నివేదించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం, ప్రాథమిక కారణాలు సమసిపోయినందున, ఖాతాను వెంటనే పునరుద్ధరించాలని ఆదేశిస్తూ పిటిషన్‌ను పరిష్కరించింది. సీజేపీ అకౌంట్ నిలిపివేత తర్వాత, ఆ సంస్థ 'కాక్రోచ్ ఈజ్ బ్యాక్' పేరుతో కొత్త అకౌంట్ ద్వారా తన కార్యకలాపాలను కొనసాగించింది. ప్రస్తుతం లక్షలాది మంది అనుచరులతో, నిరుద్యోగం, విద్యా వ్యవస్థలో లోపాలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ చేస్తూ ఈ వేదిక ఒక బలమైన యువజన ఉద్యమం కొనసాగిస్తోంది. ఇప్పుడు పాత అకౌంట్ కూడా పునరుద్ధరణ కావడంతో, ఈ డిజిటల్ ఉద్యమం మరింత వేగం పుంజుకునే అవకాశం కనిపిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## క్రైమ్ థ్రిల్లర్‌ను తలపిస్తున్న కేతన్ హత్య కేసు: పెళ్లికి ముందే ప్రియుడితో సియా రహస్య వివాహం?

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన పుణె వ్యాపారవేత్త కేతన్ అగర్వాల్ హత్య కేసు రోజురోజుకూ మరిన్ని మలుపులు తిరుగుతోంది. ప్రేమ వ్యవహారం.. పక్కా స్కెచ్‌తో జరిగిన హత్యగా భావిస్తున్న ఈ కేసు దర్యాప్తులో తాజాగా మరో విస్తుపోయే నిజం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న సియా.. తన ప్రియుడు చేతన్‌ను ఇప్పటికే రహస్యంగా వివాహం చేసుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ పరిణామం కేసు విచారణను పూర్తిగా మార్చేసేలా కనిపిస్తోంది.

**నిశ్చితార్థానికి ముందే రహస్య పెళ్లి**

పోలీసుల కథనం ప్రకారం.. వ్యాపారవేత్త కేతన్ అగర్వాల్‌తో సియాకు ఈ ఏడాది ఫిబ్రవరిలో ఘనంగా నిశ్చితార్థం జరిగింది. కుటుంబ సభ్యులు వీరిద్దరికీ వచ్చే నవంబర్‌లో వివాహం జరిపించాలని నిశ్చయించారు. అయితే సియాకు కేతన్‌తో పెళ్లి ఇష్టం లేదని, ఆమె అప్పటికే చేతన్‌తో పీకల్లోతు ప్రేమలో ఉన్నట్లు విచారణలో తేలింది. ఇరు కుటుంబాలకు తెలియకుండా సుమారు నాలుగు నెలల క్రితమే పుణెలోని స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయంలో సియా, చేతన్ ప్రత్యేక వివాహ చట్టం కింద రహస్యంగా వివాహం చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ వివాహానికి వారిద్దరి సన్నిహిత స్నేహితులు ఇద్దరు సాక్షులుగా సంతకాలు కూడా చేసినట్లు సమాచారం.

**వాట్సాప్ చాట్స్, డిజిటల్ ఆధారాలే కీ పాయింట్**

కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు సియా, చేతన్ మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని విశ్లేషించారు. వారి వాట్సాప్ చాట్స్, కాల్ రికార్డులు, ఇతర డిజిటల్ డేటాను క్షుణ్ణంగా పరిశీలించగా ఈ రహస్య వివాహానికి సంబంధించిన గుట్టు రట్టయింది. ప్రస్తుతం ఈ వివాహానికి సంబంధించిన అధికారిక రిజిస్ట్రేషన్ పత్రాలు నిజమైనవేనా? ప్రత్యేక వివాహ చట్టం ప్రకారం సర్టిఫికేట్ జారీ అయిందా? అనే కోణంలో పోలీసులు ధృవీకరణ ప్రక్రియను చేపట్టారు.

**కీలకమైన ఇన్‌స్టాగ్రామ్ ఆధారాలు**

రహస్య వివాహం అనంతరం సియా తన ప్రైవేట్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో కొన్ని వివాహ ఫొటోలను పోస్టు చేసినట్లు పోలీసులు గుర్తించారు. అయితే ఆ తర్వాత ఆమె వాటిని డిలీట్ చేసింది. ప్రస్తుతం సాంకేతిక నిపుణుల సహాయంతో ఆ ఫొటోలను రికవరీ చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఇవి లభిస్తే కేసులో అత్యంత బలమైన డిజిటల్ సాక్ష్యాలుగా మారనున్నాయి.

**ప్రమాదం కాదు.. పక్కా ప్లాన్‌తో హత్య**

జూన్ 18న పుణెలోని చారిత్రక లోహగఢ్ కోట సమీపంలో కేతన్ అగర్వాల్ లోయలో పడి మృతి చెందిన ఘటన మొదట ప్రమాదంగానే అందరూ భావించారు. కానీ ఘటనాస్థలిలో లభించిన ఆధారాలు, ఫోరెన్సిక్ నివేదికలు, నిందితుల కాల్ డేటా ఆధారంగా ఇది పక్కా ప్రణాళికతో జరిగిన హత్య అని పోలీసులు తేల్చారు. చేతన్‌తో తన రహస్య పెళ్లి విషయం బయటపడకుండా ఉండేందుకు అలాగే తమ ప్రేమకు అడ్డుగా ఉన్నాడనే కారణంతోనే సియా, తన ప్రియుడు చేతన్‌తో కలిసి కేతన్‌ను హతమార్చినట్లు ప్రాథమిక దర్యాప్తులో స్పష్టమైంది. ప్రస్తుతం సియా, చేతన్ ఇద్దరూ పోలీసు కస్టడీలో ఉన్నారు. వారి రహస్య వివాహం, సోషల్ మీడియా పోస్టులు, డిజిటల్ కమ్యూనికేషన్స్, అలాగే వీరి వెనుక ఏవైనా ఆర్థిక లావాదేవీలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు నిశితంగా దర్యాప్తు చేస్తున్నారు. రానున్న రోజుల్లో ఈ కేసులో మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది.

## వయనాడ్‌లో సొరంగం నిర్మాణ ప్రాంతంలో ప్రమాదం..

**కొండచరియలు విరిగిపడి ఇద్దరు మృతి**

**హైదరాబాద్ పెన్ పవర్:** కల్లాడిలోని మీనాక్షి వంతెన సమీపంలో సొరంగం నిర్మాణ పనులు జరుగుతున్న ప్రదేశంలో మంగళవారం కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ దుర్ఘటనలో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో పది మంది వరకు మట్టిపెళ్లల కింద చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు.మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అనక్కంపొయిల్-కల్లాడి-మెప్పాడి జంట సొరంగం రహదారి పనులు సాగుతున్న క్రమంలో, ఒక్కసారిగా కొండ పైనుంచి భారీగా మట్టి, రాళ్లు విరిగిపడ్డాయి. సమాచారం అందిన వెంటనే జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్), అగ్నిమాపక మరియు పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో గాయపడిన సుమారు ఎనిమిది మందిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై కేరళ మంత్రి టి. సిద్దిఖీ స్పందిస్తూ, ఇది ముమ్మాటికి మానవ తప్పిదమేనని విమర్శించారు. వదులుగా ఉన్న మట్టిని తొలగించాలని జూన్ 20వ తేదీనే జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ ఈ ఘటనపై అత్యవసర సమావేశం నిర్వహించి, సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు మంత్రులను ఘటనా స్థలానికి పంపారు.గత 24 గంటల్లో వయనాడ్ జిల్లాలో 265 మిల్లీమీటర్ల భారీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో భారత వాతావరణ శాఖ జిల్లాకు 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. పర్యావరణపరంగా అత్యంత సున్నితమైన ఈ ప్రాంతంలో 2024లో సంభవించిన పెను విపత్తులో సుమారు 300 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కురుస్తున్న వర్షం సహాయక చర్యలకు ఆటంకం కలిగిస్తున్నప్పటికీ, శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

# నిర్మాణం పూర్తయిన భవనానికి హైడ్రా అనుమతుల రద్దు -




**హైదరాబాద్ పెన్ పవర్:**
హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో మరో భారీ వివాదం వెలుగులోకి వచ్చింది. నగరంలోని అత్యంత ప్రతిష్టాత్మక ప్రాంతమైన సోమాజిగూడ రాజ్‌భవన్ రోడ్డు పార్క్ హోటల్ సమీపంలో ప్రముఖ నిర్మాణ సంస్థ ప్రదీప్ కన్స్ట్రక్షన్స్' చేపట్టిన భారీ మల్టీ స్టోరీడ్ గ్రూప్ హౌసింగ్ ప్రాజెక్టుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఊహించని షాక్ ఇచ్చింది. హుస్సేన్ సాగర్ గరిష్ట వరద మట్టం పరిధిని ఆక్రమించడంతో పాటు, తీవ్ర వివాదాస్పద భూమిలో ఈ ప్రాజెక్టును నిర్మించారంటూ జీహెచ్ఎంసీ అధికారులు సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ బిల్డింగ్‌కు ఇచ్చిన నిర్మాణ అనుమతులను ఎందుకు రద్దు చేయకూడదో చెప్పాలంటూ బిల్డింగ్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో.. ఈ అపార్ట్‌మెంట్‌లో కోట్లు పోసి ఫ్లాట్లు కొనుగోలు చేసిన వారు షాక్‌కు గురవున్నారు. ప్రదీప్ రెడ్డి బద్వేలు అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి యాజమాన్యంలోని ఈ సంస్థ.. సోమాజిగూడలో 2 సెలర్స్ ం స్టిల్ట్ ం 17 పైఅంతస్తులతో పాటు ఒక భారీ క్లబ్ హౌస్‌తో కూడిన రెండు స్కైస్క్రాపర్ టవర్లను నిర్మించింది. అయితే, ఈ ప్రాజెక్ట్ నిర్మించిన ల్యాండ్ పూర్తిగా వివాదాస్పదమైనదని, పైగా చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తుందని నిర్ధారణ కావడంతో అధికారులు రంగంలోకి దిగారు. జీహెచ్ఎంసీ యాక్ట్, 1955 లోని సెక్షన్ 450 కింద ప్రదీప్ కన్స్ట్రక్షన్స్‌కు మున్సిపల్ అధికారులు షోకాజ్ నోటీసు జారీ చేశారు. నిర్మాణ అనుమతులు పొందే సమయంలో బిల్డింగ్ నిర్వాహకులు అసలు నిజాలను దాచిపెట్టారని , తప్పుడు పత్రాలతో తప్పుదోవ పట్టించి పర్మిషన్లు పొందారని అధికారులు ఈ నోటీసులో ప్రాథమికంగా తేల్చారు.ఈ వివాదాలు ఉన్నందున సదరు 17 అంతస్తుల బిల్డింగ్‌కు సంబంధించి బిల్డర్ దరఖాస్తు చేసుకున్న ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ ను జీహెచ్ఎంసీ పూర్తిగా నిలిపివేసింది. ప్రస్తుతానికి ఈ భవనానికి ఎలాంటి ఓసీ జారీ చేయలేదని అధికారులు స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ తీసుకున్న ఈ ఆకస్మిక చర్యతో సదరు అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్లు కొనుగోలు చేసిన మధ్యతరగతి, ఉన్నత వర్గాల ప్రజలంతా ఒక్కసారిగా రోడ్డున పడే పరిస్థితి ఏర్పడింది. తమ జీవితకాల సంపాదనను, బ్యాంకు లోన్లను నమ్ముకుని కోట్లాది రూపాయలు వెచ్చించి ఈ 17 అంతస్తుల టవర్లలో ఫ్లాట్లు బుక్ చేసుకున్న వారికి ఇప్పుడు ఏం చేయాలో పాలుపోవడం లేదు.

**చట్టప్రకారం**

ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ లేని బిల్డింగ్‌లోకి ప్రవేశించడం, నివసించడం పూర్తిగా చట్టవిరుద్ధం. ఒకవేళ విచారణ అనంతరం జీహెచ్ఎంసీ గనుక బిల్డింగ్ పర్మిషన్‌ను పూర్తిగా రద్దు చేస్తే.. ఈ భవనానికి విద్యుత్, తాగునీటి కనెక్షన్లు కూడా దక్కవు.హైడ్రా , జీహెచ్ఎంసీ జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించిన తర్వాతే ఈ అక్రమాలు వెలుగుచూశాయని టాక్ నడుస్తోంది. బిల్డర్ చేసిన తప్పుకు, తప్పుడు డాక్యుమెంట్లు నమ్మి మోసపోయిన తాము ఇప్పుడు బలిపశువులమయ్యామని కొనుగోలుదారులు లబోదిబోమంటున్నారు. ఒకవైపు బిల్డింగ్ పర్మిషన్ రద్దు ముప్పు, మరోవైపు ఓసీ రాకపోవడంతో.. కొన్న ఫ్లాట్లలోకి ఎప్పుడు అడుగుపెడతామో, అసలు ఈ బిల్డింగ్ నిలుస్తుందో లేదో తెలియని అగమ్యగోచర స్థితిలోకి హోమ్ బైయర్స్ నెట్టబడ్డారు. ఈ వ్యవహారంపై ప్రదీప్ కన్స్ట్రక్షన్స్ ఇచ్చే వివరణపైనే ఈ ప్రాజెక్టు భవితవ్యం ఆధారపడి ఉంది.

## పార్టీ పేరు వివాదంపై ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన కవిత

**హైదరాబాద్ పెన్ పవర్:**
కల్వకుంట్ల కవిత తన కొత్త రాజకీయ పార్టీ పేరు నమోదుకు సంబంధించి నెలకొన్న వివాదంపై ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తాను ప్రతిపాదించిన 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్) పేరుకు అనుమతినిచ్చేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని (ఈసీ) ఆదేశించాలని కోరుతూ ఆమె పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం, ముందుగా ఎన్నికల సంఘం లేవనెత్తిన అభ్యంతరాలకు సమాధానం ఇవ్వాలని కవితకు సూచించింది. ప్రస్తుత దశలో తాము జోక్యం చేసుకోవడం ఎన్నికల సంఘం విధుల్లో తలదూర్చడమే అవుతుందని కోర్టు స్పష్టం చేసింది.
బీఆర్ఎస్ పార్టీ పాత పేరు 'తెలంగాణ రాష్ట్ర సమితి'ని పోలి 'టీఆర్ఎస్' అనే సంక్షిప్త నామం వస్తుండటంతో, దీనిపై జూన్ 23న కేంద్ర ఎన్నికల సంఘం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ పేరు ప్రజల్లో గందరగోళానికి దారితీస్తుందని పేర్కొన్న ఈసీ, 15 రోజుల్లోగా మూడు ప్రత్యామ్నాయ పేర్లను సూచించాలని కవితను ఆదేశించింది. ఎన్నికల సంఘం జారీ చేసిన ఈ ఆదేశాలనే కవిత కోర్టులో సవాలు చేశారు.బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన కవిత, ఈ ఏడాది ఆరంభంలో సొంతంగా రాజకీయ పార్టీని ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఆమె ప్రతిపాదించిన 'తెలంగాణ రక్షణ సేన' పేరుకు ఏప్రిల్‌లో ఈసీ ప్రాథమిక ఆమోదం తెలిపింది. అయితే, ఈ పేరులోని 'టీఆర్ఎస్' అనే సంక్షిప్త రూపం పాత పార్టీని గుర్తుచేస్తోందంటూ 1,100కు పైగా అభ్యంతరాలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల సంఘం కవితకు నోటీసులు జారీ చేసింది.

## హిందూ మఠాధిపతులను తిడితే జగన్ వెనకేసుకొస్తారా?: కోటంరెడ్డి ఫైర్

**హైదరాబాద్ పెన్ పవర్:** హిందూ మఠాధిపతులు, పూజారులను కించపరుస్తూ మాట్లాడిన యూట్యూబర్ రావణ్ (జోసెఫ్)ను వైసీపీ అధినేత జగన్ ఎలా వెనకేసుకొస్తారని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. నెల్లూరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ వైఖరిని ఎండగట్టారు. తనకు దేశభక్తి లేదని స్వయంగా జోసెఫ్ బహిరంగంగా చెబుతుంటే, అలాంటి వ్యక్తిని జగన్ ఏ విధంగా సమర్థిస్తారని ఆయన సూటిగా నిలదీశారు. దేశద్రోహ వ్యాఖ్యలు చేసేవారికి వంతపాడటం నాయకత్వ లక్షణం కాదన్నారు.రావణ్ పై నమోదైన కేసుల విషయాన్ని న్యాయస్థానాలు చూసుకుంటాయని కోటంరెడ్డి స్పష్టం చేశారు. తగిన ఆధారాలు ఉన్నాయి కాబట్టే న్యాయస్థానం అతడిని రిమాండ్‌కు పంపిందని గుర్తుచేశారు. ఇలాంటి సున్నితమైన విషయంలో దేశభక్తి లేని వ్యక్తికి మద్దతు తెలుపుతున్న వైసీపీ అధినేత వైఖరి అత్యంత దుర్మార్గమని తీవ్రంగా ఖండించారు.దేశ వ్యతిరేక వ్యాఖ్యలు చేసిన రావణ్ కు మద్దతిచ్చిన జగన్.. తక్షణమే యావత్ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కోటంరెడ్డి డిమాండ్ చేశారు. ఈరోజు హిందూ మత విశ్వాసాల మీద, సాధుసంతుల మీద విచక్షణారహితంగా దాడి చేసిన ఇలాంటి వ్యక్తులు... రేపు ఇతర మతాలపై దాడి చేయరని గ్యారంటీ ఏమిటని ఆయన ప్రశ్నించారు. సమాజంలో మత సామరస్యాన్ని దెబ్బతీసే వ్యక్తులను రాజకీయ స్వార్థం కోసం ప్రోత్సహించడం మానుకోవాలని ఆయన హితవు పలికారు.

# కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో జోనల్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ ప్రారంభం

**హైదరాబాద్ పెన్ పవర్:**
తెలంగాణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో 3వ జోనల్ లెవల్ పోలీస్ డ్యూటీ మీట్--2026 జూలై మంగళవారం, నేడు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించబడుతున్నాయని సీపీ తెలిపారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ. ఈ డ్యూటీ మీట్‌లో జోన్-3 పరిధిలోని కరీంనగర్, సిద్ధిపేట, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన మొత్తం 91 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొంటున్నారన్నారు. యూనిట్ వారీగా కరీంనగర్ నుంచి 24 మంది, సిద్ధిపేట నుంచి 19 మంది, రాజన్న సిరిసిల్ల నుంచి 21 మంది, కామారెడ్డి నుంచి 13 మంది, మెదక్ నుంచి 14 మంది హాజరవుతున్నారని తెలిపారు.

ఈ డ్యూటీ మీట్ పోలీసు సిబ్బందిలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించడం, శాస్త్రీయ దర్యాప్తు పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, సమర్థవంతమైన సేవల అందింపులో మరింత నైపుణ్యం సాధించేందుకు వేదికగా నిలవనుందని ఆయన అన్నారు.

ఈ సందర్భంగా శాస్త్రీయ దర్యాప్తు యాంటీ సబోటేజ్ చెక్, డాగ్ స్క్వాడ్ పోటీలు, కంప్యూటర్ అవగాహన, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ అంశాల్లో పోటీలు నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని మల్టీ జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారని సీపీ తెలిపారు.

పోటీల్లో విజేతలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకాల ప్రకారం బంగారు పతక విజేతలకు రూ.3 లక్షలు, మూడు అడ్వాన్స్ ఇన్‌క్రిమెంట్లు, వెండి పతక విజేతలకు రూ.2 లక్షలు, రెండు అడ్వాన్స్ ఇన్‌క్రిమెంట్లు, కాంస్య పతక విజేతలకు రూ.1 లక్ష, ఒక అడ్వాన్స్ ఇన్‌క్రిమెంట్ అందజేయబడతాయి. అలాగే జట్టు విజేతలకు నగదు ప్రోత్సాహకాలు కూడా అందజేయనున్నారని అన్నారు.

ఈ డ్యూటీ మీట్‌ను కేవలం పోటీగా కాకుండా వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకునే అవకాశంగా భావించి, క్రమశిక్షణ, అంకితభావం, సేవా తత్వంతో పాల్గొని ఉత్తమ ప్రతిభ

కనబర్చాలని సూచించారు. ఈ డ్యూటీ మీట్ ద్వారా పోలీసు శాఖలో సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం, సమన్వయం మరింత బలోపేతమై ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు దోహదపడుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు శ్రీనివాస్ జి, వేణుగోపాల్, వెంకటస్వామి, ఇతర జిల్లాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎలాంటి పరిస్థితుల్లోనూ రాష్ట్రంలో తాగునీటి సమస్య తలెత్తనివ్వం

**హైదరాబాద్ పెన్ పవర్:** వర్షాలు ఆలస్యమైనా.. ఎల్‌నినో ప్రభావం ఉన్నా ముందస్తు కార్యాచరణతో ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా

జలాశయాల నీటి నిల్వలపై రోజువారీ పర్యవేక్షణ.. అవసరమైతే ప్రత్యామ్నాయ నీటి వనరుల వినియోగానికి ఆదేశాలు

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క అధ్యక్షతన తెలంగాణ డ్రింకింగ్ వాటర్ సప్లయ్ కార్పొరేషన్ బోర్డు సమావేశం తెలంగాణ సచివాలయంలో జరిగింది. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలకు తాగునీటి సరఫరా పరిస్థితి, జలాశయాల్లో నీటి నిల్వలు, రాబోయే నెలల్లో తాగునీటి అవసరాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.

సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ, ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. వర్షాలు ఆలస్యమైనా, వర్షపాతం తగ్గినా, ఎల్‌నినో ప్రభావం ఉన్నా రాష్ట్రంలో ఎలాంటి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అధికారులు పనిచేయాలని ఆదేశించారు.

రాష్ట్రంలోని గ్రామీణ జనావాసాలకు ప్రధానంగా కృష్ణా, గోదావరి బేసిన్‌ల ఉపరితల జల వనరుల నుంచి శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు సమావేశంలో వివరించారు. తాగునీటి కోసం వినియోగిస్తున్న 29 జలాశయాల నుంచి 123 నీటి శుద్ధి కేంద్రాల ద్వారా గ్రామీణ ప్రాంతాలకు నీరు సరఫరా అవుతున్న నేపథ్యంలో, ప్రతి జలాశయంలో 45 రోజులు, 90 రోజులు, 180 రోజుల అవసరాలకు అనుగుణంగా నీటి లభ్యతపై మంత్రి సమీక్షించారు.

అన్ని జలాశయాల్లో నీటి మట్టాలను ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ ఇరిగేషన్ శాఖ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని మంత్రి ఆదేశించారు. తాగునీటి అవసరాలకు సరిపడా నీటి నిల్వలను ప్రతి జలాశయంలో ముందుగానే నిర్ధారించాలని సూచించారు. జూలై నెలాఖరు వరకు తగిన నీటి ప్రవాహం లేకపోతే అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ఉదయసముద్రానికి, తుపాకులగూడెం బ్యారేజ్ నుంచి దుమ్ముగూడెంకు నీటిని విడుదల చేసేలా ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని మంత్రి సీతక్క ఆదేశించారు. ప్రస్తుతం సింగూర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు తక్కువగా ఉన్న నేపథ్యంలో, రాబోయే 45 రోజుల్లో సింగూర్‌లోకి తగిన నీటి ప్రవాహం రాకపోతే సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి (పాక్షికంగా), నిజామాబాద్ (పాక్షికంగా) జిల్లాల్లోని గ్రామీణ జనావాసాలు, పట్టణ ఆధారిత నివాస ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని అధికారులు వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి, ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలాల ఆధారిత తాగునీటి పథకాలను వినియోగించేలా తక్షణమే సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

అలాగే రాష్ట్రంలోని అన్ని నివాస ప్రాంతాలకు స్థానిక మంచి నీటి వనరులను వినియోగిస్తూ ప్రత్యామ్నాయ తాగునీటి సరఫరా వ్యవస్థను సిద్ధంగా ఉంచాలని సూచించారు. స్థానిక నీటి వనరులు అందుబాటులో లేని ప్రాంతాల్లో బోర్‌వెల్‌లను లోతుగా తవ్వడం, ఫ్లషింగ్ చేయడం, అవసరమైతే బోర్‌వెల్‌లను అద్దెకు తీసుకోవడం వంటి చర్యలకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

ఎల్‌నినో ప్రభావం లేదా ఇతర వాతావరణ పరిస్థితుల కారణంగా ఎలాంటి తాగునీటి సంక్షోభం తలెత్తకుండా ప్రభుత్వం పూర్తిస్థాయి అప్రమత్తతతో పనిచేస్తోందని మంత్రి తెలిపారు. ప్రతి గ్రామం, ప్రతి నివాస ప్రాంతానికి నిరంతరాయంగా సురక్షితమైన తాగునీరు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేసి ముందస్తు చర్యలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు.

ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, మిషన్ భగీరథ ఇంజనీర్-ఇన్-చీఫ్ కృపాకర్ రెడ్డి, ఇతర చీఫ్ ఇంజనీర్లు, బోర్డు సభ్యులు పాల్గొన్నారు

# చిరస్మరణీయుడు వైయస్సార్

**హైదరాబాద్ పెన్ పవర్:**
ఇది కేవలం ఒక మహానేత జయంతి మాత్రమే కాదు, పేదవాడి ఆశలు, రైతన్న నమ్మకం, విద్యార్థి భవిష్యత్తు, ప్రజా సంక్షేమానికి ప్రతీకగా నిలిచిన మహోన్నత వ్యక్తిత్వాన్ని స్మరించుకునే పవిత్రమైన రోజు అని వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాయచోటిలో శ్రీకాంత్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజల మధ్య పుట్టి, ప్రజల కోసమే జీవించి, ప్రజల గుండెల్లో శాశ్వత స్థానం సంపాదించిన నాయకుడు డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని కొనియాడారు. అధికారం అంటే ప్రజలకు సేవ చేయడమేనని తన పాలన ద్వారా నిరూపించిన అపూర్వ ప్రజానాయకుడు వైఎస్ఆర్ అని అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్, రుణమాఫీ, జలయజ్ఞం ద్వారా సాగునీటి విప్లవం, పేదలకు ఆరోగ్యశ్రీ, 108, 104 అత్యవసర వైద్య సేవలు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, పేదలకు ఇందిరమ్మ గృహాలు, మహిళలు, వృద్ధులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం అమలు చేసిన పథకాలు, మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్లు భారత సంక్షేమ చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోయాయని తెలిపారు. ప్రజల కష్టాలను చూసి కదిలిన హృదయం వైఎస్ఆర్... రైతు కన్నీటిని తుడిచిన చేయి వైఎస్ఆర్... పేదవాడి ఇంట్లో ఆశదీపం వెలిగించిన నాయకుడు వైఎస్ఆర్. సంక్షేమాన్ని ప్రభుత్వ విధానంగా మార్చిన మహానేత వైఎస్ఆర్‌వైఎస్ఆర్ ఒక పేరు కాదు పేదల గుండెల్లో చెరగని నమ్మకం.. వైఎస్ఆర్ ఒక వ్యక్తి కాదు. తరతరాలకు స్ఫూర్తినిచ్చే మహోన్నత శక్తి అని శ్రీకాంత్ రెడ్డి అన్నారు. రాయచోటి ప్రాంతంపై వైఎస్ఆర్‌కు ఉన్న ప్రత్యేక మమకారం కారణంగానే తాగునీటి పథకాలు, రింగ్ రోడ్డు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఇతర విద్యాసంస్థలు, సాగునీటి ప్రాజెక్టులు, పలు అభివృద్ధి కార్యక్రమాలు సాకారమయ్యాయని గుర్తు చేశారు. వెలిగల్లు, జరికోన, శ్రీనివాసపురం ప్రాజెక్టులు ఈ ప్రాంత అభివృద్ధికి శాశ్వత చిహ్నాలుగా నిలిచాయని పేర్కొన్నారు. వైఎస్ఆర్ చూపిన సంక్షేమ మార్గాన్ని వైఎస్ఆర్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన పాలనలో మరింత విస్తృతంగా అమలు చేసి ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలను అందించారని ఆయన తెలిపారు. వైఎస్ఆర్ ఆశయాల సాధనే వైఎస్ఆర్ సీపీ లక్ష్యమని స్పష్టం చేశారు. దేశ రాజకీయాల్లో సంక్షేమ పాలనకు కొత్త నిర్వచనం ఇచ్చిన మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం భారత రత్న పురస్కారాన్ని ప్రకటించాలని శ్రీకాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. జూలై 8న నిర్వహించే వైఎస్ఆర్ జయంతి కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, యువత, రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహానేతకు ఘనంగా నివాళులర్పించాలని శ్రీకాంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# ముందే పెళ్లి చేసుకున్న సియా

**హైదరాబాద్ పెన్ పవర్:**
పుణేలోని లోహగడ్ కోటపై జరిగిన హత్య కేసులో రోజుకో సంచలన విషయం వెలుగులోకి వస్తోంది. ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న సియా గోయల్ (20), తన బాయ్‌ఫ్రెండ్ చేతన్ చౌదరిని అప్పటికే రహస్యంగా వివాహం చేసుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో కీలక సమాచారం బయటపడింది. పుణేకు చెందిన రియల్టర్ కేతన్ అగర్వాల్‌తో (25) ఆమెకు నిశ్చితార్థం జరిగిన తర్వాత ఈ వివాహం జరగడం గమనార్హం. పోలీసు వర్గాల కథనం ప్రకారం.. సుమారు నాలుగు నెలల క్రితం సియా, చేతన్ ఒక స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రత్యేక వివాహ చట్టం కింద పెళ్లి చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ వివాహానికి సియా కాలేజీ స్నేహితులు ఇద్దరు సాక్షులుగా సంతకాలు చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వారిని కూడా విచారించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ రహస్య వివాహాన్ని నిర్ధారించుకునేందుకు పోలీసులు మ్యారేజ్ సర్టిఫికెట్ కోసం గాలిస్తున్నారు. ఈ జంట పెళ్లి దండలతో ఉన్న కొన్ని ఫొటోలను ఒక ప్రైవేట్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుంచి డిలీట్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఆ ఫొటోలను తిరిగి పొందేందుకు టెక్నికల్ బృందాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఈ ఫొటోలు దొరికితే కేసులో ఇవి కీలక ఆధారాలుగా మారనున్నాయి. ఈ ఏడాది నవంబర్‌లో కేతన్, సియాల వివాహం ఉదయ్‌పూర్‌లో జరిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలో డెస్టినేషన్ వెడ్డింగ్ కోసం కేతన్ కుటుంబ సభ్యులు సియా డాక్యుమెంట్లు అడగడంతో రహస్య వివాహ విషయం బయటపడుతుందనే భయంతోనే హత్యకు ప్లాన్ వేగవంతం చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. తప్పనిసరి పబ్లిక్ నోటీసును తప్పించుకుని, రహస్య వివాహాన్ని త్వరగా పూర్తి చేయడానికి చేతన్ ఏమైనా మధ్యవర్తికి డబ్బులు చెల్లించాడా? అనే కోణంలో అతని బ్యాంక్ ఖాతాలను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. కేతన్ అగర్వాల్‌తో పెళ్లి ఇష్టం లేని సియా, జూన్ 18న అతడిని లోహగడ్ కోటకు తీసుకెళ్లి బాయ్‌ఫ్రెండ్‌తో కలిసి హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటోంది. ప్రస్తుతం సియా గోయల్, చేతన్ చౌదరి ఇద్దరూ జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

## విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

**హైదరాబాద్ పెన్ పవర్:** పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలంలో కొత్తపల్లి గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం నోటు పుస్తకాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. నరసరావుపేటకు చెందిన కృష్ణవేణి డిగ్రీ కాలేజీ డైరెక్టర్ కోమటినేని నాసరయ్య 15వేల రూపాయలు విలువ చేసే నోటు పుస్తకాలు, పలకలు, పెన్సిల్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ప్రాథమిక విద్య నుండి ఉపాధ్యాయులు చెప్పిన విద్యాబోధనలను శ్రద్ధగా విని, బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భీష్మారావు, విశ్రాంత ఉపాధ్యాయులు కోమటినేని వెంకటేశ్వర్లు, నవచైతన్య, ఉపాధ్యాయులు మల్లిఖార్జునరావు, ఇమామ్ ఖాశిం సైదులు , శ్రీ లక్ష్మి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఏపి రైతుసంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా మణి ఎన్నిక

**హైదరాబాద్ పెన్ పవర్:** ఏలూరు జిల్లాలో జూలై 3, 4, 5 తేదీల్లో జరిగిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 23వ మహాసభలు విజయవంతంగా ముగిశాయి ఈ మహాసభల సందర్భంగా చిట్వేలి ప్రాంతానికి చెందిన పందికాళ్ళ మణి ని రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పందికాళ్ళ మణి తెలిపారు. చిట్వేలి లో మణి మాట్లాడుతూ జిల్లాలో వరి, వేరుశనగ తదితర పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, పండ్ల తోటలకు పేరుగాంచిన రైల్వే కోడూరు ప్రాంతంలో బొప్పాయి, మామిడి, అరటి పంటలు ఎక్కువగా పండిస్తారని గిట్టుబాటు ధర లేక రైతులు అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారని అన్నారు. ఈ సంవత్సరం ధరలు లేక తోతాపురి రకం కాయలను తోటలోనే చెట్లకు వదిలేయడం చాలా బాధాకరమని అన్నారు ప్రభుత్వ స్పందించి పండ్ల తోటలకు గిట్టుబాటు ధర, హార్టికల్చర్ హబ్ గా మార్చి కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర కమిటీకి, జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలియజేశారు.

# సిద్దిపేట జిల్లాలో లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తహసీల్దార్

**హైదరాబాద్ పెన్ పవర్:** సిద్దిపేట జిల్లాలో ఒక ప్రభుత్వ అధికారి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. చేర్యాల తహసీల్దార్‌గా విధి నిర్వహణలో ఉన్న కొర్రా దిలీప్ నాయక్, రూ.70,000 లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు సోమవారం అరెస్ట్ చేశారు. ఏసీబీ అధికారులు విడుదల చేసిన పత్రికా ప్రకటన ప్రకారం, నాగపురి గ్రామంలోని పలు సర్వే నంబర్లకు సంబంధించి 11 నాలా (వ్యవసాయేతర భూమి మార్పిడి) దరఖాస్తుల ప్రాసెసింగ్ కోసం ఫిర్యాదుదారుడి నుంచి తహసీల్దార్ ఈ లంచం డిమాండ్ చేశారు. జమున కనకమ్మ మరియు ఇతరుల పేర్లపై ఉన్న 30 గుంటల భూమికి సంబంధించిన పనుల నిమిత్తం ఆయన ఈ మొత్తాన్ని తీసుకున్నారు. సోమవారం మధ్యాహ్నం చేర్యాలలోని తన కార్యాలయంలోనే దిలీప్ నాయక్ లంచం తీసుకుంటుండగా, పక్కా ప్రణాళికతో ఏసీబీ అధికారులు ఆయనను పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దిలీప్ నాయక్‌ను అరెస్ట్ చేసి, హైదరాబాద్‌లోని ఏసీబీ కేసుల విచారణ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఎవరైనా అధికారులు లంచం డిమాండ్ చేస్తే తమ టోల్-ఫ్రీ నెంబర్ 1064కు సమాచారం అందించాలని ఏసీబీ ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

## ఉగ్రం' రైఫిల్‌కు కేంద్రం పచ్చజెండా..

**హైదరాబాద్, జూలై 7:** రక్షణ రంగంలో 'ఆత్మనిర్భర్ భారత్' స్ఫూర్తితో మరో కీలక ముందడుగు పడింది. తెలంగాణకు చెందిన స్టార్టప్ సంస్థ 'ద్విప డిఫెన్స్' స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 7.62ఇ51 ఎంఎం 'ఉగ్రం' అసాల్ట్ రైఫిల్, భారత సైన్యం మరియు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఏ) నిర్వహించిన కఠిన పరీక్షల్లో విజయవంతంగా ఉత్తీర్ణత సాధించింది. ఈ ఫలితంతో కేంద్ర సాయుధ పోలీస్ బలగాల (సీఏపీఎఫ్) అమ్ములపొదిలోకి ఈ స్వదేశీ ఆయుధం చేరేందుకు మార్గం సుగమమైంది. రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) పరిధిలోని 'ఆర్మమెంట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్' (ఏఆర్‌డీఈ) సహకారంతో ద్విప డిఫెన్స్ కేవలం 100 రోజుల రికార్డు సమయంలో ఈ రైఫిల్ ప్రోటోటైప్‌ను సిద్ధం చేసింది. దేశంలోని విభిన్న వాతావరణ పరిస్థితుల్లో నిర్వహించిన ఫీల్డ్ ట్రయల్స్, విశ్వసనీయత మరియు సామర్థ్య పరీక్షల్లో ఇది తన సత్తా చాటింది. దీంతో సీఆర్పీఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ, ఎన్ఎస్‌జీ వంటి భద్రతా బలగాల్లో దీన్ని ప్రవేశపెట్టే ప్రక్రియ వేగవంతం కానుంది. 'ఉగ్రం' రైఫిల్ బరువు 4 కిలోల కంటే తక్కువగా ఉండి, 500 మీటర్ల దూరంలోని లక్ష్యాలను సైతం అత్యంత కచ్చితత్వంతో ఛేదించగలదు. ఇందులో 20 రౌండ్ల సామర్థ్యం గల మ్యాగజైన్ ఉండగా, ఇది సింగిల్ మరియు ఫుల్ ఆటోమేటిక్ ఫైరింగ్ మోడ్‌లను సపోర్ట్ చేస్తుంది. ముఖ్యంగా ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలు, క్లిష్టమైన ఆపరేషన్ల కోసం దీనిని ప్రత్యేకంగా రూపొందించారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో కేటాయించిన 13 ఎకరాల స్థలంలో ద్విప డిఫెన్స్ తన తయారీ కేంద్రాన్ని నెలకొల్పింది. ఈ విజయంపై కంపెనీ ఎండీ సిబు జోసెఫ్ స్పందిస్తూ, వివిధ భద్రతా బలగాల నుంచి ఈ రైఫిల్‌కు మంచి ఆదరణ లభించగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పరిణామంతో రక్షణ రంగ పరికరాల తయారీ కేంద్రంగా అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ స్థానం మరింత పటిష్ఠమైంది.

# సిరియా పర్యటనలో ఉన్న ఫ్రాన్స్ అధ్యక్షుడు

**హైదరాబాద్ పెన్ పవర్:** సిరియా పర్యటనలో ఉన్న ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌కు పెను ప్రమాదం తప్పింది. రాజధాని డమస్కస్‌లో ఆయన బస చేసిన హోటల్ సమీపంలో మంగళవారం వరుస పేలుళ్లు సంభవించడం తీవ్ర కలకలం రేపింది. అయితే, ఈ ఘటనలో మాక్రాన్ సురక్షితంగా ఉన్నారని, పేలుళ్ల తర్వాత కూడా ఆయన తన పర్యటనను యథావిధిగా కొనసాగించారని ఫ్రాన్స్ అధ్యక్ష భవనం (ఎలీసీ) ప్రకటించింది. రాయిటర్స్ కథనం ప్రకారం, డమస్కస్‌లోని మాక్రాన్ బస చేసిన హోటల్‌కు సమీపంలో ఈ బాంబు పేలుళ్లు జరిగాయి. ఈ ఘటనను సిరియా భద్రతా వర్గాలు ధ్రువీకరించాయి. పేలుళ్ల అనంతరం అధికారులు వెంటనే అప్రమత్తమై ఆ ప్రాంతానికి వెళ్లే రహదారులను మూసివేసి, భద్రతను కట్టుదిట్టం చేశారు. సంఘటనా స్థలం నుంచి పొగలు వస్తున్నట్లు రాయిటర్స్ ప్రతినిధి ఒకరు తెలిపారు. పేలుళ్లు జరిగిన సమయంలో మాక్రాన్ తన కాన్వాయ్‌లో వేరే కార్యక్రమానికి వెళుతున్నారని, ఆయనకు పేలుళ్ల శబ్దం కూడా వినిపించలేదని ఫ్రాన్స్ అధ్యక్ష కార్యాలయం స్పష్టం చేసింది. ఆయనతో పాటు ఉన్న రాయిటర్స్ జర్నలిస్ట్ కూడా ఈ విషయాన్ని నిర్ధారించారు. ఈ ఘటన జరిగినప్పటికీ, మాక్రాన్ ముందుగా నిర్ణయించుకున్న షెడ్యూల్ ప్రకారం సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్-షరాతో అధ్యక్ష భవనంలో సమావేశమయ్యారు. 2024లో బషర్ అల్-అస్సాద్ ప్రభుత్వాన్ని కూలదోసిన తర్వాత, ఒక యూరోపియన్ యూనియన్ దేశాధినేత సిరియాలో పర్యటించడం ఇదే తొలిసారి. అల్-షరా నేతృత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటికీ, దేశంలో భద్రతాపరమైన సవాళ్లు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మాక్రాన్ పర్యటన సందర్భంగా జరిగిన ఈ పేలుళ్లు అక్కడి ఉద్రిక్త పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. ఈ దాడికి ఇప్పటివరకు ఏ సంస్థ బాధ్యత తీసుకోలేదు.

## ప్రకాశ్ రాజ్‌పై కదిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బీజేపీ నేతలు

**హైదరాబాద్ పెన్ పవర్:**
ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్‌పై ఆంధ్రప్రదేశ్ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, ఇతర బీజేపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హిందూ సమాజాన్ని కించపరిచేలా, కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టేలా ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపిస్తూ కదిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు దాఖలు చేసినట్లు బీజేపీ నేతలు తెలిపారు. ఈ మేరకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. "ప్రకాశ్ రాజ్ హిందూ సమాజంపై చేస్తున్న అవమానకర వ్యాఖ్యలను బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను అవమానించే చర్యల వెనుక ఆయన ప్రోద్బలం ఉంది" అని ఆరోపించారు. అంతేకాకుండా, వివాదాస్పద యూట్యూబర్ జోసెఫ్‌కు, దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ హిందూ సమాజాన్ని అవమానించే ప్రకాశ్ రాజ్‌కు మద్దతిస్తున్న వైసీపీ, సీపీఐ, సీపీఎం పార్టీలు తమ వైఖరిని స్పష్టం చేయాలని విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆ పార్టీలు, ప్రకాశ్ రాజ్ వెంటనే హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని అన్నారు. ప్రకాశ్ రాజ్‌తో పాటు ఆయన వెనుక ఉన్న శక్తులపై చట్టపరంగా విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# టీఆర్పీలపై కేంద్రం నిషేధం...

**హైదరాబాద్, జూలై 7, పెన్ పవర్:** టీవీ చానెల్స్ కి కేంద్ర ప్రభుత్వం ఊహించని షాక్ ఇచ్చింది. టీవీ చానెల్స్ ఆదాయానికి కొలమానం గా నిలిచే ౧=ా రేటింగ్స్ పై నిషేధం విధిస్తు కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ రేటింగ్స్ ఆధారంగానే టీవీ చానెల్స్ కి కమర్షియల్ యాడ్స్ వస్తుంటాయి. రేటింగ్స్ ని బట్టే టీవీ చానెల్స్ యాజమాన్యాలు భారీ రేంజ్ యాడ్స్ ద్వారా డబ్బులు సంపాదిస్తూ ఉంటారు. ఇకపై అలాంటి అవకాశాలు తగ్గిపోనున్నాయి. దేశం లోని అన్ని రకాల టీవీ చానెల్స్ ర్యాంకింగ్స్ , రేటింగ్స్ ని నిలిపివేస్తూ కేంద్ర సమాచార, ప్రసారాల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గతం లో ఈ టీఆర్పీ రేటింగ్స్ వ్యవహారం లో తీవ్రమైన వివాదాలు తలెత్తాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం న్యూస్ చానెల్స్ రేటింగ్స్ ని నిలిపివేసింది.ఇప్పుడు లేటెస్ట్ గా జనరల్ ఎంటర్టైన్మెంట్ , సినిమా , స్పోర్ట్స్ సహా అన్ని రకాల ఎంటర్టైన్మెంట్ చానెల్స్ కి కూడా రేటింగ్స్ ని నిలిపివేసింది. ఈ కఠిన నిర్ణయం వెనుక కారణాలు ఉన్నాయి. కొన్ని ఛానళ్ళు అనుచిత , అక్రమ పద్ధతులు అనుసరించడమే అందుకు ప్రధాన కారణం. బ్రాడ్కాస్ట్ ఆడియన్స్ రీసెర్చ్ కౌన్సిల్ లెక్కిస్తున్న ప్రస్తుత బార్-ఓ-మీటర్ల వ్యవస్థను కొన్ని పెద్ద నెట్ వర్కులు మేనేజ్ చేస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. తప్పుడు పద్ధతుల్లో రేటింగ్స్ ని పెంచుకొని ప్రకటనదారులు మోసం చేస్తున్నాయనే ఆరోపణలు ఈమధ్య కాలం లో ఎక్కువగా వెల్లువెత్తాయి. కేవలం రేటింగ్స్ రేసులో ముందంజలో ఉండడం కోసం ఛానళ్ళు కంటెంట్ లోని నాణ్యత ని దిగజారుస్తున్నారని , అది సమాజం పై తీవ్రమైన ప్రతికూల ప్రభావాన్ని చూపుతోందని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది.ప్రస్తుతం అమల్లో ఉన్న ఈ టీఆర్పీ రేటింగ్స్ విధానానికి ప్రత్యామ్నాయంగా పారదర్శకతతో కూడిన వ్యవస్థని తీసుకొని రావాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం సాంకేతిక నిపుణులు , ఐటీ రంగ నిపుణులతో కూడిన ఒక ఉన్నత స్థాయి కమిటీని కూడా ఏర్పాటు చేసింది కేంద్ర ప్రభుత్వం. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా సూచనల ప్రకారం డిజిటల్ సెట్-టాప్ బాక్సుల ద్వారా వచ్చే డేటాను రియల్-టైమ్లో పారదర్శకంగా చూసే విధానాన్ని ఈ ప్రత్యామ్నాయ వ్యవస్థ కోసం పరిశీలిస్తున్నారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం టెలివిజన్ ఇండస్ట్రీ ని , అడ్వర్టైజింగ్ రంగాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఎందుకంటే ప్రతీ ఏటా వేల కోట్ల రూపాయిల ఆదాయం యాడ్స్ రూపం లో వచ్చేవి , ఇవన్నీ రేటింగ్స్ ఆధారంగానే జరిగేవి. ఇప్పుడు కొత్త వ్యవస్థ అమ్మల్లోకి వచ్చే వరకు రేటింగ్స్ నిలిపివేయడం వల్ల వంద కోట్ల నష్టాలు వాటిల్లే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరి రాబోయే రోజుల్లో ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో చూడాలి.

## కొత్త నేమ్ ... చైతన్యకు కలిసొస్తుందా...

**హైదరాబాద్, జూలై 7, పెన్ పవర్:** ఒకప్పుడు అక్కినేని ఫ్యామిలీకి చాలా మంచి క్రేజ్ ఉండేది. నాగేశ్వరరావు ఎన్నో వైవిధ్యమైన పాత్రలను చేసి ప్రేక్షకుల్లో విశేషమైన ఆదరణను సంపాదించుకున్నాడు. ఎన్టీఆర్ తో పాటు పోటీపడి నటించి ప్రేక్షకుల మన్ననలు పొందుతున్నాడు. ఇక ఆయన తర్వాత తన నట వారసుడిగా ఇండస్ట్రీ ఎంట్రీ ఇచ్చిన నాగార్జున సైతం ఇండస్ట్రీలో ఉన్న టాప్ హీరోల్లో తను కూడా ఒకడిగా ఎదిగాడు. ఇక ఇలాంటి క్రమంలోనే ఆ ఫ్యామిలీ నుంచి వచ్చిన మూడోతరం హీరోలు ఎంత మాత్రం వాళ్ళ సత్తాను చాటులేక పోతున్నారు. కారణం ఏంటి అంటే వాళ్ళు ఎంచుకున్న సబ్జెక్టులు ప్రేక్షకులను ఏమాత్రం అట్రాక్ట్ చేయలేకపోతున్నాయి. మిగతా హీరోలతో పోలిస్తే వీళ్ళు చాలా వరకు వెనుకబడిపోయారనే చెప్పాలి. ఇలాంటి క్రమంలోనే అఖిల్ ప్రస్తుతం లెనిన్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నాడు.ఈ సినిమాతో ఎలాగైనా సరే తనకంటూ ఒక స్టాండర్డ్ ను ఏర్పాటు చేసుకోవాలనే ప్రయత్నంలో ఉన్నాడు. దానికోసమే ఆయన శతవిధాల కష్టపడుతున్నాడు. ఇక దాంతో పాటుగా తన పేరును నాగ అఖిల్ అని మార్చుకున్నట్టుగా కూడా తెలుస్తుంది. లెనిన్ మూవీ టైటిల్ లో నాగ అఖిల్ గా మనం చూడబోతున్నాం. వాళ్ల ఫ్యామిలీ లో ఉన్న హీరోలందరికి నాగ అనేది వస్తే సక్సెస్ సాధిస్తారు అనే ఒక నమ్మకాన్ని వాళ్ళు ఫాలో అవుతున్నారు.నాగేశ్వరరావు దగ్గర నుంచి నాగచైతన్య వరకు ప్రతి ఒక్కరికి పేరు ముందు నాగ అనేది కామన్ అయిపోయింది. అందుకే అఖిల్ సైతం తన పేరును నాగ అఖిల్ గా మార్చుకున్నట్టుగా తెలుస్తుంది. పేరు మార్చినంత మాత్రాన సక్సెస్ లు వస్తాయా అని కొంతమంది కామెంట్స్ చేస్తున్నారు.ఇక ఏది ఏమైనా కూడా కొన్ని సెంటిమెంట్లను ఫాలో అవుతూ ముందుకు సాగినప్పుడే ఇండస్ట్రీలో సక్సెస్ లను సాధించగలం అనే ఒక కాన్ఫిడెంట్ తో అఖిల్ ముందుకు సాగుతున్నట్టుగా తెలుస్తుంది. ఇక ఏది ఏమైనా లెనిన్ సినిమాతో ఆయన సక్సెస్ ని సాధించాల్సిన అవసరమైతే ఉంది...

# ప్రహ్లాదపురంలో ఘోరం:

### వృద్ధురాలిని హత్య చేసి, బంగారం దోచుకెళ్లిన దుండగులు

**పెందుర్తి: పెన్ పవర్:** స్థానిక ప్రహ్లాదపురంలో అర్ధరాత్రి వేళ ఓ దారుణ ఘటన వెలుగుచూసింది. ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న కర్రీ పైడమ్మ (72) అనే వృద్ధు రాలిని గుర్తుతెలియని దుండగులు అత్యంత కిరాతకంగా దాడి చేసి హత్య చేశారు. అనంతరం ఆమె శరీరంపై ఉన్న బంగారు ఆభరణాలను దోచుకుని పారిపోయారు ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 112 ద్వారా పోలీసులకు సమా చారం అందించారు దీంతో పెందుర్తి సీఐ సతీశ్ కుమార్ తన సిబ్బందితో కలిసి వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు క్లూస్ టీమ్ రంగంలోకి దిగి అక్కడ లభించిన ఆధారాలను సేకరించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ను వేగవంతం చేశారు ఈ ఘోర కలికలం స్థానిక ప్రజల్లో తీవ్ర భయాం దోళనలను కలకలాన్ని రేపింది.

## డిజిటల్' పాలిటిక్స్ వర్సెస్ 'రోడ్ పాలిటిక్స్

**హైదరాబాద్, జూలై 7, పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు అత్యంత కీలకమైన, అనూహ్యమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. మాజీ మంత్రి జగదీష్ రెడ్డి అన్నట్లు బీఆర్ఎస్ ఇంకా పూర్తిస్థాయి ప్రతిపక్ష పాత్ర పోషించడం లేదు అనే అసంతృప్తి నిజమేనని నిరూపిస్తూ.. గులాబీ గూటిలో పెద్ద చీలికే వచ్చేసింది. కేటీఆర్ లీడర్షిప్ స్టైల్ నచ్చక, పార్టీ అంతర్గత విభేదాలతో బీఆర్ఎస్ నుండి సస్పెండ్ అయిన కల్వకుంట్ల కవిత.. ఏకంగా తెలంగాణ రక్షణ సేన పేరుతో సరికొత్త ప్రాంతీయ పార్టీని స్థాపించి జోరుగా ప్రజల్లోకి వెళ్తున్నారు. కేటీఆర్ కేవలం సోషల్ మీడియా వేదికగా, ఏసీ రూముల్లో ప్రెస్ మీట్లు పెడుతూ డిజిటల్ పోరాటాలు చేస్తుంటే.. సొంత పార్టీ పెట్టుకున్న కవిత మాత్రం పాత ఉద్యమ శైలిని అందిపుచ్చుకుని నేరుగా రోడ్లెక్కి వీధి పోరాటాలు చేస్తుండటం గులాబీ కేడర్లో హాట్ టాపిక్గా మారింది.కార్పొరేట్ తరహాలో సాగే కేటీఆర్ హైటెక్ పాలిటిక్స్కు కాలం చెల్లిందని భావించిన కవిత.. గ్రౌండ్ లెవెల్లో కరడుగట్టిన తెలంగాణ సెంటిమెంట్ను, నిరుద్యోగుల సమస్యలను ఎజెండాగా మార్చుకున్నారు. ఇటీవల బోడుప్పల్ పరిధిలో ప్రభుత్వ భూముల కేటాయింపు, ఉద్యమకారుల సంక్షేమం కోసం తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ఆమె నేరుగా రంగంలోకి దిగి, పోలీసులతో వాగ్వాదానికి దిగి రోడ్డుపై బైఠాయించి అరెస్టయ్యారు. కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యాక ఇలా లాఠీలకు ఎదురునిలిచి అరెస్ట్ అయిన దాఖలాలు లేకపోవడంతో.. బీఆర్ఎస్ కిందిస్థాయి కేడర్ ఇప్పుడు కవిత నాయకత్వం గురించి చర్చించుకుంటున్నారు. సమస్యల పై పోరాడే అసలైన వారసురాలు కవితే అనే నరేటివ్ను ఆమె క్షేత్రస్థాయిలో బలంగా నిర్మిస్తున్నారు. అయితే కవితకు సమస్యలు సమస్యలు వస్తున్నాయి. ఆమె ప్రతిపాదించిన తెలంగాణ రక్షణ సేన ౧=ా అనే సంక్షిప్త నామంపై తీవ్ర అభ్యంతరాలు రావడంతో.. 15 రోజుల్లోగా మూడు ప్రత్యామ్నాయ పేర్లను సమర్పించాలని, లేదంటే అప్లికేషన్ క్లోజ్ చేస్తామని ఈౖ స్పష్టం చేసింది. అయితే, పేరు మార్చే ప్రసక్తే లేదని, అవసరమైతే న్యాయపోరాటం చేస్తానని కవిత సవాల్ విసిరారు.ఈ విప్లవాత్మక పోరాటాలు, కొత్త పార్టీ స్థాపన కవిత రాజకీయ భవిష్యత్తుకు ఖచ్చితంగా ఒక టర్నింగ్ పాయింట్గా మారేలా కనిపిస్తున్నాయి. కేసీఆర్ స్థాపించిన పాత తెలంగాణ రాష్ట్ర సమితి ని భారత్ రాష్ట్ర సమితి గా మార్చడం వల్లే తెలంగాణలో పార్టీ అధికారం కోల్పోయిందని నమ్మే పాత ఉద్యమకారులంతా ఇప్పుడు కవిత వెంటే నడవడానికి సిద్ధమవుతున్నారు. తాము రక్తం, చెమట చిందించి నిర్మించుకున్న ౧=ా అనే ఐడెంటిటీని తానే కాపాడుకుంటానని కవిత చెప్పడం సెంటిమెంట్గా కేడర్ను అమితంగా ఆకర్షిస్తోంది. ఈ కొత్త పొలిటికల్ ఈక్వేషన్ కేటీఆర్ను తీవ్ర రక్షణలో పడేస్తోంది. ఒకవైపు అధికార కాంగ్రెస్ను ట్విట్టర్లో ఢీకొట్టడం కంటే.. సొంత చెల్లెలు పెట్టిన పార్టీ వైపుకు తమ కేడర్ వలస వెళ్లకుండా చూసుకోవడమే కేటీఆర్కు ఇప్పుడు పెద్ద టాస్క్గా మారింది. కవిత రోడ్లెక్కి మైలేజ్ పెంచుకుంటుంటే.. బీఆర్ఎస్ ఇంకా కేవలం ట్వీట్లకే పరిమితమైతే, భవిష్యత్తులో తెలంగాణలో అసలైన ప్రతిపక్ష హోదాను కూడా కవిత కొత్త పార్టీ చేజిక్కించుకునే ప్రమాదం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ముగింపుగా చూస్తే.. అన్న 'డిజిటల్ వాట్సాప్' పాలిటిక్స్ చేస్తుంటే, చెల్లెలు మాత్రం 'రోడ్ పాలిటిక్స్' తో తెలంగాణ అసెంబ్లీ సమీకరణాలను మార్చడానికి దూసుకుపోతున్నారు. ఈ అన్నదమ్ముల, అన్నాచెల్లెళ్ల పొలిటికల్ వార్ రాబోయే రోజుల్లో ఏ మలుపు తిరుగుతుందో చూడాలి.

# దూలపల్లి-షాపూర్ రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

**హైదరాబాద్ పెన్ పవర్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దూలపల్లి నుంచి షాపూర్ వరకు రోడ్డు విస్తరణ పనులను మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ ప్రారంభించారు. దూలపల్లి 289 డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బైరి భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు.
ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ రహదారికి శిలాఫలకం ఏర్పాటు చేసినప్పటికీ దాదాపు పదేళ్లుగా పనులు ప్రారంభం కాలేదని విమర్శించారు. కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్ బైరిభాస్కర్గౌ డ్ తన దృష్టికి ఈ సమస్యను తీసుకురావడంతో కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్చార్జిగా రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబుతో మాట్లాడి రూ.10 కోట్ల నిధులు మంజూరు
చేయించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు అవసరమైన ప్రతి విషయంలో తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్, బైరి భాస్కర్ గౌడ్, జెమీ భాస్కర్, కావలి మోహన్, నగేష్, బొబ్బ రంగారావు, చాంద్ పాషా, బూసిరెడ్డి వాణి, నాగలక్ష్మి, బుచ్చిరెడ్డి, మధు మోహన్ తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# మహారాష్ట్రను ముంచెత్తుతున్న వానలు 200 మిమీ కంటే ఎక్కువ వర్షపాతం నమోదు

**ముంబై, జూలై 7, పెన్ పవర్:**
మహారాష్ట్ర వ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు ఉగ్రరూపం దాల్చాయి. గత 48 గంటలుగా కురుస్తున్న అసాధారణ భారీ వర్షాలకు ఆర్థిక రాజధాని ముంబైతో పాటు సాంస్కృతిక రాజధాని పుణె నగరం పూర్తిగా స్తంభించిపోయాయి. ముఖ్యంగా పుణె జిల్లాలోని పశ్చిమ కనుమలు పరిధిలో మేఘమథనం జరుగుతోంది. ఘాట్ సెక్షన్లలోని పలు వాతావరణ కేంద్రాల్లో ఇప్పటికే 200 మిమీ కంటే ఎక్కువ వర్షపాతం నమోదు కాగా, పుణె నగర పరిసర ప్రాంతాల్లో సగటున 100 మిమీ మార్కును దాటేసింది. ఈ జలప్రళయం కారణంగా ఇటు పుణె, అటు ముంబై, కొంకణ్ రీజియన్లలో జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తమైంది. భారత వాతావరణ శాఖ ముంబై, ఠాణే, పాల్ఘర్, రాయ్గఢ్ జిల్లాలకు అత్యంత ప్రమాదకరమైన రెడ్ అలర్ట్ జారీ చేసింది.
ఈ భారీ వర్షాల ధాటికి ముంబై-పుణె నగరాల మధ్య రవాణా వ్యవస్థ పూర్తిగా పడకేసింది. నిరంతరాయంగా కురుస్తున్న వానలకు ముంబై-పుణె ఎక్స్ప్రెస్వే లోని ఖోపోలి-కుస్గావ్ మిస్సింగ్ లింక్ సొరంగం సమీపంలో భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. టన్నుల కొద్దీ రాళ్లు, మట్టి రోడ్డుపైకి దూసుకురావడంతో ఎక్స్ప్రెస్వేతో పాటు పాత ముంబై-పుణె హైవేపై కూడా రాత్రీపగలు ట్రాఫిక్ను పూర్తిగా నిలిపివేశారు. ముంబై డివిజన్ పరిధిలోని థాకుర్వాడి - మంకీ హిల్ సెక్షన్ల మధ్య రైల్వే ట్రాక్లపై కూడా కొండరాళ్లు పడటంతో ముంబై-పుణె మధ్య నడిచే ఇంటర్సిటీ మరియు సుదూర ప్రాంతాల రైళ్లను రైల్వే శాఖ రద్దు చేసింది లేదా దారిమళ్లించింది. వర్షాల తీవ్రతను దృష్ట్యా ముంబై, పుణె, ఠాణే, నవీ ముంబై పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీలకు విద్యాశాఖ తక్షణ సెలవు ప్రకటించింది. ప్రైవేట్ ఆఫీసుల ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇవ్వాలని విపత్తు నిర్వహణ శాఖ సూచించింది. రహదారులపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. పుణె జిల్లాలోని మావల్ తహసీల్ పరిధిలో ఒక ఇల్లు కొండచరియల కింద నలిగిపోగా, ఇంద్రాయణి నది ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో ఆలంది మున్సిపల్ కౌన్సిల్ నదిపై ఉన్న అన్ని వంతెనలను మూసివేసింది. పుణె-కోలాడ్ రోడ్డు ఒక విభాగంలో కుంగిపోవడంతో ఆ రూట్ క్లోజ్ అయింది. పర్యాటకుల భద్రత దృష్ట్యా ప్రసిద్ధ పర్యాటక కేంద్రమైన సింహగడ్ కోట ను రెండు రోజుల పాటు పూర్తిగా బంద్ చేశారు. పుణె శివార్లలో వరదల్లో చిక్కుకుపోయిన ఒక ప్రైవేట్ బస్సులోని 37 మంది ప్రయాణికులను ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ప్రాణాలకు తెగించి సురక్షితంగా రక్షించాయి.
ఇటు ముంబై నగరంలో పరిస్థితి మరింత దారుణంగా మారింది. విక్రోలి, కొలాబా, మాతుంగ వంటి లోతట్టు ప్రాంతాలు మోకాళ్లోతు నీటిలో మునిగిపోయాయి. పశ్చిమ రైల్వే పరిధిలోని వసాయ్ రోడ్ - విరార్ సెక్షన్లలో పట్టాలు పూర్తిగా నీట మునగడంతో 20 కి పైగా ఎక్స్ప్రెస్ రైళ్లు మధ్యలోనే నిలిచిపోయాయి. ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ ఎయిర్పోర్టులో రన్వే రక్షణ చర్యల దృష్ట్యా విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మహారాష్ట్ర అసెంబ్లీని సైతం వర్షాల కారణంగా ఒకరోజు వాయిదా వేయాల్సి వచ్చింది. గత 3-4 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా వర్ష సంబంధిత ఘటనల్లో 13 మంది ప్రాణాలు కోల్పోయారని విపత్తు నిర్వహణ మంత్రి గిరీష్ మహాజన్ ప్రకటించారు.

# సియా మహానటి.. స్నాప్ చాట్ లో దొరికిపోయిన చేతన్

**జైపూర్, జూలై 7, పెన్ పవర్:**
ఆమె అమాయకురాలు కాదు. మహానటి.. కుటుంబ సభ్యుల ముందు నటించింది. కేతన్ అగర్వాల్ ముందు నటించింది. అతడు దగ్గరనుంచి కోటి రూపాయలు డబ్బు తీసుకుంది. కేతన్ అగర్వాల్ తల్లిదండ్రుల ముందు కూడా నటించింది. అతడిని రెండుసార్లు కోటకు తీసుకెళ్లింది. రెండుసార్లు కూడా అతడిని చంపే ప్రయత్నం విఫలమైంది. మూడోసారి బాలిదాకా వెళ్లాలి అనుకుంది. కానీ ఆ ప్లాన్ ఫ్లాఫ్ అయింది. చివరికి తన నటన కౌశలాన్ని ప్రదర్శించి కాబోయే వాడిని కోటకు తీసుకెళ్లింది. తన ప్రేమికుడితో లేపేసింది.మూడో కంటికి తెలియకుండా చంపేశాం కాబట్టి ఇబ్బంది లేదు.. దొరికిపోయే అవకాశం లేదు అనుకుంది సియా. కానీ చేసిన ఘోరం.. ఎప్పటికీ దాగదు. ఒక చిన్న ఆధారం సియాను పట్టించింది. ఆమె ప్రియుడిని దొరికేలా చేసింది. ఆ తర్వాత ఈ కేసును ప్రత్యేక పోలీసుల బృందం దర్యాప్తు చేయడం మొదలుపెట్టింది. ఈ దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. సియా కేతన్ నుంచి కోటి రూపాయలు వసూలు చేయడం.. వాటిని తన ప్రియుడు చేతన్ కు ఇవ్వడం.. చేతన్ కూడా కేతన్ అగర్వాల్ ను చంపే క్రమంలో తన ఫోన్ వాడకపోవడం.. తన కారును పక్కనపెట్టి వేరే వ్యక్తి బైక్ ఉపయోగించడం.. తన దగ్గర పనిచేస్తున్న వ్యక్తి ఫోన్ వాడటం వంటివి చేశాడు. దీంతో ఈ కేసులో బలమైన ఆధారాలు పోలీసులకు లభించాయి. దీనికి తోడు సియా వాడిన స్పై ఫోన్.. కోడింగ్ లాంగ్వేజ్ వంటివి పోలీసులకు అనుమానం కలిగించాయి. ఆ తర్వాత వాటిని డీకోడ్ చేస్తుంటే అసలు విషయాలు వెలుగు చూస్తున్నాయి.ఇప్పటిదాకా స్పై ఫోన్.. ఇతర ఆధారాలు మాత్రమే పోలీసులు సేకరించ గలిగారు. తాజాగా సియా స్నాప్ చాట్ లో జరిపిన ఓ సంభాషణ ఆమెను అడ్డంగా దొరికేలా చేసింది. స్నాప్ చాట్ లో సియా తన స్నేహితురాలికి వివాహ ఆహ్వానాన్ని పంపించింది. గెస్టులకు ఇచ్చే ఇంటర్ టికెట్ బుక్ చేసేందుకు ఆధార్ కార్డు పంపాలని ఆమెను కోరింది.. అయితే ఇక్కడ అసలు ట్విస్ట్ చోటు చేసుకుంది. ఎందుకంటే ఈ పెళ్లి జరగదని సియాకు తెలుసు. అదే విషయాన్ని స్నాప్ చాట్ లో ఆమె పేర్కొంది.. అంతేకాదు ఎలాగైనా సరే కేతన్ అడ్డు తొలగించుకోవాలని.. అతని శాశ్వతంగా వదిలించుకోవాలని సియా భావించింది. అందువల్లే స్నాప్ చాట్ లో ఈ పని చేసింది. వాస్తవానికి కేతన్ అంటే సియాకు ఇష్టం లేకపోయినప్పటికీ.. కుటుంబ సభ్యులు తీసుకురావడంతో ఆమె ఈ పని చేసినట్టు తెలుస్తోంది.. ఇప్పటికే సియా, చేతన్ ఫోన్ కాల్స్ ను పోలీసులు లోతుగా పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం పోలీసుల కస్టడీలో ఉన్న సియా, చేతన్.. ఇప్పటికే అనేక విషయాలను చెప్పారు. ఇంకా ఈ కేసులో మరిన్ని నిజాలను రాబట్టడానికి పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు.

**కేతన్ తాత మృతి**

నచ్చిన అమ్మాయిని పెళ్లి చేసుకోవాలి అనుకున్నాడు. పెళ్లి కోసం భారీగా ఏర్పాట్లు చేసుకున్నాడు. దానికోసం భారీగా ఖర్చు పెట్టాడు. ఏకంగా 17 కోట్లు పెట్టి రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయపూర్ ప్రాంతంలో ఒక అత్యంత విలాసవంతమైన హోటల్ బుక్ చేసుకున్నాడు. తన పెళ్లికి వచ్చే అతిథులను తీసుకురావడానికి హెలికాప్టర్లను బాడుగకు మాట్లాడుకున్నాడు.. అప్పట్లో ఎంగేజ్మెంట్ కూడా చాలా గట్టిగా చేసుకున్నాడు. బిజినెస్ సర్కిల్స్ మొత్తం తన గురించి మాట్లాడుకునేలాగా చేశాడు.చిన్న వయసులోనే స్థిరాస్తి వ్యాపారం లోకి వచ్చి భారీగా సంపాదించాడు. తన జీవితంలోకి వచ్చే అమ్మాయి గురించి గొప్ప గొప్ప కలలు కన్నాడు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. ఆ తర్వాత అతడి జీవితం మరో విధంగా మారింది. విధి పగబట్టింది. కాబోయే భార్య అతడిని చంపేసింది. పైగా ఆమెకు మరొక వ్యక్తితో సంబంధం ఉంది. తన ప్రేమికుడితో కలిసి తనకు కాబోయే భార్య తనను చంపేస్తుందని అతడు ఊహించలేదు. రెండుసార్లు తనను చంపే ప్రయత్నం విఫలమైందని అతడు చనిపోయిన తర్వాత తెలుసుకున్నాడు. అయినప్పటికీ జరగాల్సిన ఘోరం జరిగిపోయింది.ఇదంతా కూడా ఇటీవల కాలంలో మనం చూస్తున్న.. చదువుతున్న కేతన్ అనే స్థిరాస్తి వ్యాపారికి సంబంధించిన దీనగాథ. అతడు పోయిన బాధ నుంచి ఇంకా కుటుంబం తేరుకోలేదు. ఆ కేసు ఇంకా విచారణ దశలో ఉంది. రకరకాల మలుపులు తిరుగుతోంది. అతడు చనిపోయిన విషాదం గుండెను మెలి తిప్పుతుండగానే.. కేతన్ కుటుంబంలో మరో విషాదం చోటు చేసుకుంది.కేతన్ తాత దేవిచంద్ అగర్వాల్ అనారోగ్యంతో కన్నుమూశారు. కేతన్ చనిపోయిన దగ్గరనుంచి ఆయన ఆరోగ్య పరిస్థితి దారుణంగా మారిపోయింది. శనివారం రాత్రి అతనికి గుండెపోటు రావడంతో చనిపోయారు.. దీంతో కేతన్ కుటుంబం మరింత విషాదంలో కూరుకుపోయింది. కొడుకు మరణం.. తండ్రి మరణం.. ఇవన్నీ కూడా కేతన్ అగర్వాల్ తండ్రికి నరకం చూపిస్తున్నాయి. ఆయన విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టిస్తోంది.

# ఒవైసీ విద్యా సంస్థలపై రాజకీయ రంగు

**హైదరాబాద్, జూలై 7, పెన్ పవర్:**
తెలంగాణలో ఓవైసీల నేతృత్వంలోని ఫాతిమా విద్యాసంస్థల భూముల వ్యవహారం మరోసారి రాజకీయంగా, న్యాయపరంగా తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం, కోర్టుల అక్షింతలు, అధికార-విపక్షాల మధ్య సవాల్-ప్రతిసవాళ్లతో ఈ అంశం రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తోంది. నిబంధనల ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవడంలో జరుగుతున్న జాప్యంపై హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేయగా, ఈ వ్యవహారం కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం పార్టీల మధ్య పదునైన విమర్శల యుద్ధానికి దారితీసింది.ఫాతిమా విద్యాసంస్థల ఉల్లంఘనలపై విచారణ సందర్భంగా ప్రభుత్వ విభాగాలు కోర్టుకు సమర్పించిన నివేదికలు, చెప్పిన సమాధానాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. తాము ఈ సంస్థలకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని హైకోర్టుకు స్పష్టం చేసింది. తాము ప్రస్తుతం సర్వే వ్యవహారాల్లో బిజీగా ఉన్నామంటూ కాలయాపన సమాధానం ఇచ్చింది. నివేదిక ఇచ్చేందుకు కొంత గడువు కావాలని కోరింది. చెరువులు, నాలాల పరిరక్షణే ధ్యేయంగా ఏర్పాటైన హైడ్రా.. ఇతర శాఖల నుంచి స్పష్టమైన నివేదికలు వస్తేనే తాము తదుపరి చర్యలు తీసుకోగలమని వివరించింది. ఒకరిపై ఒకరు నెపం నెట్టేస్తూ, బాధ్యతల నుంచి తప్పుకునేలా ఉన్న ప్రభుత్వ శాఖల తీరుపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టులు ఇన్నిసార్లు చీవాట్లు పెడుతున్నా, క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవడంలో ఎందుకు జాప్యం జరుగుతోందని న్యాయస్థానం నిలదీసింది.హైకోర్టు వ్యాఖ్యలను అస్త్రంగా చేసుకుని విపక్షాలు ప్రభుత్వంపై విమర్శల దాడిని పెంచాయి. ముఖ్యంగా బీజేపీ ఈ వ్యవహారాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అక్రమ కట్టడాలపై బుల్డోజర్లు నడుపుతామని చెప్పున్న హైడ్రా, ఫాతిమా విద్యాసంస్థల జోలికి ఎందుకు వెళ్లడం లేదని బీజేపీ ప్రశ్నిస్తోంది.కేంద్రమంత్రి బండి సంజయ్ ఈ వివాదంపై అత్యంత ఘాటుగా స్పందించారు. తాము అధికారంలోకి వస్తే ఓవైసీ విద్యాసంస్థలను కూల్చేస్తామని బహిరంగంగా ప్రకటించారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపాయి.దీనికి ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ అంతే దీటుగా కౌంటర్ ఇచ్చారు. "ఒక విద్యాసంస్థను కూల్చితే.. వంద విద్యాసంస్థలను కడతాం" అంటూ సవాల్ విసిరారు. తమ విద్యాసంస్థలను, మైనారిటీల హక్కులను ఎలా కాపాడుకోవాలో తమకు బాగా తెలుసంటూ ఆయన స్పష్టం చేశారుఅక్బరుద్దీన్ ఓవైసీ కామెంట్స్ పై మరో కేంద్రమంత్రి, బీజేపీ నేత కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. ఓవైసీ సోదరులు బహిరంగంగా ప్రభుత్వాన్ని, చట్టాన్ని బెదిరిస్తున్నా రేవంత్ రెడ్డి సర్కార్ ఎందుకు వెనకడుగు వేస్తోందని ఆయన ప్రశ్నించారు. ఓవైసీ అంటే రేవంత్ రెడ్డికి అంత భయమా అని నిలదీశారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఐఎం అక్రమాలను చూసీచూడనట్లు వదిలేస్తోందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి.ఫాతిమా విద్యాసంస్థల వ్యవహారం కేవలం ఒక భూ వివాదంగానే కాకుండా, తెలంగాణ రాజకీయాల్లో ఒక కీలక మలుపుగా మారింది. ఒకవైపు హైడ్రా యాక్షన్తో దూసుకుపోతున్నట్లు కనిపిస్తున్నా, ఎంఐఎం నేతలకు సంబంధించిన వ్యవహారాల్లో మాత్రం వెనకడుగు వేస్తోందనే ఇంప్రెషన్ ప్రజల్లో బలంగా కనిపిస్తోంది. ప్రభుత్వ విభాగాలు కోర్టులో పొంతన లేని సమాధానాలు చెప్పడం కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనా సామర్థ్యంపై ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఈ గ్యాప్ను వాడుకుని తెలంగాణలో తామే ప్రధాన ప్రత్యామ్నాయం అని నిరూపించుకునేందుకు బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తోంది.

# పవన్ తో ఆశా ఆశలు

**విజయవాడ జూలై 7,పెన్ పవర్:**
ఏపీ రాజకీయాల్లో వంగవీటి కుటుంబానికి ప్రత్యేక స్థానం. 1988లో వంగవీటి మోహన్ రంగ చనిపోయారు. ఇప్పటికీ ఆయన పేరు రాజకీయాల్లో వినిపిస్తూనే ఉంటుంది. కాపుల ఆశాజ్యోతి గా రంగాను అభివర్ణిస్తారు. కానీ ఉమ్మడి రాష్ట్రంలో విజయవాడ వేదికగా అన్ని వర్గాల ప్రజల కోసం పనిచేశారు. అయితే ఆయన మరణానికి సంబంధించి నిందితులను గుర్తించలేకపోయాయి ప్రభుత్వాలు. కానీ రాజకీయంగా కాపుల కోసం ఆయన పేరును ప్రతి ఎన్నికల్లోను వినియోగిస్తుంటారు. తాజాగా ఆయన జయంతి జరగగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నివాళులు అర్పించారు. దీనిపై రంగ కుమార్తె ఆశా కిరణ్ స్పందించారు. పవన్ కళ్యాణ్ కు కృతజ్ఞతలు చెబుతూనే త్వరలో ఆయనను కలుస్తానని చెప్పుకొచ్చారు.కొద్దిరోజుల కిందట ఏపీలో రంగారాధ మిత్రమండలి పూర్వ వైభవం కోసం ఆశాకిరణ్ ఎంట్రీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు కూడా చేశారు. త్వరలో పొలిటికల్ ఎంట్రీ ఉంటుందన్న ప్రచారం కూడా జరిగింది. అయితే ఇప్పుడు తాజాగా ఆమె జనసేనలో చేరుతారని పెద్ద ఎత్తున ప్రచారం ప్రారంభం అయింది. దానికి కారణం లేకపోలేదు. రంగా జయంతి నాడు పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా నివాళులు అర్పించేసరికి కృతజ్ఞతలు చెప్పారు. త్వరలో పవన్ కళ్యాణ్ ను కలిసి రంగా ఆశయాలకు సంబంధించి కొన్ని అంశాలను చర్చిస్తానని చెప్పుకొచ్చారు. ప్రధానంగా కృష్ణాజిల్లాకు వంగవీటి మోహన్ రంగ పేరు, రంగా పుష్కర్ ఘాట్ ఏర్పాటు వంటి వాటిపై చర్చించేందుకు త్వరలో ఆమె పవన్ కళ్యాణ్ ను కలవనున్నట్లు తెలుస్తోంది. అయితే ఆమె జనసేనలో చేరిక కోసమే ఈ ప్రయత్నం చేస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది.వంగవీటి మోహన్ రంగా మరణం అనంతరం ఆయన రాజకీయ వారసుడిగా కుమారుడు రాధాకృష్ణ పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు. 2004లో కాంగ్రెస్ పార్టీ ద్వారా



అసెంబ్లీకి పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తరువాత ప్రజారాజ్యం పార్టీలో చేరారు. అక్కడ నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి.. ఆ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడిగా పని చేశారు. జగన్మోహన్ రెడ్డితో విభేదించి తెలుగుదేశం పార్టీలో చేరారు. ప్రస్తుతం ఆ పార్టీలోనే కొనసాగుతున్నారు. త్వరలో ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఖాయమన్న ప్రచారం నడుస్తోంది. ఇంతలోనే ఆశాకిరణ్ జనసేనలో చేరుతారని తెలుస్తోంది. ప్రస్తుతం కాపుల చుట్టూ వైసిపి రాజకీయం చేస్తోంది. అందుకే టిడిపిలో రాధాకృష్ణకు.. జనసేనలో ఆశా కిరణ్ కు ప్రాధాన్యం కల్పించడం ద్వారా చెక్ చెప్పాలన్నది చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఆలోచనగా తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# మావిగన్ పై కేడర్ లో సందిగ్ధత

**కర్నూలు జూలై 7,పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో రాజధాని అంశం మళ్లీ హాట్ టాపిక్‌గా మారింది. ఐదేళ్ల పాటు మూడు రాజధానుల నినాదంతో గందరగోళానికి తెరలేపిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. తాజాగా జూలై 2026 లో సరికొత్తగా మావిగన్ మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు కోస్తా అర్బన్ కారిడార్ అజెండాను తెరపైకి తెచ్చారు. వచ్చే ఎన్నికల్లో మావిగన్ వర్సెస్ అమరావతి అనేదే తమ పార్టీ ప్రధాన ఎన్నికల ఎజెండా అని, దీనిని మేనిఫెస్టోలో కూడా పెడతామని జగన్ స్వయంగా ప్రకటించారు. అయితే, ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. అధినేత ఇంత పెద్ద పొలిటికల్ బాంబు పేల్చినా, అనుబంధ మీడియా, సోషల్ మీడియా వింగ్ , పార్టీ సీనియర్ నేతలు దీనికి పెద్దగా ప్రాధాన్యత ఇవ్వడం లేదు. సజ్జల రామకృష్ణారెడ్డి లాంటి ఒకరిద్దరు మినహా మిగిలిన నేతలెవరూ ఈ టాపిక్‌ను ఓ రేంజ్‌లో జనాల్లోకి తీసుకెళ్లడానికి ఉత్సాహం చూపించడం లేదు. మొదటి ప్రధాన కారణం.. ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో తీవ్ర నష్టం జరుగుతుందనే భయం. గతంలో జగన్ మూడు రాజధానుల నినాదం ఎత్తుకున్నప్పుడు విశాఖపట్నానికి ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్, కర్నూలుకు జ్యుడీషియల్ క్యాపిటల్ అన్నారు. దీనివల్ల ఆయా ప్రాంతాల్లోని నేతలు, కేడర్ మా ప్రాంతానికి రాజధాని వస్తోంది అని గర్వంగా ప్రచారం చేసుకున్నారు. కానీ ఇప్పుడు జగన్ ప్రతిపాదిస్తున్న మావిగన్ పూర్తిగా కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలోకి వస్తుంది. ఇప్పుడు గనుక వైసీపీ సోషల్ మీడియా దీనిని విపరీతంగా ప్రమోట్ చేస్తే.. మరి విశాఖ, కర్నూలు పరిస్థితి ఏంటి? ఉత్తరాంధ్ర, రాయలసీమలను జగన్ వదిలేశారా?" అని కూటమి శ్రేణులు కౌంటర్ అటాక్ చేయడం ఖాయం. ఈ రీజినల్ సెంటిమెంట్ దెబ్బతింటుందనే భయంతోనే ఆయా జిల్లాల వైసీపీ నేతలు ఈ టాపిక్‌ను ముట్టుకోవడానికే భయపడుతున్నారు.ఇటీవల కేంద్ర పార్లమెంట్ 'ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ సవరణ చట్టం ద్వారా అమరావతిని ఏకైక రాజధానిగా అధికారికంగా గెజెట్‌లో పొందుపరిచింది. ఇలాంటి పరిస్థితుల్లో చట్ట విరుద్ధంగా మళ్లీ కొత్త కారిడార్ల పేరుతో రాజధానిని మారుస్తామనే భ్రమలు కల్పిస్తే.. న్యాయపరంగా పార్టీ మళ్లీ డిఫెన్స్‌లో పడుతుందని వైసీపీ అంతర్గత వర్గాలు భావిస్తున్నాయి. ఒకవైపు అమరావతిలో ప్రపంచ బ్యాంకు నిధులతో పనులు పరుగులు పెడుతుంటే, సామాన్య ఓటర్లు కూడా మళ్లీ రాజధాని మార్పుల గందరగోళాన్ని కోరుకోవడం లేదు. అందుకే, సోషల్ మీడియాలో ఈ టాపిక్‌ను ఎక్కువగా కెలికితే.. నెటిజన్ల నుండి పాజిటివ్ రెస్పాన్స్ కంటే నెగటివ్ ట్రోలింగ్ ఎక్కువ వచ్చే ప్రమాదం ఉందని ఐటీ సెల్ వ్యూహాత్మకంగా సైలెంట్ అయిపోయింది.అధికార కూటమి ఈ ప్రతిపాదనను తిప్పికొడుతున్న తీరు కూడా వైసీపీని ఆత్మరక్షణలో పడేసింది. మంత్రి లోకేష్, అచ్చెన్నాయుడు వంటి నేతలు జగన్ మూడు రాజధానులు డెవలప్ చేసింది నిజమే.. కానీ అవి హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలు అంటూ ఘాటుగా కౌంటర్లు ఇస్తున్నారు. జగన్ మాట మార్చే నైజాన్ని ఎండగడుతూ.. 2014లో అమరావతికి జై కొట్టారు, 2019లో మూడు రాజధానులు అన్నారు, ఇప్పుడు 2026లో మావిగన్ అంటున్నారు.. అసలు జగన్‌కు ఒక స్థిరమైన ఆలోచన ఉందా అని టీడీపీ సోషల్ మీడియా వేస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేక వైకాపా కేడర్ నీళ్లు నములుతోంది. జగన్ మోహన్ రెడ్డి 'మావిగన్' అనే కొత్త అజెండాను ప్రకటించింది కేవలం అమరావతిలో జరుగుతున్న భారీ అభివృద్ధి, పెట్టుబడుల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి మాత్రమేనని క్షేత్రస్థాయి నేతలు భావిస్తున్నారు. పైగా, వచ్చే ఎన్నికలకు ఇంకా చాలా సమయం ఉండటంతో.. అప్పుడే ఈ నినాదాన్ని జనంలోకి తీసుకెళ్లి 'క్యాపిటల్ సెంటిమెంట్'ను పాడుచేసుకోవడం కంటే, ప్రస్తుతానికి హోల్డ్‌లో పెట్టడమే మంచిదనే అంతర్గత వ్యూహంతోనే వైసీపీ మీడియా, సోషల్ మీడియా దీనిని పెద్దగా పట్టించుకోనట్లు నటిస్తున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే, అధినేత విసిరిన 'మావిగన్' బాణం.. సొంత పార్టీలోనే పట్టు కోల్పోయి, కేవలం తాడేపల్లి ప్రెస్ మీట్లకే పరిమితమైపోయిందని పొలిటికల్ ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు.

# వైసీపీలో చీలిక ప్రకంపనలు

**విజయవాడ, జూలై 7, (పెన్ పవర్:**
ఏపీలో ప్రతిపక్షంగా ఉన్న వైసీపీలో చీలిక రానుందా? ఆ పార్టీ నాయకులు చీలిపోవడమో.. లేక కూటమిలోని ఓ పార్టీలో చేరిపోవడమో ఖాయంగా కనిపిస్తోందా? అంటే.. ఔననే సమాధానమే వినిపిస్తోంది. నాయకుల మాటకు విలువ లేకపోవడం.. వారు చెప్పింది ఆలకించే స్థాయిలో జగన్ ఇంకా కనిపించక పోవడం.. వంటివి పెద్ద ఎత్తున చర్చకు వస్తున్నాయి. దీంతో ఇప్పుడు సీనియర్ల నుంచి జూనియర్ల వరకు తమకు అనుకూలంగా ఉన్న పార్టీలవైపు దృష్టి పెడుతున్నట్టు తెలుస్తోంది. ఇదే జరిగితే.. వైసీపీ చీలిక దిశగా అడుగులు వేయడం ఖాయమని అంటున్నారు.వాస్తవానికి పార్టీల్లో భిన్నాభిప్రాయాలు ఉండడం సహజమే. కానీ, కీలకమైన ప్రజల కోణంలో చూసినప్పుడు.. నాయకుల వాదనను కూడా పార్టీలు పట్టించుకోవాలి. ఉదాహరణకు.. పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ తన మేనల్లుడు అభిషేక్ బెనర్జీని వెనుకేసుకు వచ్చారు. ఇలా వద్దని పార్టీ నాయకులు కోరారు. ఆమె వినిపించుకోలేదు. ఫలితంగా పార్టీ ఓడిపోవడమే కాదు.. ఇప్పుడు పార్టీ నేతలు కూడా.. ఆమెను వదిలేసి వెళ్లిపోతున్నారు. ఇక, పార్టీనే మూసేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.అదేవిధంగా తమిళనాడులో అన్నాడీఎంకే.. బీజేపీతో పొత్తు పెట్టుకోవడాన్ని ఆ పార్టీ నాయకులు సహించలేదు. కానీ, నాయకుల మాటను పళని స్వామి వినిపించుకోలేదు. ఫలితంగా గెలిచే పార్టీ కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేక పోయింది. ఇలా.. నాయకుల మాట వినిపించుకోని పార్టీలు దేశంలో చీలిపోతున్నాయి. చిందరవందరగా కూడా మారుతున్నాయి. ఈ నేపథ్యంలోనే వైసీపీలోనూ చీలిక దిశగా అడుగులు పడుతున్నాయన్న చర్చ జరుగుతోంది. గతంలో మూడు రాజధానులు సహా.. ప్రస్తుత మావిగన్ ప్రతిపాదన వంటివి వైసీపీ నాయకులు జీర్ణించుకో లేకపోతున్నారు. ఎన్నికల సమయంలో ఎవరికి టికెట్ ఇస్తారో.. ఎవరిని మారుస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. అలానే.. తమకు ఏమాత్రం వాల్యూ లేకుండా చేస్తున్నారని సీనియర్లు వాపోతున్నారు. ఈ పరిణామాల క్రమంలోనే నాయకులు పక్క చూపులు చూస్తున్నారు.ఇక, కూటమి పార్టీల్లో బలోతపేతం కావాలని భావిస్తున్న.. బీజేపీ వీరిని చేర్చుకునేందుకు రెడీగా ఉన్నట్టు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇలాంటి సమయం కోసం.. బీజేపీ ఎదురు చూస్తున్న పరిస్థితి దేశవ్యాప్తంగా కూడా కనిపిస్తోంది. ఈ క్రమంలో వైసీపీ నుంచి వచ్చేవారికి బీజేపీ ఎర్రతివాచీ పరిచినా ఆశ్చర్యం లేదని అంటున్నారు. ఇక, వ్యక్తిగతంగా నాయకులకు ఎలానూ బలం ఉంటుంది. సో.. అలాంటి వారు ఇక, జగన్‌పై తిరుగుబాటు చేయడం ఖాయమన్న సంకేతాలు వస్తున్నాయి. వచ్చే వారం పదిరోజుల్లో ఏదైనా జరగొచ్చని.. వైసీపీకి చెందిన నాయకుడు ఒకరు నర్మగర్భ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

# ఈ సారి డిఫరెంట్ గా చంద్రబాబు

**తిరుపతి, జూలై 7 పెన్ పవర్:**
సీఎం చంద్రబాబు ప్రజలకు మరింత చేరువయ్యేలా వ్యవహరిస్తున్నారు. ఎవరో రావాలి.. ఏదో చెప్పాలి.. అని ఎదురు చూడకుండా.. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు తానే స్వయంగా రంగంలోకి దిగుతున్నారు. ముఖ్యంగా రాయలసీమ జిల్లాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టిన ఆయన.. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ఇంపార్టెన్స్ ఇస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా తనసొంత నియోజకవర్గం కుప్పంలో ప్రజలను నేరుగా కలుసుకున్నారు. వారి నుంచి అర్జీలు తీసుకున్నారు.మూడు రోజుల పర్యటన నిమిత్తం కుప్పం వచ్చిన చంద్రబాబు శనివారం నేరుగా ప్రజలతో మమేకమయ్యారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా సీఎంతో భేటీ అయ్యేందుకు వచ్చారు. అయితే.. వారిని హాల్‌లోనే కూర్చోబెట్టిన సీఎం.. అప్పటికే బయట వేచి ఉన్న ప్రజలను కలుసుకున్నారు. వారిని ఆప్యాయంగా పలకరించారు. సమస్యలు తెలుసుకున్నారు. అలానే.. స్వర్ణ కుప్పం ప్రాంత అభివృద్ధిని వారికి వివరించారు. ప్రతి ఇంటికీ సోలార్ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలను చెప్పారు. విద్యుత్ వినియోగంలో సౌర విద్యుత్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు.ఇక, వ్యక్తిగత సమస్యలను కూడా తెలుసుకున్న చంద్రబాబు పలువురికి అక్కడికక్కడ ఆర్థిక సాయం ప్రకటించారు. కొందరికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కులు అందించారు. ఇక, కుప్పం నియోజకవర్గంలోని గ్రామాల పరిధిలో అవలంభిస్తున్న నెట్ జీరో(వ్యర్థాల రహిత) వ్యవస్థను అడిగి తెలుసుకున్నారు. పలు ఇళ్లపై ఏర్పాటు చేసిన సోలార్ వ్యవస్థ గురించి తెలుసుకున్నారు. అలానే విద్యుత్ వినియోగంతో నడిచే ఇండక్షన్ కుక్కర్లు, టెర్రస్ గార్డెనింగ్ వంటి వివరాలను పలువురు చంద్రబాబుకు చెప్పారు.మారుతున్న రాజకీయ వాతావరణం.. ప్రజల అభిరుచులకు అనుగుణంగా చంద్రబాబు తనను తాను మార్పు చేసు కుంటున్న పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా తన సొంత నియోజకవర్గంలో గతానికి భిన్నంగా ఆయన ఈ ఏడాది పలుమార్లు పర్యటించారు. ప్రతి ఒక్కరికీ చేరువ అవుతున్నారు. తద్వారా వైసీపీ వ్యూహాత్మక రాజకీయాలకు పరోక్షంగా చంద్రబాబు చెక్ పెడుతున్నారన్న వాదన వినిపిస్తోంది.

## ఉమాకు ఈ సారైనా...

**విజయవాడ, జూలై 7, పెన్ పవర్:** గవర్నర్ కోటాలో ఖాళీ కానున్న రెండు ఎమ్మెల్సీ స్థానాల భర్తీ ప్రక్రియ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఆసక్తి రేపుతుండగా, ఈసారి అయినా మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత దేవినేని ఉమామహేశ్వరరావుకు అవకాశం దక్కుతుందా అనే చర్చ జోరందుకుంది. గత ఎన్నికల్లో కూటమి సమీకరణాల కారణంగా మైలవరం అసెంబ్లీ సీటును వసంత కృష్ణప్రసాద్ కోసం త్యాగం చేసిన ఉమా.. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సరైన గుర్తింపు కోసం వేచి చూస్తున్నారు. కష్టకాలంలో పార్టీని నమ్ముకుని ఉన్న సీనియర్లకు చంద్రబాబు ఈసారి న్యాయం చేస్తారనే నమ్మకంతో ఉమా అనుచరులు ఈ గవర్నర్ కోటా రేసుపై భారీ ఆశలు పెట్టుకున్నారు.అయితే, ఈ స్థానాల భర్తీ విషయంలో చంద్రబాబు నాయుడు ముందు అనేక సమీకరణాలు ఉన్నాయి. ఇప్పటికే ఒక స్థానానికి సీనియర్ నేత వర్ల రామయ్య పేరు బలంగా వినబడుతుండగా.. మిగిలిన ఏకైక స్థానం కోసం తీవ్రమైన పోటీ నెలకొంది. పిఠాపురం సీటును పవన్ కళ్యాణ్ కోసం వదులుకున్న ఎస్.వి.ఎస్.ఎన్. వర్మతో పాటు వంగవీటి రాధా, మహాసేన రాజేష్ వంటి నేతలు కూడా అధిష్టానం నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు.రెండు స్థానాలు మాత్రమే ఖాళీగా ఉండటం వల్ల, సామాజిక మరియు ప్రాంతీయ సమతుల్యతను (ముఖ్యంగా రాయలసీమ లేదా బీసీ నేతలకు ప్రాధాన్యత) దృష్టిలో ఉంచుకుంటే ఉమాకు ఈసారి కూడా నిరాశే ఎదురవుతుందా అనే సందేహాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈసారి దేవినేని ఉమా పేరును చంద్రబాబు పరిశీలిస్తారా, లేదా భవిష్యత్తులో రాబోయే ఇతర కోటా.. స్థానిక సంస్థలు లేదా అసెంబ్లీ ఎమ్మెల్సీ స్థానాల్లో సర్దుబాటు చేస్తారా అనేది సస్పెన్స్‌గా మారింది. పార్టీ కోసం ఏళ్ల తరబడి శ్రమించిన ఉమాకు ఈసారి పెద్దల సభలో అవకాశం కల్పిస్తే కృష్ణా జిల్లా క్యాడర్‌లో కొత్త ఉత్సాహం వస్తుందని ఆయన వర్గం భావిస్తోంది. మరికొద్ది రోజుల్లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ రెండు స్థానాలపై తుది నిర్ణయం తీసుకోనున్నారు.

## విశాఖలో ట్రైయాంగిల్ పాలిటిక్స్..

**విశాఖపట్టణం, జూలై 7 పెన్ పవర్:** విశాఖ జిల్లాలో మంత్రి పదవిని ఆశిస్తున్న వారిలో సీరియస్ గా రేసులో ఉన్న వారిగా ఈ ముగ్గురు నేతల పేర్లను ప్రచారం చేస్తున్నారు. మంత్రి వర్గ విస్తరణ ఈ శ్రావణ మాసం ఉండవచ్చు అని అంటున్నారు. దాంతో ఆగస్టు నెల అంటే దగ్గరలో ఉంది కాబట్టి మంత్రి పదవుల మీద ఆశపడుతున్న వారిలో వారి వర్గీయులలో చురుకుదనం పుడుతోంది అని అంటున్నారు. ఇక విశాఖ జిల్లాకు 2024లో మంత్రి పదవి దక్కలేదు అన్నది తెలిసిందే. ఆ మాటకు వస్తే వైసీపీ కూడా 2022 తరువాత జరిపిన విస్తరణలో విశాఖ జిల్లా భీమిలీకి చెందిన అవంతి శ్రీనివాస్ ని మంత్రి పదవి నుంచి తప్పించేసి అనకాపల్లికి చెందిన గుడివాడ అమర్నాథ్ కి ఇచ్చింది. అంతే కాదు మాడుగులకు చెందిన బూడి ముత్యాలనాయుడుకు కూడా ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చింది. అలా విశాఖ జిల్లాకు గడచిన నాలుగేళ్ళుగా మంత్రి పదవి అన్నది లేకుండా పోయింది అని అంటున్నారుమరో మూడేళ్ళలో ఏపీలో సార్వత్రిక ఎన్నికలు ఉన్నాయి. దాంతో ఎన్నికల నాటికి విశాఖ జిల్లాను ముందంజలో నడిపించాల్సి ఉంది. అంతే కాదు అనేక కంపెనీల్ విశాఖ జిల్లాకు తరలి వస్తున్నాయి. వాటిని కో ఆర్డినేట్ చేసుకోవాల్సి ఉంది. ఇక రాజకీయ పరంగా చూసినా కూడా విశాఖ జిల్లా కీలకంగా మారుతోంది. జీవీఎంసీ ఏపీలోనే అత్యధిక వార్డులతో పెద్దదిగా మారబోతోంది. దానికి ఎన్నికలు కూడా జరగబోతున్నాయి. కూటమిని మళ్ళీ గెలిపించాలి అంటే విశాఖకు మంత్రి పదవి ఇవ్వాల్సిందే అన్నది కూడా పెద్దగా వినిపిస్తోంది. దీంతో ఈసారి విశాఖ నుంచి మంత్రిని చూడబోతున్నారు అని అంటున్నారు. టీడీపీ ప్రభుత్వంలో విశాఖ నుంచి గంటా శ్రీనివాసరావు మంత్రిగా అయిదేళ్ల పాటు పనిచేశారు. జిల్లాలో పార్టీని అంతా కట్టుగా ఉంచారు, అన్ని విధాలుగా అండగా ఉన్నారు. ఆయన అనుభవం గట్టిగా చేసే రాజకీయం వ్యూహాత్మక వైఖరి అన్నీ చూసుకుంటే కూటమిలోని మూడు పార్టీల మధ్య కో ఆర్డినేషన్ తీసుకుని రావడమే కాకుండా జిల్లాలో అభివృద్ధికి కూడా కృషి చేస్తారు అని అంటున్నారు. ఆయన భీమిలీ నియోజకవర్గంలోనే ఎక్కువ కంపెనీలు వచ్చాయి. వాటి భూసేకరణ విషయంలో గంటా ఎక్కువగా చొరవ తీసుకుని భూసేకరణ సాఫీగా సాగేలా చూశారు. దాంతో ఆయన పేరు అయితే మంత్రి పదవి విషయంలో మారుమోగుతోంది అని అంటున్నారు. ఆయనకు ఇస్తేనే వైసీపీని కూడా గట్టిగా కట్టడి చేయగలరు అన్న అంచనాల మధ్య గంటా కాబోయే మంత్రి అని ఊహాగానాలు అయితే వినిపిస్తున్నాయి. ఇక ఏపీ టీడీపీ ప్రెసిడెంట్ గా ఉన్న పల్లా శ్రీనివాసరావు సైతం లైన్ లో ఉన్నారని అంటున్నారు. ఆయన పట్ల టీడీపీ అధినాయకత్వం సుముఖంగా ఉందని చెబుతున్నారు. వివాదాలు లేని తీరు అందరినీ కలుపుకుని పోయే విధానం అన్నీ కూడా ఆయనకు మంత్రి పదవి కట్టబెడితే కలసి వస్తుందని అంటున్నారు. ఇక బలమైన యాదవ సామాజిక వర్గం విశాఖ సిటీలో ఎక్కువగా ఉన్నారు, వారికి ఇప్పటిదాకా మంత్రి పదవి ఈ ప్రాంతంలో దక్కలేదు, దాంతో పల్లాకు ఈ పదవిని ఇవ్వడం ద్వారా ఆ బలమైన వర్గం మద్దతుని నూరు శాతం అందుకోవాలన్న వ్యూహం కూడా ఉందని అంటున్నారు. ఇలా అనేక లెక్కలు అనుకూలంగా ఉండడంతో పల్లా కి మంత్రి పదవి ఇస్తారు అని అంటున్నారు. దీని మీద కూడా ఊహాగానాలు బాగా వ్యాపిస్తున్నాయిమరో విశేషం ఏంటి అంటే బీజేపీ కూడా అనూహ్యంగా రేసులోకి రావడం. బీజేపీకి రెండు మంత్రి పదవులు ఇస్తారని ప్రచారంలో ఉంది. ఏపీలో బీజేపీ గెలిచింది ఎనిమిది ఎమ్మెల్యే సీట్లు, రాయలసీమ నుంచి సత్యకుమార్ యాదవ్ కి బెర్త్ తొలి విడతలోనె ఇచ్చారు. ఇక విస్తరణలో కనుక రెండవ మంత్రి పదవి ఇస్తారు అని కచ్చితంగా వినిపిస్తున్న మాట. దాంతో. కోస్తాలో బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్నా అక్కడ మంత్రులు అనేక మంది ఉన్నారు. పైగా సామాజిక ప్రాంతీయ సమీకరణలు అన్నీ చూసుకుంటే ఉత్తరాంధ్రకే ఎక్కువ చాన్స్ ఉందని అంటున్నారు. విశాఖ ఉత్తరం నుంచి రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో ఆ పార్టీ సభా పక్ష నాయకుడిగా ఉన్న విష్ణు కుమార్ రాజుకు మంత్రి పదవి దక్కుతుందని ఊహాగానాలు అయితే వినిపిస్తున్నాయి. మంత్రి వర్గంలో క్షత్రియులకు చోటు లేదు కాబట్టి ఆ కోణంలో నుంచి చూసినా రాజు గారికి చాన్స్ ఉండొచ్చు అన్నది ఒక అంచనా. మొత్తానికి మిగిలిన వారు ఎంతో మంది ఆశపడుతున్నా ఈ ముగ్గురు పేర్లు విశాఖ జిల్లా నుంచి వినిపిస్తున్నాయి.

## రావణ్ లింక్ ప్రకాష్ కి చుట్టుకుంటోందా...

**ఏలూరు, జూలై 7, పెన్ పవర్:**
గత రెండు మూడు రోజుల నుండి ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ తన సోషల్ మీడియా అకౌంట్స్ ద్వారా ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై ఏ రేంజ్ లో విరుచుకుపడుతున్నారో మన కళ్లారా చూస్తూనే ఉన్నాం. మాత విద్వేషాలను రెచ్చగొట్టే 'ప్రశ్న రావణ్' ని అరెస్ట్ చేస్తే , ప్రకాష్ రాజ్ కి ప్రాణం పోయినంత పని అయ్యింది. అతని కోసం రోజుకి రెండు మూడు వీడియోలు అప్లోడ్ చేస్తూ 'జనం చూస్తున్నారు' అంటూ ఆయన మాట్లాడుతున్న మాటలపై సోషల్ మీడియా లో నెటిజెన్స్ తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. తీవ్రవాదులను ప్రోత్సహిస్తూ , హిందూ దేవుళ్లపై దుర్భాషలాడుతూ , ఇష్టమొచ్చినట్టు మాట్లాడే రావణ్ కోసం ప్రకాష్ రాజ్ ఇంతలా పోరాడడం సిగ్గు చేటు అంటూ మండిపడుతున్నారు. ఇక నేడు ప్రకాష్ రాజ్ అప్లోడ్ చేసిన వీడియో అయితే జనాల్లో అనేక అనుమానాలకు భీజం పోసింది.ప్రకాష్ రాజ్ మాట్లాడుతూ 'ఇప్పుడు పోలీసులు రావణ్ మొబైల్ ని తీసుకొని , అతని వద్ద ఉన్నటువంటి సమాచారం మొత్తాన్ని సేకరిస్తారు. అతనికి మద్దతుగా నిలబడిన ప్రతీ ఒక్కరిని ఇబ్బందులకు గురి చేస్తారు, ఇదే కదా జరిగేది' అంటూ ఒక సంచలన వ్యాఖ్య చేశారు. ఇది విన్న తర్వాత ఇన్ని రోజులు ప్రకాష్ రాజ్ బాధపడింది రావణ్ ని అరెస్ట్ చేసినందుకు కాదు , అతనితో ఈయన నడిపిన గూడూపుఠాణి మొత్తం బయటపడుతుంది అనే భయం తోనే ప్రకాష్ రాజ్ ఇంతలా ఆరాటపడుతున్నారు , వణికిపోతున్నారు అంటూ సోషల్ మీడియా లో నెటిజెన్స్ అంటున్నారు. రావణ్ , ప్రకాష్ రాజ్ లను నడిపిస్తున్న నెట్ వర్క్ మొత్తం ఈ రిమాండ్ రిపోర్ట్ లో బాటపడబోతుందని, ఇక వీళ్ళ ఆట ముగిసిపోయింది అంటూ సోషల్ మీడియా లో విశ్లేషకులు అంటున్నారు. ఇదంతా పక్కన పెడితే , ప్రకాష్ రాజ్ కి తమిళనాడు డీఎంకే పార్టీ తో ఎంత మంచి సాన్నిహిత్యం ఉందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు.వాళ్లకు మద్దతుగా, ఆ పార్టీ నాయకులతో , ఎమ్మెల్యేలతో మంత్రులతో కలిసి ఎన్నో ప్రెస్ మీట్ లు కూడా ఇచ్చారు. ఒక ప్రెస్ మీట్ లో అయితే పత్తి ఎమ్మెల్యే తో ప్రకాష్ రాజ్ మాట్లాడుతూ 'బాగా మాట్లాడానా ?, ఇంకా ఏమేమి మాట్లాడాలి' అని అడగడం , అందుకు సదరు నేత సూచనలు ఇవ్వడం వంటివి మన కళ్లారా చూశాము . అలాంటి పార్టీ కి చెందిన ఎమ్మెల్యే ని తమిళనాడు సీఎం విజయ్ అరెస్ట్ చేయిస్తే ప్రకాష్ రాజ్ ఇప్పటి వరకు నోరు మెదపలేదు. తన సన్నిహిత పార్టీ ఎమ్మెల్యే అరెస్ట్ అయితే ఇప్పటి వరకు స్పందించని ప్రకాష్ రాజ్ , ఒక సాధారణ యూట్యూబర్ అరెస్ట్ అయితే , ఎందుకు ఇంతలా ఉలిక్కిపడుతున్నారు?, కచ్చితంగా వీళ్లిద్దరి మధ్య ఏదో జరిగింది అంటూ సోషల్ మీడియాలో నెటిజెన్స్ అనుమానిస్తున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# మనవడిని చూసేందుకు ఫాంహౌస్ నుంచి కదిలొచ్చిన కేసీఆర్



తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్ రావు చాలా కాలం తర్వాత హైదరాబాద్‌లో ప్రత్యక్షమవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాజకీయాలకు కాస్త దూరంగా ఉంటూ తన ఫాంహౌస్‌కే పరిమితమైన కేసీఆర్.. అకస్మాత్తుగా నగరానికి రావడం అందరి దృష్టిని ఆకర్షించింది. గతంలో మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరిన భారీ బహిరంగ సభ తర్వాత ఆయన పెద్దగా ప్రజల ముందుకు రాలేదు. రాష్ట్రంలో ఎన్నో కీలక రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నప్పటికీ కేవలం పత్రికా ప్రకటనలకే పరిమితమైన కేసీఆర్ ఒక్కసారిగా నగరంలో ల్యాండ్ అవ్వడంతో అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది.

**ఏఐజీ ఆసుపత్రికి కేసీఆర్.. అసలేం జరిగింది?**

కేసీఆర్ తన వ్యవసాయ క్షేత్రం నుండి నేరుగా గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి చేరుకున్నారు. గతంలో ఆయనకు ఇక్కడే చికిత్స జరగడంతో మొదట కేసీఆర్ హెల్త్ చెకప్ కోసమే వచ్చారనే ఊహాగానాలు జోరందుకున్నాయి. కానీ అసలు విషయం అది కాదు. తన మనవడు, కేటీఆర్ కుమారుడైన హిమాంశును పరామర్శించేందుకే కేసీఆర్ ఆసుపత్రికి వచ్చారని తర్వాత స్పష్టమైంది.

**హిమాంశుకు గాయం**

అమెరికాలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న హిమాంశు ప్రస్తుతం హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. ఇటీవల క్రీడలు ఆడుతున్న సమయంలో ఆయనకు తీవ్రమైన గాయమైంది. దీంతో కుటుంబ సభ్యులు ఆయన్ను చికిత్స నిమిత్తం ఏఐజీ ఆసుపత్రిలో చేర్చారు.

**45 నిమిషాల పాటు మనవడితో ముచ్చట..**

మనవడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు వచ్చిన కేసీఆర్.. ఆసుపత్రిలో సుమారు 45 నిమిషాల పాటు గడిపారు. హిమాంశుతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కేసీఆర్ వెంట బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారకరామారావు, మాజీ మంత్రి టి. హరీశ్ రావు కూడా ఉన్నారు. హిమాంశుకు అందుతున్న చికిత్స గురించి కేటీఆర్, హరీశ్ రావు ఎప్పటికప్పుడు వైద్యులను అడిగి తెలుసుకుంటున్నారు. ఇటీవల మలేషియాలో జరిగిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో తండ్రి కేటీఆర్‌తో కలిసి పాల్గొన్న హిమాంశు.. క్రీడల్లో చురుగ్గా ఉంటారు. అయితే ఆటలాడుతూ అనుకోకుండా జరిగిన ప్రమాదంలో గాయపడటంతో కొద్దిరోజులుగా వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు.

**ఆసుపత్రి వద్ద గుమిగూడిన కార్యకర్తలు**

కేసీఆర్ ఆసుపత్రికి వస్తున్నారనే విషయం తెలియగానే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఏఐజీ ఆసుపత్రి ప్రాంగణానికి చేరుకున్నారు. తమ ప్రియతమ నేతను ఒక్కసారి చూసేందుకు ఆసుపత్రి వెలుపల సందడి వాతావరణం నెలకొంది. మనవడిని పరామర్శించిన అనంతరం కేసీఆర్ ఎవరితోనూ మాట్లాడకుండా నేరుగా తిరిగి తన ఫాంహౌస్‌కు బయలుదేరి వెళ్లారు.

**డిశ్చార్జ్ ఎప్పుడు?**

వైద్యుల సమాచారం ప్రకారం ప్రస్తుతం హిమాంశు ఆరోగ్యం స్థిరంగా ఉందని, ఆయన వేగంగా కోలుకుంటున్నారని తెలిసింది. మరో ఒకటి రెండు రోజుల్లో అవసరమైన మరికొన్ని వైద్య పరీక్షలు పూర్తి చేసి, ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. కేసీఆర్ అకస్మాత్తుగా హైదరాబాద్ రావడం రాజకీయంగా హాట్ టాపిక్ అవ్వగా.. హిమాంశు త్వరగా కోలుకోవాలని బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు సామాజిక మాధ్యమాల ద్వారా ఆకాంక్షిస్తున్నారు.

## పవన్ సార్, ఇటుచూడండి : యథావిధిగా గోదావరి.. రాత్రి సమయంలో నదిలోకి కలుషిత జలాలు?

గోదావరి జలాల కాలుష్యంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలు అమలుకు నోచుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గోదావరిలో కలుషిత జలాలు వదిలితే జైలులో పెడతామని మే నెల చివరి వారంలో డిప్యూటీ సీఎం హెచ్చరించిన విషయం తెలిసిందే. వచ్చే ఏడాది జరిగే పుష్కరాలకు ఏర్పాట్లు పరిశీలించే సమయంలో గోదావరిలో కలుషిత జలాలు పవన్ దృష్టికి వచ్చాయి. ఆ సమయంలో తీవ్రంగా స్పందించిన పవన్ నది ప్రక్షాళనకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకున్నారు. ఉన్నతాధికారులతో ప్రత్యేక టాస్క్ ఫోర్సు ఏర్పాటు చేయడంతోపాటు నదిలోకి కలుషిత జలాలు వదులుతున్న వారిపై కఠిన చర్యలకు ఆదేశాలు జారీ చేశారు.అయితే, ఉప ముఖ్యమంత్రి పవన్ పర్యటన ముగిసి దాదాపు నెలన్నర అవుతున్నా, రాజమండ్రి సమీపంలో గోదావరిలో ఎటువంటి మార్పు కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు. రాత్రి వేళల్లో వ్యర్థాలతోపాటు కలుషిత జలాలను నదిలోకి వదులుతున్నట్లు ఆరోపిస్తున్నారు. పేపరు మిల్లుతోపాటు నల్లా చానల్ నుంచి పెద్ద ఎత్తున కలుషిత జలాలు గోదావరిలో కలుస్తున్నాయని అంటున్నారు. దీంతో నది పరివాహక ప్రాంతాల్లో దుర్గంధం రాజ్యమేలుతోంది. నల్లా చానల్ ఎగువన ఉన్న కోటిలింగాల ఘాట్ నుంచి దిగువన ఉన్న పుష్కర ఘాట్, మార్కండేయ ఘాట్ వద్ద దుర్వాసన వస్తోందని చెబుతున్నారు. కొన్నిచోట్ల ప్లాస్టిక్ వ్యర్థాలు పెద్ద ఎత్తున పేరుపోయాయి. నదిలో కాలు పెట్టలేని విధంగా ఆ ప్రాంతం తయారైందని అంటున్నారు. గోదావరి కాలుష్యంపై రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ తోపాటు పేపరు మిల్లు యాజమాన్యానికి నోటీసులు జారీ చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ తన పర్యటన సమయంలో ఆదేశించారు. కానీ, ఇప్పటికీ ఆయా సంస్థల వైఖరిలో మార్పు రాలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై స్థానిక పత్రికల్లో పెద్ద ఎత్తున వార్తా కథనాలు వస్తున్నా అధికారులు చీమకుట్టినట్లుగా కూడా వ్యవహరించడం లేదని పర్యావరణ ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గోదావరిలో కలిసే మురుగునీటిని శుద్ధి చేయాలని, ఆ తర్వాతే నదిలోకి వదలాలి అని పవన్ సూచించారు. అయితే ధవళేశ్వరం సాయిబాబా గుడి దిగువన శుద్ధి చేయని మురుగునీరు ఇప్పటికీ కలుస్తుందని స్థానికులు చెబుతున్నారు. దీంతో నది రంగు, రూపం మారిపోతోందని అంటున్నారు. పుష్కరాలకు ఇంకా ఏడాది మాత్రమే సమయం ఉండటంతో అప్పటిలోగా ఈ పరిస్థితిలో మార్పు తీసుకురావాలని కోరుతున్నారు. ఇక గోదావరితోపాటు రాష్ట్రంలోని ప్రధాన నదులను కాలుష్యం నుంచి రక్షించేందుకు ఏర్పాటైన టాస్క్ ఫోర్సు ఏం చేస్తుందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రతి 15 రోజులకు ఒకసారి ఈ టాస్క్ ఫోర్సు సమావేశం కావాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఆ సమావేశంలో నదీ జలాల పరిరక్షణపై చర్యలు తీసుకోవాలని సూచించారు. అయితే టాస్క్ ఫోర్సు ఏర్పాటై నెల రోజులు అవుతున్నా ఇంకా కార్యాచరణ మొదలుపెట్టిన దాఖలా కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్ మరోసారి ఈ విషయమై ఫోకస్ చేయాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

# ‘స్త్రీశక్తి’ నెగిటివిటీనే పెంచుతుందా? ఉచితంతో అనవసర తలనొప్పి!



కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ‘స్త్రీశక్తి’ పథకం ఎటువంటి ఫలితాలు ఇచ్చిందనే చర్చ ఎక్కువగా జరుగుతోంది. గత ఏడాది ఆగస్టు 15న మొదలైన ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని రెండున్నర కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని పొందారు. అయితే ఉచితం అనగానే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే భావనే ఎక్కువగా వ్యక్తమవుతున్నా, క్షేత్రస్థాయి పరిస్థితులు గమనిస్తే ఈ పథకం అమలు తీరులో కొన్ని లోపాల వల్ల ప్రజలకు జరుగుతున్న మంచి కన్నా, ప్రభుత్వానికి వస్తున్న చెడ్డపేరే ఎక్కువగా ఉందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

గత ఏడాది ప్రవేశపెట్టిన స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకం ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదన్న అభిప్రాయాన్ని కలిగిస్తోందని అంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ స్కీమ్ ను దిగ్విజయంగా అమలు చేస్తున్నా, పథకం ఫలితాలు అనుభవిస్తున్న వారితోపాటు ఇతర ప్రయాణికుల్లోనూ సంతృప్తి కనిపించడం లేదన్న టాక్ ఎక్కువగా ఉంది. అదే సమయంలో పనిభారం, విధి నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులతో ఆర్టీసీ ఉద్యోగులు కూడా తీవ్ర అసంతృప్తికి గురి అవుతున్నారని చెబుతున్నారు. స్త్రీశక్తి అమలుకు ముందు ఇతర రాష్ట్రాల్లో ఎదురైన సవాళ్లను అధ్యయనం చేసిన కూటమి ప్రభుత్వం ఎంతో పకడ్బందీగా నిర్ణయాలు తీసుకుందని చెప్పినా, క్షేత్రస్థాయిలో అనేక లోపాలు పథకం ఉద్దేశాన్ని అటకెక్కిస్తున్నాయని పెదవి విరుస్తున్నారు.

ఉచిత బస్సుతో మహిళలు తండోపతండోలుగా ప్రయాణాలు చేస్తుండటంతో సిబ్బందిపై పనిభారం ఎక్కువైందనే ఆవేదన కనిపిస్తోంది. ఉదయం నుంచి రాత్రి వరకు మహిళా ప్రయాణికులు పోటెత్తుతుండటంతో బస్సులు అన్నీ కిటకిటలాడుతున్నాయని చెబుతున్నారు. దీనివల్ల డ్రైవర్, కండక్టర్లపై విపరీతమైన పని ఒత్తిడి పెరిగిపోయిందని అంటున్నారు. అదనపు డ్యూటీలు, పనివేళలు ఎక్కువ కావడం, సెలవులు లభించకపోవడం, విధి నిర్వహణ సమయంలో క్షణం కూడా తీరిక లేకపోవడం వల్ల సిబ్బంది చాలా ఇబ్బంది పడుతున్నారని అంటున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ఉద్యోగులు గుర్రుగా ఉన్నారని అంటున్నారు. ఆర్టీసీలో చాలా కాలం నుంచి నియామకాలు లేకపోవడం వల్ల ఇప్పటికే సిబ్బంది కొరత పీడిస్తోందని అంటున్నారు. స్త్రీశక్తి పథకం వల్ల రద్దీ పెరిగిపోవడం వల్ల సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి నెలకొందని అంటున్నారు. ఈ కారణంగానే మహిళా ప్రయాణికులతో కీచులాటలు జరుగుతున్నట్లు చెబుతున్నారు. ఉచితం అమలయ్యే బస్సుల్లో ప్రయాణికులు పరిమితికి మించి ప్రయాణిస్తుండటం, స్టాప్ ఉన్న చోట బస్సును నిలపలేని పరిస్థితులు కూడా చోటుచేసుకుంటున్నాయి. దీంతో మహిళలు సిబ్బందితో యుద్ధానికి దిగుతున్నారు. మరోవైపు మహిళా ప్రయాణికులు అనూహ్యంగా పెరిగిపోవడంతో ఇతర ప్రయాణికులు బస్సు ప్రయాణాన్ని నరకంలా భావించే పరిస్థితులు ఎదురవుతున్నాయని వ్యాఖ్యానిస్తున్నారు. ముఖ్యంగా ఉద్యోగాలకు వెళ్లేవారు సమయానికి బస్సులు అందుకోలేక నానా యాతన అనుభవిస్తున్నారని అంటున్నారు.

ఇది ప్రభుత్వంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని వ్యాఖ్యానిస్తున్నారు. ఆర్టీసీ బస్సు సర్వీసులు పెంచడం, అదనపు సిబ్బందిని నియమించడం, బస్సుల రాకపోకలపై నిరంతర పర్యవేక్షణ

ఉంటే తప్ప ఈ సమస్యలు అధిగమించే పరిస్థితి కనిపించడం లేదని అంటున్నారు. ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చిస్తున్న పథకం ఏ ఒక్కరికి సంతృప్తిని ఇవ్వకపోవడం అంటే తక్షణంలో ఆలోచించాల్సిన విషయమే అంటున్నారు. కొన్ని మార్పులు చేయడం ద్వారా ప్రభుత్వం ఆశించిన ప్రయోజనం దక్కే అవకాశం ఉన్నప్పటికీ, ఆర్టీసీ ఆ దిశగా ప్రయత్నాలు చేయకపోవడంతో స్త్రీశక్తి అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు.

# “నాది తక్కువ కులం” అందుకే మంత్రిని కాలేదు - ఫైర్ బ్రాండ్ చింతమనేని స్టన్నింగ్ కామెంట్స్!



తనకు మంత్రి పదవి దక్కకపోవడంపై ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సామాజిక సమీకరణాల వల్లే మంత్రిని కాలేకపోయానని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా తనది తక్కువ కులం అంటూ ఎమ్మెల్యే చింతమేని వ్యాఖ్యానించడం వైరల్ అవుతోంది. తన జాతకంలో మంత్రి యోగం లేదని, ఆ విషయమై తనకు అవగాహన ఉందని స్పష్టం చేశారు. దీంతో మంత్రి పదవిపై తనకు ఆశ లేదని చింతమనేని తేల్చిచెప్పినట్లైందని అంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా క్షేత్రస్థాయి పరిస్థితులు తెలుసుకునేందుకు ఓ యూట్యూబ్ చానల్ ఆయనను ఇంటర్వ్యూ చేసింది. ఈ సందర్భంగా చింతమనేనికి మంత్రియోగంపై ఇంటర్వ్యూలో ఎదురైన ప్రశ్నకు ఆయన తన సహజ పద్ధతిలో జవాబివ్వడం నెటిజన్లను ఆకర్షించింది. ఫైర్ బ్రాండ్ గా వచ్చిన గుర్తింపు వల్లే చింతమనేని మంత్రి కాలేకపోయారా? అన్న ప్రశ్నపై ఎమ్మెల్యే ప్రభాకర్ ఆసక్తికరంగా సమాధానమిచ్చారు. తన ఆవేశం వల్ల కేబినెట్ మంత్రి పదవి దక్కలేదని అనుకోవడం తప్పేనని అన్నారు. తన ఆవేశం వల్ల ఏ నష్టం జరగలేదని చెప్పుకొచ్చారు. అయితే మంత్రి పదవి రాకపోడానికి చాలా కారణాలు ఉన్నాయని వివరించారు. అందులో తన కులం కూడా ప్రధానమేనని చింతమనేని స్పష్టం చేశారు. “నా కులం తక్కువ కులం. నా కులంలో ఎంతమందికి అవకాశం ఇస్తారు? చంద్రబాబుది నా కులమే, లోకేశ్ బాబుది నా కులమే”నని చింతమనేని వ్యాఖ్యానించారు. తనకు పదవి రాకపోవడానికి సామాజిక సమీకరణాలు మాత్రమే కారణమని చెప్పే క్రమంలో తక్కువ కులం అంటూ చింతమనేని అన్న మాటలు నెటిజన్లను ఆకర్షించాయి. అగ్రవర్ణాలకు చెందిన ఎమ్మెల్యే చింతమనేని తనను తాను ‘తక్కువ కులం’ అంటూ చెప్పుకోవడంపై చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో తమ సామాజికవర్గం జనాభా పరిమితంగా ఉన్నారని, జనాభాలో తక్కువగా ఉన్న తమ సామాజిక వర్గానికి ఎక్కువ అవకాశాలు ఎలా ఇస్తారని వివరించే క్రమంలో ఎమ్మెల్యే చింతమనేని తనది ‘తక్కువ కులం’ అంటూ చెప్పుకుని అందరి అటెన్షన్ పొందారని అంటున్నారు. ఇక ఈ కామెంట్ల ద్వారా పార్టీపైన ముఖ్యమంత్రి చంద్రబాబుపైన తన విధేయత చాటుకున్నారని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన చింతమనేని మంత్రి పదవి ఆశిస్తున్నట్లు టీడీపీలో జరుగుతున్న చర్చకు ఆయనే ఫుల్ స్టాప్ పెట్టారని అంటున్నారు. మంత్రి పదవి విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును పూర్తిగా సమర్థిస్తున్నట్లు చింతమనేని మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆచితూచి నిర్ణయాలు తీసుకుంటారని, అందరికీ న్యాయం చేస్తారని అన్నారు. మంత్రి పదవి ఇవ్వలేదని విమర్శించేందుకు కూడా తాను సరిపోనని అన్నారు. తనకు అన్నీ అర్థం అవుతున్నాయని అనవసర వివాదాల్లోకి లాగొద్దని వేడుకున్నారు. తనకు మంత్రి పదవి వద్దని ఖరాకండీగా తేల్చిచెప్పారు. కాగా, సాధారణ రాజకీయ నాయకులకు భిన్నంగా తనకు మంత్రి పదవి వద్దని, మంత్రి అయ్యే యోగం లేదని చింతమనేని చెప్పడమే హాట్ టాపిక్ అవుతోంది. ఏ రాజకీయ నాయకుడైనా ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మంత్రి పదవి చేపట్టాలని కలలు కంటుంటారు. కానీ, మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా సామాజిక సమీకరణాల దృష్ట్యా తనకు మంత్రి పదవి దక్కదని ముందే గుర్తించి చింతమనేని అధిష్టానానికి వెసులుబాటు కల్పించారని నెటిజన్లు చమత్కరిస్తున్నారు.

# బాబోయ్... అదేం తిండిరా నాయనా!




అమెరికా ఇండిపెండెన్స్‌డే సందర్భంగా జులై 4వ తారీకున దేశ వ్యాప్తంగా ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తారు. పెద్ద ఎత్తున ఉత్సవాలు, వేడుకలు, కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా దేశ ప్రజలందరినీ భాగస్వామ్యం చేయడం జరుగుతుంది. ప్రభుత్వం మాత్రమే కాకుండా కొన్ని ప్రైవేట్ సంస్థలు, సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు సైతం ఇండిపెండెన్స్ డే కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుంది. న్యూయార్క్‌లోని కోని ఐలాండ్‌లో అమెరికా ఇండిపెండెన్స్ డే సందర్భంగా వింత పోటీ జరుగుతుంది. ఈ పోటీలో గెలిచిన వారికి భారీ మొత్తంలో ప్రైజ్ మనీ ఉంటుంది. పది ఇరవై సంవత్సరాల నుంచి కాకుండా ఏకంగా 110 ఏళ్లు గా ఈ పోటీ జరుగుతుంది. కేవలం తినడం ద్వారా పోటీలో నెగ్గి పెద్ద మొత్తంలో ప్రైజ్ మనీ గెలుచుకోవచ్చు. ఈసారి ప్రైజ్ మనీ ఏకంగా 10 వేల డాలర్లను జోయ్ చెస్ట్‌నట్ అనే వ్యక్తి గెలుచుకున్నాడు.

**10 నిమిషాల్లో ఎక్కువ హాట్ డాగ్స్...**

ఇంతకు పోటీ ఏంటి? ఏం చేయాలి అనే కదా... పోటీ వివరాల్లోకి వెళ్తే.. పోటీదారులు 10 నిమిషాల వ్యవధిలో ఎక్కువ హాట్ డాగ్స్‌ను తినాల్సి ఉంటుంది. అమెరికాలో అత్యధికులు తినే ఆహారం హాట్ డాగ్స్ అనే విషయం తెల్సిందే. బ్రెడ్, సాసేజ్ మాంసం కలిపి తయారు చేసే ఈ ఆహార పదార్థంను అమెరికాలో ధనికుల నుంచి పేదవారి వరకు అంతా తింటారు. అందుకే పోటీలో హాట్ డాగ్స్ ను ఉంచి ఉంటారని అంటారు. ఈ ఏడాది పోటీలో పెద్ద ఎత్తున జనాలు పాల్గొన్నారు. పోటీదారులు హాట్ డాగ్స్‌ను నీటిలో ముంచుకుని తినవచ్చు. అలా తినడం వల్ల బ్రెడ్ నీటిలో మెత్తబడి తినడానికి ఈజీగా ఉంటుంది. ఎంత స్పీడ్ గా తిన్నా అయిదు పది కంటే ఎక్కువ తినడం సామాన్యులకు సాధ్యం కాదు. కానీ పోటీలో పాల్గొన్న వారు ముందస్తుగా ప్రాక్టీస్ చేసి ఉంటారు కనుక పది ఇరవై ముప్పై కూడా తిన్నారు. అయితే జోయ్ మాత్రం ఏకంగా 67 హాట్ డాగ్స్ ను కేవలం 10 నిమిషాల వ్యవధిలో తినేశాడు.

**అమెరికా ఇండిపెండెన్స్ డే...**

నిర్ణీత సమయంలో ఎన్ని తింటారో అన్ని హాట్ డాగ్స్ కడుపులోనే ఉండాలి. తిన్న వెంటనే వాంతులు చేసుకోవడం చేయకూడదు. అలా వాంతులు చేసుకుంటే డిస్క్వాలిఫై చేస్తారు. ఆ తర్వాత స్థానంలో ఉన్న వారిని విజేతగా ప్రకటిస్తారు. ఎన్ని తింటే అన్ని కడుపులోనే వాంతులు కాకుండా ఉంచుకోవడం మామూలు విషయం కాదు. ఇక పది నిమిషాల తర్వాత నోట్లో ఉన్న హాట్ డాగ్స్ ను కంప్లీట్ చేయడానికి 30 సెకన్ల సమయం ఇస్తారు. ఆ సమయంలోపు మొత్తం తినేసి నోరు ఖాళీగా ఉంచుకోవాలి. తినే సమయంలో ఎక్కువగా వేస్ట్ కాకుండా చూసుకోవాలి. హాట్ డాగ్స్‌ను వేస్ట్ చేస్తూ కంది పడేసిన వారిని కూడా డిస్క్వాలిఫై చేయడం జరుగుతుంది. ఇన్ని కండీషన్స్ మధ్య 10 నిమిషాల్లో ఏకంగా 67 హాట్ డాగ్స్ తిన్నాడంటే వాడు మనిషి కాదు కుంభకర్ణుడు అని కొందరు సోషల్ మీడియాలో సరదాగా జోకులు వేసుకుంటున్నారు.1916 నుంచి నిర్వహిస్తున్న ఈ పోటీని చూసేందుకు వేలాది మంది తరలి వస్తారు. అంతే కాకుండా ఈ కార్యక్రమాన్ని లైవ్ ఇచ్చే స్పోర్ట్స్ ఛానల్ ఇఎస్పీఎన్ ను ఆ రోజు కోట్లాది మంది ప్రపంచ వ్యాప్తంగా చూస్తూ ఉంటారు. ప్రపంచవ్యాప్తంగా ఈ వింత ఆటకు అభిమానులు ఉన్నారు. ప్రతి ఏడాది ఎవరు గెలుస్తారా అని ఆసక్తిగా ఎదురు చూస్తూ ఉంటారు. జోయ్ చెస్ట్‌నట్ ఇప్పటి వరకు 17 సార్లు విజేతగా నిలిచాడు. ఇప్పుడు 18వ సారి అతడు ఈ తిండి పోటీలో విజేతగా నెగ్గాడు. అతడు ఈ పోటీలో పాల్గొనేందుకు ఏడాది అంతా చాలా వర్కౌట్స్ చేస్తాడు. తిన్నది వెంటనే అరిగేందుకు ఎక్కువగా నీళ్లు తాగుతాడు. కడుపు సైజ్ పెంచుకునేందుకు ప్రత్యేకమైన ఎక్సర్‌సైజులు

సైతం చేస్తాడట. అందుకే ఇన్ని సార్లు అతడు విజేతగా నిలిచాడు అని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. అదే రోజు అమ్మాయిలకు కూడా ఇదే పోటీ ఉంటుంది. మికి సుడో అనే మహిళ 10 నిమిషాల్లో 39 హాట్ డాగ్స్‌ను తినడం ద్వారా విజేతగా నిలిచింది. ఈమె 12వ సారి ఈ పోటీలో విజేతగా నిలిచినట్లు నిర్వాహకులు ప్రకటించారు.

ఏ దేశమైనా ఆర్థికంగా పరిపక్వం చెందాలంటే ఆ దేశ పౌరులకు డబ్బు గురించిన కనీస అవగాహన తప్పనిసరి. ఖర్చు-ఆదాయాల మధ్య సమతూకం పాటించడం, భవిష్యత్తు కోసం పొదుపు చేయడం, రిస్కులను అంచనా వేసుకుని మదుపు చేయడం, అప్పు ఎప్పుడు అవసరమో ఎప్పుడు అనవసరమో గుర్తించడం- ఇలాంటి ప్రాథమిక నైపుణ్యాలు లేని జనాభా గల దేశం ఎంత వేగంగా అభివృద్ధి చెందినా అది పైపైన మెరుగే తప్ప లోతైన స్థిరత్వం కాదు! దురదృష్టవశాత్తూ, ప్రపంచంలోనే వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా చెప్పుకుంటున్న భారత్‌లో ఈ మౌలిక అంశంలోనే పెద్ద లోటు కనిపిస్తోంది. జాతీయ ఆర్థిక విద్యా కేంద్రం (ఎన్‌సీఎఫ్‌ఈ) తాజా సర్వే ప్రకారం, దేశంలో కేవలం 27శాతం మందికే ప్రాథమిక ఆర్థిక అక్షరాస్యత ఉంది. ఇందులోనూ పట్టణ ప్రాంతాల్లో 33 శాతం మేర ఈ చైతన్యం కనిపిస్తే, గ్రామీణ ప్రాంతాల్లో అది 24 శాతానికే పరిమితమైంది. గోవా వంటి రాష్ట్రాలు అగ్రస్థానంలో నిలుస్తుండగా, ఛత్తీస్‌గఢ్ వంటివి అట్టడుగున ఉండటం ప్రాంతాల మధ్య అంతరాన్ని స్పష్టం చేస్తోంది. మహిళలు, గ్రామీణులు, తక్కువ ఆదాయ వర్గాలు ఈ లెక్కల్లో మరింత వెనకబడి ఉండటం సమస్య తీవ్రతను తేటతెల్లం చేస్తోంది. జీ20 దేశాల సగటుతో పోలిస్తే భారత్ ఆర్థిక పరిజ్ఞాన స్కోరు (3.7) తక్కువగా (సగటు 4.3) ఉండగా, ఆర్థిక దృక్పథం స్కోరు (2.6) కూడా సగటు (3.0) కన్నా వెనకబడి ఉంది. ఆసక్తికరంగా, ఆర్థిక ప్రవర్తన స్కోరులో మాత్రం భారత్ (5.6) సగటును (5.4) మించి నిలవడం- ప్రజల్లో పొదుపు తత్త్వం లేదని కాదు, దాన్ని సరైన జ్ఞానంతో మలచుకోలేకపోతున్నారని అర్థం. అంటే, ఇది ప్రజల తెలివి తక్కువ తనం కాదు, తెలియజెప్పే వ్యవస్థ లేదన్న మాట!

ఈ వెనుకబాటుతనానికి కారణాలను నిశితంగా పరిశీలిస్తే, మూడు ప్రధాన అంశాలు కనిపిస్తాయి. మొదటిది- మన విద్యా వ్యవస్థలో ఆర్థిక విషయాలకు చోటే లేకపోవడం. గణితం, సైన్సు, చరిత్రలను నేర్పే పాఠశాలలు వడ్డీ రేట్లు ఎలా లెక్కించాలో, క్రెడిట్ స్కోరు ఎలా పనిచేస్తుందో, పెట్టుబడి రిస్కులను ఎలా బేరీజు వేసుకోవాలో నేర్పించవు. ఫలితంగా, యువత కళాశాల విద్య పూర్తయ్యేసరికి ఉద్యోగం సంపాదించడం మాత్రమే నేర్చుకుంటారు తప్ప, ఆ సంపాదనను ఎలా నిర్వహించాలో తెలియకుండానే బయటికొస్తారు. రెండోది- వినిమయ సంస్కృతి శరవేగంగా విస్తరించడం. దేశంలో 37 కోట్లకు పైగావున్న జెన్‌జీ యువత గత ఏడాది దాదాపు 93వేల కోట్ల డాలర్ల మేర ఖర్చు చేసినట్లు అంచనా. మొత్తం దేశీయ వినియోగ వ్యయంలో ఇది 43 శాతం వాటా. సామాజిక మాధ్యమాల ప్రభావంతో హోదా ప్రదర్శన, తక్షణ సంతృప్తి కోసం అవసరానికి మించిన ఖర్చులు పెరిగిపోయాయి. మూడోది, అత్యంత కీలకమైనది- సులభతర రుణాల వెల్లువ. ఈఎంఐలు, బై నౌ పే లేటర్ సదుపాయాలు, క్రెడిట్ కార్డులు, క్షణాల్లో మంజూరయ్యే లోన్ యాప్‌లు- వీటి వెనకున్న చక్రవడ్డీ లెక్కలు, దాచిన రుసుములు, ఆలస్య చెల్లింపు జరిమానాల గురించి తెలియకుండానే లక్షలాది మంది వాటి వలయంలో చిక్కుకుంటున్నారు. 2021-25 మధ్య భారతీయుల క్రెడిట్ కార్డు బకాయిలు 2.2 రెట్లు పెరిగి రూ.3 లక్షల కోట్లకు చేరడం, రుణగ్రహీతల తలసరి అప్పు రెండేళ్లలోనే 23శాతం అధికమై రూ.4.8 లక్షలకు చేరుకోవడం ఈ ధోరణికి అద్దం

## అప్పుల ఊబి!

పడుతున్నాయి. అప్పులు తీర్చలేక సతమతమవుతున్న వారి శాతం ప్రపంచ సగటు 32శాతం అయితే, భారత్‌లో అది ఏకంగా 51శాతంగా ఉండటం విస్తుగొలిపే వాస్తవం. ఆర్థిక సేవలు అందరికీ చేరువయ్యాయేమోగానీ, వాటిని వినియోగించుకునే విచక్షణ మాత్రం చేరువ కాలేదన్నది స్పష్టం! ఫలితంగా, గ్రామీణ కుటుంబాల్లో రుణభారం గత ఏడేళ్లలో 35శాతం నుంచి 46శాతానికి చేరింది. కుటుంబాల ఆస్తులు 48శాతం వృద్ధి చెందితే, వాటిపై అప్పుల భారం మాత్రం 102శాతం మేర ఇనుమడించడం- సంపదకన్నా రుణం వేగంగా పెరుగుతున్న ప్రమాదకర ధోరణికి నిదర్శనం. ఇది కేవలం వ్యక్తిగత కుటుంబాల సమస్యగా మిగలదు. చివరికి బ్యాంకింగ్ వ్యవస్థ స్థిరత్వాన్నే ప్రశ్నార్థకం చేసే స్థాయికి చేరే ప్రమాదం లేకపోలేదు.

ఈ సంక్షోభానికి పరిష్కారం ఎక్కడో దూరంలో లేదు, ప్రపంచ దేశాల అనుభవాల్లోనే ఉంది. బ్రెజిల్‌లో జాతీయ పాఠ్య ప్రణాళికలో ఆర్థిక విద్యను తప్పనిసరి అంశంగా చేర్చారు. కేంద్ర బ్యాంకు, విద్యావేత్తలు కలిసి రూపొందించిన 'అప్రెండర్ వేలర్' కార్యక్రమం ద్వారా విద్యార్థులకు వేతనం, రుణం, బడ్జెట్‌వంటి భావనలను తరగతి గదిలోనే పరిచయం చేస్తున్నారు. అక్కడి విద్యార్థుల్లో అధిక శాతం మంది గత ఏడాది కాలంలో పాఠశాలలోనే ఇలాంటి అంశాలు నేర్చుకున్నట్లు అంతర్జాతీయ సర్వేలు వెల్లడించాయి. ఆస్ట్రేలియా కూడా జాతీయ పాఠ్యప్రణాళికలో వినియోగదారు, ఆర్థిక అక్షరాస్యతను ప్రధాన స్రవంతి సబ్జెక్టుల్లో భాగం చేసింది. సమస్య పరిష్కారాన్ని, నిర్ణయాత్మక సామర్థ్యాన్ని, బాధ్యతాయుత ఆర్థిక ప్రవర్తనను విద్యార్థి దశనుంచే వారికి అలవాటు చేయడం ఈ దేశాల ప్రధాన లక్ష్యం. అయితే, కేవలం పాఠ్యప్రణాళికలో చేర్చడంతోనే సరిపోదని, ఉపాధ్యాయులకు తగిన శిక్షణ ఇవ్వడం, తల్లిదండ్రులను కూడా భాగస్వాములను చేయడం అవసరమని ఆయా దేశాల అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి. భారత్‌లో సైతం జాతీయ ఆర్థిక విద్యా వ్యూహం (2020-25) పేరిట కేంద్రం ఒక విధానాన్ని రూపొందించినా, అది ఇంకా పాఠశాల స్థాయిలో తప్పనిసరి పాఠ్యాంశంగా మారలేదు. కళాశాలల్లో ఆర్థిక నిర్వహణ, పన్నుల ప్రాథమికాంశాలు, పెట్టుబడి సూత్రాలు వంటివి ఒక ప్రత్యేక సబ్జెక్టుగా బోధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బ్యాంకులు, నియంత్రణ సంస్థలు కూడా కేవలం ప్రచార కార్యక్రమాలకే పరిమితం కాకుండా, గ్రామస్థాయిలో నిరంతర అవగాహన శిబిరాలు నిర్వహించాలి. డిజిటల్ రుణ యాప్‌లపై కఠిన నియంత్రణ, క్రెడిట్ స్కోరు వ్యవస్థపై ప్రజల్లో అవగాహన పెంచడం, పొదుపు-మదుపు అలవాట్లను ప్రోత్సహించే పన్ను ప్రోత్సాహకాలు- ఇలాంటి బహుముఖ వ్యూహాలతోనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. యువత చేతిలో డబ్బు ఉంది. ఖర్చు చేసే ఉత్సాహమూ ఉంది. కానీ దాన్ని సరైన దిశలో మళ్లించే జ్ఞానం లోపించింది! ఆ లోటును పూడ్చకుండా వదిలేస్తే, ఆర్థిక వృద్ధి రేటు ఎంత గొప్పగా కనిపించినా, పౌరుల జేబుల్లో మిగిలేది రుణభారమే తప్ప నిజమైన శ్రేయస్సు కాదని గుర్తించాలి. భావితరాలకు బాధ్యతాయుతమైన ఆర్థిక దృక్పథాన్ని అందించడమే నిజమైన అభివృద్ధికి పునాది!!

## పనికొచ్చే పలుకు



## నియంత్రణలో లేనివాటిని.. వదిలేద్దాం..!!

"మీ నియంత్రణలో లేని విషయాలనుంచి చేతులు తీసేయండి. మీరు మార్చగలిగే వాటిపైనే దృష్టి పెట్టండి. మీరు నియంత్రించగలిగేది కేవలం మిమ్మల్ని మాత్రమే"

ప్రపంచ ప్రఖ్యాత పాప్ బ్యాండ్ 'బీటీఎస్' సభ్యుడు సుగా (మిన్ యూన్-గి) చెప్తోన్న పనికొచ్చే మాటిది. ఈ మాట సోషల్ మీడియాలో, మోటివేషనల్ గ్రూపుల్లో మార్మోగుతూనే ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న బీటీఎస్ అభిమానులకే కాకుండా, నిరాశలో ఉన్న ఎంతోమందికి ఈ వ్యాఖ్యలు ఒక దిక్సూచి.

పైకి చూడటానికి ఈ సందేశం చాలా సాధారణంగా అనిపించొచ్చు. కానీ, దీని వెనుక ఎంతో లోతైన అర్థముంది. మన ప్రమేయం లేకుండా జరిగే పరిస్థితులపై శక్తినంతా వృథా చేయడం కంటే, మనం తీసుకోగల నిర్ణయాలు, మార్చుకోగల వైఖరిపైనే దృష్టి పెట్టాలని సుగా సూచన. రాజకీయ అస్థిరత, ఆర్థిక అనిశ్చితి, నిరంతర డిజిటల్ పరధ్యానంతో కూడిన ఈ కాలంలో, ఆందోళనలను, నిరాశను అధిగమించడానికి ఈ తత్వం ఒక ఆచరణాత్మక మార్గం చూపుతుంది. ఈ మాటలు చెప్పిన వ్యక్తి సాధారణ జీవితం నుంచి అసాధారణ శిఖరాలకు చేరడం వల్లే దీనికి అంతటి ఆదరణ లభించింది.

విజయాల గురించి కేవలం ఉపన్యాసాలిచ్చే ఇతర ప్రముఖులలా కాకుండా, సుగా తన సొంత అనుభవాలనుంచే ఈ జీవిత తత్వాన్ని అలవర్చుకున్నారు. బీటీఎస్ బ్యాండ్ సభ్యుడిగా, అలాగే 'అగస్ట్ డి' అనే పేరుతో సోలో ఆర్టిస్ట్‌గా ఆయన అందించిన పాటల్లో మానసిక ఆరోగ్యం, ఆత్మసందేహం, ఆశయాలు, స్వీకరణవంటి అంశాలు స్పష్టంగా కనిపిస్తాయి. పరిస్థితులు ఎప్పుడూ మన చేతుల్లో ఉండకపోవచ్చు, కానీ వాటికి మనం ఎలా స్పందిస్తామనేదే మన చేతుల్లో ఉంటుందని ఆయన తన ప్రయాణం ద్వారా నిరూపించారు.

ఉద్యోగంలో విజయం, సమాజంలో గుర్తింపు, ఆర్థిక భద్రత వంటి ఫలితాల గురించి ఆలోచిస్తూ చాలామంది వర్తమానాన్ని కోల్పోతుంటారు. అయితే, ఫలితంకంటే మనం పెట్టే శ్రమ, మన వ్యక్తిగత ఎదుగుదల, ప్రస్తుత క్షణంలో మనకున్న అవకాశాలపైనే దృష్టి పెట్టాలని సుగా సలహా ఇస్తున్నారు.

ఈ సూత్రాన్ని ఎలా అన్వయించుకోవాలి?

ఈ తత్వాన్ని మన దైనందిన జీవితంలో చాలా సులభంగా అన్వయించుకోవచ్చు. ఉద్యోగ మార్కెట్ బాగోలేదని ఆందోళన చెందే అభ్యర్థి, మార్కెట్‌ను మార్చలేడు. కానీ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడంపై దృష్టి పెట్టగలడు. అలాగే, పరీక్ష ఫలితాల గురించి భయపడే విద్యార్థి, ఫలితాన్ని మార్చలేడు. కానీ పరీక్షకు సిద్ధమయ్యే విధానాన్ని మార్చుకోగలడు. వ్యక్తిగత జీవితంలో ఊహించని నష్టాలు ఎదురైనప్పుడు, గతాన్ని మార్చడం ఎవరికీ సాధ్యం కాదు. కానీ ఆ కష్టంనుంచి కోలుకుని ముందుకు ఎలా సాగాలో నిర్ణయించుకోవచ్చు. ఇక్కడ నియంత్రణను వదిలేయడం అంటే బాధ్యతారాహిత్యంగా ఉండటం కాదు. మన పరిమితులను గుర్తించి, ఎక్కడ శ్రమిస్తే సరైన ఫలితం వస్తుందో అక్కడ మాత్రమే మన శక్తిని కేటాయించడం. తీవ్ర శారీరక గాయాలు, మానసిక ఒత్తిళ్లు, అంతర్జాతీయ స్టార్‌డమ్ తెచ్చిపెట్టిన బాధ్యతలను మోస్తూనే సుగా ఒక పర్ఫామర్‌గా, ప్రొడ్యూసర్‌గా, సాంగ్ రైటర్‌గా నిరంతరం తనను తాను కొత్తగా ఆవిష్కరించుకుంటున్నారు. ఈ మాటలు కేవలం ఒక విజయానికో, సంతోషానికో గ్యారెంటీ ఇవ్వవు. జీవితంలో చాలా విషయాలు మన పరిధిలో లేకపోయినా, వాటికి మనమిచ్చే స్పందన మాత్రం పూర్తిగా మన చేతుల్లోనే ఉంటుందని గుర్తు చేస్తాయి.

# సంస్కరణలపై వెనుకంజ ఎందుకు?



సంస్కరణల విషయంలో భారత్ వ్యవహరిస్తున్న జాగ్రత్త ధోరణికి రెండు బలమైన కారణాలు. మొదటిది- పూర్తిగా విరిగిపోని దాన్ని బాగుచేయాలన్న తొందరపాటు తర్కబద్ధం కాదన్న వివేకం. రెండోది- లోతైన సంస్కరణలు లేకున్నా దేశం చాలావరకూ సవ్యంగానే సాగుతోందన్న వాస్తవం. మధ్య-ఆదాయ దేశాల సగటు వృద్ధి రేటు 4.1-4.4శాతం మధ్య ఉంటే, భారత్ మాత్రం స్థిరంగా 6-7శాతం శ్రేణిలో పరుగులు తీస్తోంది. ఇటీవలి అంచనాల ప్రకారం 2025-26లో దేశ వృద్ధి రేటు 7.6శాతంగా నమోదైంది. ప్రపంచంలోనే వేగవంతమైన ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ తన స్థానాన్ని నిలబెట్టుకుంది. అదే సమయంలో చైనా వృద్ధి రేటు 5శాతం నుంచి 4.4శాతానికి తగ్గుముఖం పట్టింది. అయినప్పటికీ, దేశీయంగా సంస్కరణల లేమిపై ఆందోళన రేకెత్తడానికి కారణం ఒక పోలిక పక్షపాతమే- రెండు దశాబ్దాల క్రితం చైనా రెండంకెల వృద్ధిని సాధించినప్పుడు మనమెందుకు సాధించలేకపోయామన్న అసమాన పోలిక. అయితే చైనా అప్పటి అధిక వృద్ధి ప్రపంచీకరణ శరవేగంగా విస్తరించిన కాలానికి, అమెరికా కమ్యూనిజాన్ని ఎదుర్కొనేందుకు అనుసరించిన భౌగోళిక రాజకీయ వ్యూహాలకు అనుకూలంగా జరిగిందన్న వాస్తవాన్ని విస్మరించడం సరికాదు. అమెరికా పెట్టుబడిదారీ విధానానికి కేంద్రమైన న్యూయార్క్ నగరమే నేడు చైనాకన్నా ఎక్కువ "సామ్యవాద" ధోరణులు ప్రదర్శించడం ఒక వ్యంగ్య వాస్తవం. దేశీయంగా అసంతృప్తి రెండు రూపాల్లో వ్యక్తమవుతోంది. వృద్ధి ద్వారా వచ్చిన ఆదాయాలను అవకాశాల అంతరాన్ని తగ్గించడానికి కాకుండా, జనాభాలో నాలుగోవంతున్న పేద, పేదకు దగ్గరగా ఉన్న వర్గాలను ఉచిత ఆహారం, నగదు బదిలీలు, రాయితీ సేవలతో ఓదార్చడానికి వినియోగిస్తున్నారన్నదే మొదటి అసంతృప్తి. వ్యక్తిగత ఆదాయపు పన్ను చెల్లించే వారు కేవలం 8.2 కోట్ల మంది మాత్రమే ఉండటం- కొన్ని కుటుంబాల్లో ఒకటికి మించి పన్ను చెల్లింపుదారులున్నారని పరిగణనలోకి తీసుకున్నా- దేశంలోని 30 కోట్ల కుటుంబాల్లో మూడోవంతు కన్నా తక్కువ మందే పన్ను పరిధిలో ఉన్నారని స్పష్టం చేస్తోంది. ఏడాదికి రూ.4 లక్షల ఆదాయ పరిమితి పేద, పేదకు దగ్గరి వర్గాలను నిర్వచించే ఎగువ హద్దుగా మారితే, గ్రామీణ కుటుంబాలకు జీవనోపాధి కల్పించే వీబీ-జీ రామ్ జీ పథకం కింద ఇటీవల ప్రకటించిన సగటు వేతనం రోజుకు రూ.327.4గా ఉంది. అంటే ఏడాదికి రెండు పనిచేసే వ్యక్తుల కుటుంబానికి సుమారు రూ.1.96 లక్షల "జీవించదగిన" ఆదాయం లభిస్తుందన్నమాట. అయితే అధికారిక రంగంలో ఉపాధి పొందుతున్నవారు కేవలం పది కోట్ల మంది, మొత్తం శ్రామిక శక్తిలో 12శాతమే. ఈ స్వల్ప స్థాయి ఔపచారిక ఉపాధి వ్యాప్తి అసంతృప్తికి కారణం. రాష్ట్రాల మధ్య ఆదాయ అసమానతలు తీవ్రంగా ఉండటంతో ఉత్తర, తూర్పు ప్రాంతాల నుంచి ఉద్యోగాలు అధికంగా ఉండే పశ్చిమ, దక్షిణాది రాష్ట్రాలకు వలసలు కొనసాగుతున్నాయి.

అయితే వృద్ధిని పరుగులు పెట్టించే "పెద్ద" సంస్కరణ ఏదైనా ఉందా అంటే, తక్షణం అమలు చేయగల సులభమైన సంస్కరణల జాబితా ఇప్పుడు దాదాపు ఖాళీగానే కనిపిస్తోంది. 1991నాటి సరళీకరణే చివరిసారి అలాంటి పెద్ద సంస్కరణ- అది వార్షిక వృద్ధి రేటుకు రెండు శాతం పాయింట్లను జోడించింది. ఇక మిగిలింది ప్రత్యేక ప్రయోజన వర్గాలను, పలుకుబడులను ఢీకొనే రాజకీయ మూల్యంతో కూడిన "లోతైన" సంస్కరణలే. రాబోయే రెండు శాతం పాయింట్ల అదనపు వృద్ధి రెండు వనరుల నుంచి రావచ్చు. మొదటిది- ఆర్థిక వ్యవస్థ మరింత లోతుగా డిజిటలీకరణ చెందడం. దిగువ-మధ్య ఆదాయ దేశంగా ఉంటూనే డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే అత్యంత చురుకైన అనుసరణదారుగా భారత్ నిలవడం, డిజిటల్ గుర్తింపు, ఖాతా అగ్రిగేటర్లు, రిస్క్ నిర్వహణతో కూడిన స్వదేశీ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను నిర్మించుకోవడం ఈ వ్యూహానికి సహజ బలం చేకూరుస్తున్నాయి. సంస్థల్లో కృత్రిమ మేధ వినియోగాన్ని లోతుగా విస్తరిస్తే, మధ్య వయస్కులైన ఐటీ ఉద్యోగులకు వ్యక్తిగత మూల్యం తప్పకపోయినా, మొత్తమ్మీద కొత్త ఉద్యోగాలు తొలగించే వాటికన్నా ఎక్కువగా సృష్టించవచ్చన్నది సాంకేతిక రంగ నిపుణుల అభిప్రాయం. ప్రస్తుతం డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో 80-100 లక్షలమంది ఉపాధి పొందుతుండగా, 2035 నాటికి అది 3 కోట్లకు చేరవచ్చు. అయినా అది శ్రామిక వయస్కుల జనాభాలో ఐదు శాతం కన్నా తక్కువే. అయితే దీని ప్రయోజనం వాస్తవ ఆర్థిక వ్యవస్థలో ఉత్పాదకత, పోటీతత్వాన్ని, తద్వారా ఉపాధిని పెంచడంలో ఉంటుంది, అయితే ఈ ప్రభావం విస్తరించడానికి సమయం పడుతుంది. వ్యవసాయ సంస్కరణ ఇప్పటికీ పెద్ద ఖాళీగానే మిగిలిపోయింది. వ్యవసాయంలో కార్పొరేట్ యాజమాన్యం, తయారీ రంగం నుంచి పెరిగే శ్రామిక డిమాండ్- గ్రామీణ ప్రాంతాలనుంచి వచ్చే మిగులు కార్మిక సరఫరాను ఒడిసిపట్టుకునే దీర్ఘకాలిక నిర్మాణాత్మక నిర్ణయాలను ఇంకా తీసుకోలేదు.

రాష్ట్ర ప్రభుత్వాల సార్వభౌమాధికారపు పట్టునుంచి పెద్ద నగరాలను విముక్తం చేయడం మనం వాయిదా వేస్తూ వస్తున్న మరో నిర్మాణాత్మక మార్పు. మొత్తం 23 కోట్ల జనాభా (దేశంలో ఏడో వంతు) కలిగిన సుమారు ఎనభై నగరాలు- పెద్ద మార్కెట్ పట్టణాలు, పట్టణ సముదాయాలు, తయారీ కేంద్రాలు లేదా పుణ్యక్షేత్రాలు కావడంవల్ల- ఆదాయాల్లో స్వయం సమృద్ధి సాధించగలవు. వీటిలో కొన్ని రాష్ట్ర రాజధానులే కూడా. రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక, పరిపాలనా వనరులపై ఆధారపడకుండా- ఆ వనరులను గ్రామీణాభివృద్ధికి కేటాయించేలా- ఇలాంటి నగరాలకు రాజకీయ, పరిపాలనా స్వయంప్రతిపత్తిని కల్పించాలి. అలా విముక్తమైన నగరాలు చండీగఢ్, పుదుచ్చేరి మాదిరిగా సాధికారత కలిగిన కేంద్రపాలిత ప్రాంతాలు లేదా మినీ-రాష్ట్రాలుగా రూపుదిద్దుకుంటాయి. గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీ- హాంకాంగ్ తరహా పట్టణ సార్వభౌమాధికారానికి తొలి ఉదాహరణగా నిలుస్తోంది. సమీప గ్రామీణ ప్రాంతాలు అలాంటి సార్వభౌమ నగరాల్లో విలీనం కావాలనుకుంటే, ఆ నిర్ణయాధికారం అక్కడి నివాసితులకే ఉండాలి- తద్వారా స్వచ్ఛందంగా పట్టణ సముదాయాలు ఏర్పడతాయి. ఇలాంటి కీలక భౌగోళిక సర్దుబాటు ఎందుకు అవసరమంటే- సమర్థవంతమైన వృద్ధి, అభివృద్ధిలో పట్టణ ప్రాంతాల నిర్దిష్ట పాత్రను భారత్ చాలాకాలంగా విస్మరిస్తోంది. చైనా నగరాల్లోకి ప్రవేశాన్ని నియంత్రిస్తే, అమెరికాలో బహిరంగ ప్రదేశాల్లో నిరాశ్రయులపై కఠిన చర్యలు మార్కెట్ ఆధారిత పరిష్కారంగా పనిచేస్తున్నాయి. నగర జీవితం నుంచి ప్రయోజనం పొందేవారిని, బంధువులను కలవడానికి వచ్చేవారిని అనుమతిస్తూ, ప్రభుత్వ లేదా ప్రైవేటు భూముల్లో అక్రమంగా నివాసం ఏర్పరచుకోవాలని చూసేవారిని గుర్తించే "అదృశ్య సరిహద్దు" విధానాన్ని భారత్ తనదైన రీతిలో రూపొందించుకోవాలి. నదీ జలాల న్యాయమైన పంపిణీ, సరిహద్దు దాటే కాలుష్య ప్రభావానికి పరిహారం, భారతీయ పౌరులు- చెల్లుబాటయ్యే వీసాలున్న విదేశీయులు అందరికీ నగరాల్లోకి బహిరంగ ప్రవేశం వంటి కఠిన నిర్ణయాలు తప్పనిసరి కానున్నాయి. ఇప్పటికే ఉన్న దాన్ని సూక్ష్మంగా సరిదిద్దుకుంటూ కాలం గడపడం సులభమే గానీ, నిజమైన అవకాశం భవిష్యత్తును పునర్నిర్వచించడంలోనే ఉంది. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ ఉత్పాదకతను అనూహ్యంగా విస్తరించే భవిష్యత్తు- తప్పనిసరిగా పట్టణ దృగ్విషయమే. జనాభాలో మూడో వంతుకు మాత్రమే కాకుండా, నాలుగో వంతు మందికి సైతం సేవలందించే సామర్థ్యాన్ని మన నగరాలకు కల్పించాలి. అప్పుడే ప్రతిభకు తగిన స్థానం లభించే ప్రజాస్వామ్యానికి సమాన అవకాశాల వేదిక ఏర్పడుతుంది! ■



వారానికి కేవలం గంటన్నర వ్యవధి కండరాల వ్యాయామం చేస్తే.. అన్ని కారణాల మరణ ముప్పులను తగ్గించవచ్చని అంతర్జాతీయ అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. చేతి పట్టు బలం (గ్రిప్ స్ట్రెంగ్త్) వంటి సాధారణ కొలమానం సైతం- గుండె జబ్బుల ముప్పును సైతం మించి- వృద్ధాప్య ఆరోగ్యానికి, దీర్ఘాయుష్షుకు నమ్మదగిన సూచికగా నిలుస్తోందని పరిశోధకులు గుర్తించారు. డెబ్బై, ఎనభై ఏళ్ల వయసులో సైతం శరీరం కండరాల వ్యాయామానికి సానుకూలంగా స్పందిస్తుందని, బలాన్ని పెంచుకోవడానికి ఎప్పుడూ ఆలస్యం కాదని ఈ పరిశోధనలు రుజువు చేస్తున్నాయి. సో, వయసుతో నిమిత్తం లేకుండా ఇవాళ్టి నుంచే శారీరక ఆరోగ్యం కోసం కొద్దిపాటి కసరత్తుల పెట్టుబడి పెట్టండి.

-మహాదేవ

## వింతల్లో వింతలు

### పైకప్పు వాన..



తీవ్ర ఎండలతో అల్లాడుతున్న చైనాలో ఓ వినూత్న శీతలీకరణ విధానం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఉత్తర చైనాలోని షాన్షీ ప్రావిన్స్‌లోని యున్‌చెంగ్ నగరంలో పలు అపార్ట్‌మెంట్ భవనాల పైకప్పులపై ప్రత్యేక పరికరాలను అమర్చారు. ఇవి అత్యంత సూక్ష్మమైన నీటి తుంపరలను గాలిలోకి వెదజల్లుతాయి. ఈ నీటి బిందువులు ఆవిరైనప్పుడు చుట్టుపక్కల గాలి నుంచి వేడిని పీల్చుకుని, ఉష్ణోగ్రతను దాదాపు 8 డిగ్రీల సెల్సియస్ వరకూ తగ్గిస్తాయని చెబుతున్నారు. మన శరీరం చెమట ద్వారా చల్లబడే సూత్రమే దీని వెనుక పనిచేస్తుంది. అయితే, పెద్ద ఎత్తున దీని సామర్థ్యం, నీటి వినియోగం, నాజిల్స్ మూసుకుపోయే అవకాశం వంటి ప్రశ్నలకు ఇంకా స్పష్టమైన సమాధానాలు లేవు. అయినా, యూరప్, అమెరికాల్లో వేడిగాలులు విజృంభిస్తున్న వేళ ఈ ప్రయోగం ప్రపంచవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది.



# భోజనం చేశాక వేసే యోగాసనం ఇది..

## 5 నిమిషాలు చేస్తే జీర్ణ సమస్యలు ఉండవు..

భోజనం ముగిసిన కొద్దిసేపటికే పొట్ట బరువుగా అనిపించడం, ఉబ్బరం, అలసట వంటి సమస్యలు చాలామందిని వేధిస్తాయి. ముఖ్యంగా రాత్రి భోజనం తర్వాత ఈ అసౌకర్యం నిద్రపైనా ప్రభావం చూపుతుంది. అలాంటి సమయంలో వెంటనే మందులు తీసుకోవడం లేదా పడుకోవడం కంటే ఒక సులభమైన సహజ మార్గం ఉంది. అదే వజ్రాసనం లేదా థండర్‌బోల్ట్ పోజ్. వజ్రాసనం భోజనం తర్వాత జీర్ణక్రియకు సహాయపడే సులభ యోగా ఆసనమని యోగా నిపుణులు చెబుతున్నారు. వజ్రాసనం ప్రత్యేకత ఏమిటంటే, ఇది భోజనం చేసిన వెంటనే చేయగలిగే అరుదైన యోగా ఆసనాలలో ఒకటి. భారతీయ సంప్రదాయంలో శతాబ్దాలుగా దీన్ని జీర్ణక్రియను మెరుగుపరచడానికి ఉపయోగిస్తున్నారు. పరిశోధనల ప్రకారం యోగా అభ్యాసం చేసే వ్యక్తులు ఆరోగ్యకరమైన ఆహారం, శారీరక చలనం, జీవనశైలి అలవాట్లను అనుసరిస్తారు.

### రక్త ప్రసరణ మెరుగ్గా..

ఈ ఆసనం చేయడం వల్ల శరీరంలో జీర్ణక్రియ అవయవాలకు రక్తప్రసరణ మెరుగుపడుతుంది. దీని వలన ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. అలాగే ఉబ్బరం, గ్యాస్, ఆమ్లత్వం వంటి సమస్యలు తగ్గుతాయి. అంతేకాకుండా వెన్ను కండరాలు బలపడటానికి ఇది సహాయపడుతుంది. కొంతవరకు సయాటికా నొప్పి తగ్గించడంలో కూడా ఉపశమనం ఇస్తుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. టైప్-2 డయాబెటిస్ లక్షణాల నియంత్రణలో కూడా ఇది కొంత ఉపయోగకరమని పరిశోధనలు చెబుతున్నాయి. వజ్రాసనం చేయడం చాలా సులభం. ముందుగా నేలపై మోకాళ్లపై కూర్చోవాలి. మోకాళ్లు కలిపి ఉంచి, పాదాలపై పిరుదులను వుంచాలి. వెన్నుని నిటారుగా ఉంచి, భుజాలను రిలాక్స్ చేయాలి. చేతులను తొడలపై ఉంచి, కళ్లను మూసుకుని నెమ్మదిగా శ్వాస తీసుకోవాలి. భోజనం తర్వాత 5 నుంచి 10 నిమిషాల పాటు ఈ ఆసనంలో ఉండటం మంచిది. కొత్తవారు మొదట 2-3 నిమిషాల నుంచి ప్రారంభించి, క్రమంగా సమయాన్ని పెంచుకోవచ్చు.

### వీరు వేయకూడదు..

ఈ ఆసనం చేసిన కొద్దిసేపటికే పొట్ట తేలికగా అనిపించడం మొదలవుతుంది. దీన్ని రోజువారీ అలవాటుగా మార్చుకుంటే జీర్ణక్రియ మెరుగుపడటమే కాకుండా, ఆమ్లత్వం, అజీర్ణ సమస్యలు కూడా తగ్గే అవకాశం ఉంటుంది. అలాగే ఇది మనసుకు ప్రశాంతతను కూడా ఇస్తుంది. అయితే తీవ్రమైన మోకాళ్ల నొప్పి, కాళ్ల గాయాలు లేదా కీళ్ల సమస్యలు ఉన్నవారు ఈ ఆసనం వేయకూడదు. అవసరమైతే కాళ్ల మధ్య కుషన్ ఉపయోగించడం ద్వారా సౌకర్యంగా చేసుకోవచ్చు. దీన్ని దీర్ఘకాలిక జీర్ణ సమస్యలకు ప్రత్యామ్నాయంగా భావించకూడదు. తరచూ ఇబ్బందులు ఎదురైతే వైద్యులను సంప్రదించడం అవసరం. ఇక వజ్రాసనం అసలు ప్రయోజనం దీన్ని క్రమం తప్పకుండా వేయడంలోనే ఉంది. భోజనం తర్వాత వెంటనే పడుకోవడం లేదా మొబైల్ వాడటం కంటే, కొన్ని నిమిషాలు వజ్రాసనంలో కూర్చోవడం ద్వారా ఆరోగ్యానికి మేలు కలుగుతుంది. చిన్న అలవాటు అయినా, పెద్ద మార్పును తీసుకువస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.

# బరువు తగ్గాలంటే ఈ సూచనలను పాటించడం తప్పనిసరి.. లేదంటే సమస్య పరిష్కారం కాదు..



మారిన జీవన విధానం కారణంగా తలెత్తే సమస్యల్లో మొదటిది అధిక బరువు. ఈ సమస్యతో చాలా మంది బాధ పడుతున్నారు. అధిక బరువు కారణంగా అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్న సంగతి అందరికీ తెలిసిందే. అయితే ఆరోగ్యం మీద స్పృహ రావడంతో చాలా మంది బరువు తగ్గడానికి ప్రయత్నిస్తున్నారు. బరువు తగ్గాలని అనుకోగానే ముందుగా చాలా మంది ఆహారాన్ని కట్టడి చేయడం ప్రారంభిస్తారు. కార్బొహైడ్రేట్లు మానేయడం, ఇష్టమైన వంటకాలను దూరం పెట్టడం, కఠినమైన డైట్‌లు పాటించడం వంటివి అందరిలో సాధారణంగా కనిపిస్తాయి. అయితే ఈ నమ్మకాలలో చాలా వరకు నిజం కాదని ఫిట్‌నెస్ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. బరువు తగ్గాలంటే ఫాస్ట్ ఫుడ్ పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. సరైన క్యాలరీలను తీసుకుంటూ, తగినంత ప్రోటీన్ అందుకుంటే అప్పుడప్పుడు బర్గర్లు లేదా ర్యాప్స్ తిన్నా బరువు తగ్గడంలో పెద్ద సమస్య ఉండదని వారు చెబుతున్నారు.

### అసలు సమస్య అదే..

మీల్ ప్రెప్ అనే అలవాటు అందరికీ అవసరం కాదు. ముందుగానే వండిన ఆహారం చాలా సందర్భాల్లో వృథా అయ్యే అవకాశం ఉంటుంది. అందుకే సులభంగా, త్వరగా తయారు చేసుకునే ఆహారాలను ఎంపిక చేసుకోవడం మంచిదని వారు సూచిస్తున్నారు. అంతేకాకుండా ఉదయం అల్పాహారం విషయంలో కూడా జాగ్రత్త అవసరమని, ప్రోటీన్ ఎక్కువగా ఉండే బ్రేక్‌ఫాస్ట్ తీసుకుంటే రోజంతా ఆకలి నియంత్రణలో ఉంటుందని, తక్కువ ప్రోటీన్ ఉన్న ఆహారం తీసుకుంటే త్వరగా ఆకలి వేస్తుందని నిపుణులు తెలియజేస్తున్నారు. అలాగే కార్బొహైడ్రేట్లను పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. బియ్యం, రొట్టె, ఆలుగడ్డలు వంటి ఆహారాలు సమస్య కాదు. అసలు సమస్య ఎక్కువగా తినడమేనని వారు చెబుతున్నారు. ఇంట్లో వండిన ఆహారం మాత్రమే ఆరోగ్యకరం అనే భావన పూర్తిగా నిజం కాదని, బయట తిన్నా, ఇంట్లో తిన్నా ప్రోటీన్, క్యాలరీలు ఒకే విధంగా పనిచేస్తాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

### అన్ని రకాల వ్యాయామాలు అవసరం..

ఇక వ్యాయామంలో కార్డియోకే ప్రాధాన్యం ఇవ్వడం సరైన విధానం కాదు. శక్తి వ్యాయామాలు (strength training) కూడా చాలా ముఖ్యమైనవి. మొదట వెయిట్ లిఫ్టింగ్ చేసి, తరువాత వాకింగ్ చేయడం మంచిది. సప్లిమెంట్స్ ఎక్కువగా అవసరం ఉండవు. సాధారణ ఆహారంతోనే ఎక్కువ పోషకాలు పొందవచ్చు. జిమ్‌లో ఎక్కువ సమయం గడిపితేనే ఫలితాలు వస్తాయని అనుకోవడం తప్పు. క్రమంగా, నిరంతరంగా చేయడం (consistency) ముఖ్యమైనదని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే బరువు కొలిచే త్రాసుపై చాలా మంది ఎక్కువగా ఆధారపడుతూ ఉంటారు. రోజువారీ బరువు మార్పులు సహజం. అయితే దానిని కొవ్వు పెరిగిందని అర్థం చేసుకోకూడదని వారు చెబుతున్నారు. బరువు తగ్గాలనుకునే వారు సంకల్పబలం (willpower) మీద మాత్రమే ఆధారపడకుండా, సులభమైన ఆహార ప్రణాళికలు అలవాటు చేసుకోవాలని, ఆహారాన్ని కఠినంగా నియంత్రించడం కంటే, దానిని సరిగ్గా అర్థం చేసుకుని సమతుల్యంగా తీసుకోవడం ద్వారా బరువు తగ్గడం సులభం అవుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

# అధిక వేడి తగిలేలా తేనెను ఉపయోగిస్తున్నారా.. అయితే ఇది తెలుసుకోండి..



తేనె ఆరోగ్యానికి మంచిదనే భావన చాలా మందిలో ఉంది. సహజమైన మధుర పదార్థంగా చక్కెరకు ప్రత్యామ్నాయంగా దీన్ని ఎక్కువగా ఉపయోగిస్తారు. అయితే తేనెను ఎలా ఉపయోగిస్తామన్నదే దాని ప్రయోజనాలను నిర్ణయిస్తుందని పోషకాహార నిపుణులు స్పష్టం చేస్తున్నారు. తేనె సాధారణంగా సురక్షితమైన ఆహార పదార్థమే. శతాబ్దాలుగా దీన్ని ఆహారంలో భాగంగా ఉపయోగిస్తున్నారు. కానీ దీనిని వేడి చేసే విధానం, నిల్వ చేసే విధానం వంటి అంశాలు దాని పోషక విలువలపై ప్రభావం చూపుతాయని నిపుణులు చెబుతున్నారు.

### అధిక వేడికి గురికావద్దు..

తేనెను మోస్తరు ఉష్ణోగ్రత వద్ద వాడడం పెద్ద సమస్య కాదు. సాధారణ వంటకాలలో లేదా గోరువెచ్చని పదార్థాల్లో కలిపితే హానికరం కాదు. కానీ అధిక ఉష్ణోగ్రత వద్ద వేడి చేస్తే సమస్యలు మొదలవుతాయి.

అధిక వేడి వల్ల తేనెలో ఉండే సహజ ఎంజైమ్స్, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు క్రమంగా నశించిపోతాయి. సుమారు 40 డిగ్రీల సెల్సియస్‌కి పైగా ఉష్ణోగ్రతలకు తేనెను గురి చేస్తే థర్మల్ డీగ్రడేషన్ అనే ప్రక్రియ ప్రారంభమవుతుందని నిపుణులు చెబుతున్నారు. అంటే తేనె నిర్మాణం మారి, దాని గుణాత్మక విలువ తగ్గిపోతుంది. ఫలితంగా రుచి, వాసన, రంగు కూడా మారే అవకాశం ఉంటుంది.

### సరిగ్గా ఉపయోగించాలి..

అందువల్ల తేనెను సరిగ్గా ఉపయోగించడం అలవాటు చేసుకోవాలి. తేనెను సరిగ్గా వాడడానికి కొన్ని సులభమైన సూచనలను కూడా నిపుణులు తెలియజేస్తున్నారు. మరిగిన నీటిలో కాకుండా గోరువెచ్చని నీటిలో తేనె కలపడం మంచిది. వంట పూర్తయ్యాక ఆహారంపై తేనెను జోడించడం ఉత్తమం. అలాగే తేనెను మళ్లీ మళ్లీ వేడి చేయడం నివారించాలి. వంటలో ప్రధాన పదార్థంగా కాకుండా చివర్లో జోడించే పదార్థంగా వాడితే దాని ప్రయోజనాలు మెరుగ్గా లభిస్తాయి. తేనె హానికరం కాదు. కానీ దాన్ని ఎలా వాడుతున్నామన్నదే కీలకం. సరైన విధంగా ఉపయోగిస్తేనే దాని సహజ ప్రయోజనాలను పూర్తిగా పొందగలమని నిపుణులు సూచిస్తున్నారు.

# పురుషుల్లో ఎల్లప్పుడూ అలసట, నీరసం ఉంటే.. వాటి అర్థం ఏమిటి.. ఏం చేయాలి..?



పురుషుల ఆరోగ్యం అంటే చాలామంది జిమ్, ప్రోటీన్ డైట్, ఫిట్‌నెస్ లక్ష్యాలకే పరిమితం చేస్తారు. కానీ నిజమైన ఆరోగ్యం చిన్న చిన్న లక్షణాల్లోనే దాగి ఉంటుంది. అలసట, ఒత్తిడి, జీర్ణ సమస్యలు వంటి విషయాలను సాధారణమే అని వదిలేయడం వల్ల భవిష్యత్తులో పెద్ద సమస్యలు వస్తాయి. అందుకే ఎక్కువగా మాట్లాడని కొన్ని ముఖ్య ఆరోగ్య సమస్యలపై దృష్టి పెట్టడం అవసరమని నిపుణులు చెబుతున్నారు. పురుషులు నిర్లక్ష్యం చేయకూడని ఆరోగ్య సమస్యల గురించి వైద్యులు వివరిస్తున్నారు. రోజంతా పని చేసిన తర్వాత అలసట అనిపించడం సహజం. కానీ ఎప్పుడూ అలసిపోయినట్టే అనిపిస్తే అది సాధారణం కాదు. చాలా మంది పురుషులు దీనిని నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. ఇది పోషకాహార లోపం, థైరాయిడ్ సమస్యలు, ఒత్తిడి లేదా మెటబాలిక్ సమస్యలకు సంకేతం అవుతుంది. ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేస్తే అసలు కారణం గుర్తించడంలో ఆలస్యం అవుతుంది.

### ఒత్తిడి, కోపం, ఒంటరితనం..

అలాగే యువకుల్లో కనిపించే గుండె సమస్యలను కూడా తక్కువగా తీసుకోకూడదు. గుండె జబ్బులు వృద్ధులకు మాత్రమే వస్తాయని భావించడం తప్పు. ఇప్పుడు 30-40 ఏళ్ల పురుషుల్లో కూడా హై బీపీ, కొలెస్ట్రాల్, పొగ త్రాగడం, ఒత్తిడి వంటి కారణాలతో గుండె సమస్యలు పెరుగుతున్నాయి. ఇవి ప్రారంభంలో లక్షణాలు చూపకపోవడం వల్ల ప్రమాదం ఎక్కువగా ఉంటోంది. అలాగే ఒత్తిడి -- కోపం వంటివి ఒంటరితనానికి తోడై పురుషులను కుంగదీస్తుంటాయి. పురుషులు తమ భావాలను తక్కువగా బయటపెడతారు. అందువల్ల ఒత్తిడి, ఎక్కువగా కోపం, చిరాకు లేదా ఒంటరిగా ఉండాలనే భావనగా కనిపిస్తుంది. ఇది వ్యక్తిగత జీవితం, ఉద్యోగంపై ప్రభావం చూపుతుంది. ఈ మార్పులను గుర్తించడం చాలా ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

### నిద్రలేమి..

అంతేకాకుండా నిద్ర లోపం కూడా రోజు వారి జీవితంపై ప్రభావం చూపిస్తుంది. చాలా మంది దీనిని అస్సలు పట్టించుకోరు. కానీ తక్కువ నిద్ర లేదా నాణ్యమైన నిద్ర లేకపోవడం అనేక సమస్యలకు కారణం అవుతుంది. గురక, తరచూ మేల్కొనడం, రోజంతా నిద్రమత్తుగా ఉండటం వంటి లక్షణాలు ఉంటే జాగ్రత్తగా ఉండాలి. సరైన నిద్ర లేకపోతే బరువు పెరగడం, రోగ నిరోధక శక్తి తగ్గడం, దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదం పెరగడం జరుగు తుంది. జీర్ణ సమస్యలను కూడా నిర్లక్ష్యం చేయకూడదు. ఉబ్బరం, ఆమ్లత్వం, అజీర్ణం వంటి సమస్యలను చాలామంది చిన్న విషయం గా తీసు కుంటారు. కానీ ఇవి తరచుగా వస్తే జీర్ణ వ్యవస్థ లేదా ఆహారపు అలవాట్లలో సమస్యలు ఉన్నాయనే సూచనగా భావించా లి. సరైన ఆహారం, నీరు, సమయానికి భోజనం తీసుకోవడం చేయాలి.

### వెంటనే అప్రమత్తం అవ్వాలి..

అదే విధంగా చాలా మంది పురుషులు మెల్లగా బరువు పెరుగుతూ ఉంటారు. వారి బరువు ఒక్కసారిగా పెరగదు. క్రమంగా పెరుగుతుంది. వ్యాయామం లేకపోవడం, తప్పు ఆహారం, ఒత్తిడి కారణంగా ఇది జరుగుతుంది. దీని వల్ల డయాబెటిస్, గుండె జబ్బులు, కీళ్ల సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది. తొందరగా మార్పులు చేసుకోవడం మంచిది. అలాగే చాలామంది సమస్యలు తీవ్రమైనప్పుడు మాత్రమే డాక్టర్‌ను సంప్రదిస్తారు. ఇది ప్రమాదకరం. రెగ్యులర్ చెకప్‌లు చేయించుకుంటే ముందుగానే సమస్యలను గుర్తించవచ్చు. రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్, బీపీ వంటి పరీక్షలు చాలా అవసరం. పురుషుల ఆరోగ్యం అంటే కేవలం బలంగా ఉండడమే కాదు. చిన్న లక్షణాలను కూడా పట్టించుకో వడం, సమయానికి పరీక్షలు చేయించుకోవడం, జీవనశైలిలో మార్పులు చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

# ఫుట్‌బాల్ వరల్డ్ కప్‌లో ధోనీ క్రేజ్.. FIFA స్పెషల్ పోస్ట్ వైరల్!




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ దిగ్గజం మహేంద్ర సింగ్ ధోనీ 45వ పుట్టినరోజు (జూలై 7, 2026) సందర్భంగా సోషల్ మీడియాలో ఒక రేంజ్ సెలబ్రేషన్స్ జరుగుతుంటే, అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమైక్య ఇచ్చిన ఒక క్రేజీ ట్రిబ్యూట్ నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. సోషల్ మీడియాలో ఎప్పుడూ ట్రెండ్ అయ్యే "తలా ఫర్ ఎ రీజన్" అనే వైరల్ మీమ్‌ను వాడుకుంటూ ఫిఫా తన ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాని షేక్ చేస్తోంది. ఈ పోస్ట్‌లో ప్రపంచ ఫుట్‌బాల్ సూపర్ స్టార్స్ లియోనెల్ మెస్సి, కిలియన్ ఎంబప్పే, ఎర్లింగ్ హాలాండ్‌ల ఫొటోలను షేర్ చేస్తూ ధోనీకి బర్త్‌డే విషెస్ చెప్పింది ఫిఫా. ఫుట్‌బాల్‌కు, క్రికెట్‌కు ఫిఫా కుదిర్చిన ఈ క్రియేటివ్ కనెక్షన్‌ను చూసి ఫ్యాన్స్ ఫిదా అయ్యారు.

**నంబర్ 7 కనెక్షన్:**

మహేంద్ర సింగ్ ధోనీకి, 7 నంబర్‌కు ఉన్న బంధం ప్రత్యేకమైనది. ఆయన పుట్టింది ఏడో నెల (జూలై) ఏడో తేదీన.. అంతేకాదు తన కెరీర్ అంతటా ధోనీ ధరించిన జెర్సీ నంబర్ కూడా 7.. అందుకే సోషల్ మీడియాలో ఎక్కడ ఏ 7 నంబర్ కనిపించినా, దానికి ఎలాంటి సంబంధం లేకపోయినా మన నెటిజన్లు "తలా ఫర్ ఎ రీజన్" అంటూ ధోనీ పేరును ట్రెండ్ చేయడం అలవాటుగా మారిపోయింది. ప్రస్తుతం జరుగుతున్న ఫిఫా వరల్డ్ కప్ లో గోల్డెన్ బూట్ రేసులో ఉన్న 3 టాప్ ప్లేయర్స్ లియోనెల్ మెస్సి, కిలియన్ ఎంబప్పే, ఎర్లింగ్ హాలాండ్‌లు ప్రస్తుతం చెరో 7 గోల్స్ చేసి సమంగా ఉన్నారు. ఈ ముగ్గురి గోల్స్ సంఖ్య '7' కావడంతో.. ఫిఫా కూడా ఇండియన్ ఫ్యాన్స్ స్టైల్‌లోనే ఆ 7 నంబర్‌ను ధోనీ బర్త్‌డేకు లింక్ చేస్తూ అదిరిపోయే పోస్ట్ పెట్టింది.

**రేసులో ముందుకు దూసుకెళ్లే ఛాన్స్ ఎవరికి?**

ఈ పోస్ట్ ధోనీ బర్త్‌డేని సెలబ్రేట్ చేయడమే కాకుండా, ప్రస్తుత వరల్డ్ కప్‌లో గోల్డెన్ బూట్ రేసు ఎంత రసవత్తరంగా కొనసాగుతుందో కూడా గుర్తు చేసింది. ఈరోజు (మంగళవారం, జూలై 7 IST) అట్లాంటా వేదికగా జరగనున్న రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లో అర్జెంటీనా జట్టు ఈజిప్టుతో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో లియోనెల్ మెస్సి కనుక మరిన్ని గోల్స్ చేస్తే, మిగిలిన ఇద్దరి కంటే ముందుకు వెళ్లే అవకాశం ఉంది.

**గ్లోబల్ లెవెల్‌లో ధోనీ క్రేజ్:**

చెన్నై సూపర్ కింగ్స్ జట్టుతో ఉన్న సుదీర్ఘ అనుబంధం వల్ల తమిళంలో 'నాయకుడు' అని అర్థం వచ్చేలా అభిమానులు ధోనీని "తలా" అని పిలుచుకుంటారు. ఈ రోజు ఆ పేరు కేవలం ఇండియాలోనే కాదు, గ్లోబల్ లెవెల్‌లో ఫిఫా వరల్డ్ కప్ వేదికగా మార్మోగిపోతుండటం చూసి క్రికెట్ ఫ్యాన్స్ కాలర్ ఎగరేస్తున్నారు.

# సంజు శాంసన్‌కి ఎందుకు ఛాన్స్ ఇవ్వలేదో తెలుసా?.. అసలు ట్విస్ట్ ఇదే!





**హైదరాబాద్ పెన్ పవర్:** జింబాబ్వే టూర్‌కు ప్రకటించిన టీమిండియా స్క్వాడ్‌లో వరల్డ్ కప్ హీరో సంజూ శాంసన్ పేరు లేకపోవడంపై సోషల్ మీడియాలో పెద్ద చర్చ జరుగుతోంది. అయితే, సంజూను జట్టు నుంచి తప్పించలేదని, ఇదంతా పక్కా స్ట్రాటజీలో భాగంగా అతనికి ఇచ్చిన రెస్ట్ మాత్రమేనని క్రికెట్ వర్గాల ద్వారా తెలుస్తోంది. బీసీసీఐ సెలెక్షన్ కమిటీ సంజూను పక్కన పెట్టడం వెనక ఉన్న అసలు కారణాలను వెల్లడించింది.

**ఆసియా క్రీడల కోసమే ఈ ప్లాన్:**

సెప్టెంబర్‌లో జరగబోయే ఆసియా క్రీడల భారత జట్టులో సంజు శాంసన్ సభ్యుడిగా ఉన్నాడు. జింబాబ్వే సిరీస్ చిన్నది కావడం, పైగా అక్కడ అతనికి తుది జట్టులో ఆడే ఛాన్స్ రాకపోవచ్చనే ఉద్దేశంతోనే సెలెక్టర్లు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఒక సీనియర్ ప్లేయర్‌ను మ్యాచ్‌లు ఆడించకుండా కేవలం బెంచ్‌పై కూర్చోబెట్టడం కంటే అతనికి రెస్ట్ ఇచ్చి యువ ఆటగాళ్లను పరీక్షించడం మంచిదని సెలక్షన్ కమిటీ భావించింది.

**ప్రభ్‌సిమ్రాన్ సింగ్‌కు ఛాన్స్ ఇవ్వడం కోసం!**

ఐపీఎల్‌లో అద్భుతంగా రాణించిన యువ వికెట్ కీపర్ బ్యాటర్ ప్రభ్‌సిమ్రాన్ సింగ్‌కు ఈ సిరీస్ ద్వారా తగినన్ని అవకాశాలు ఇవ్వాలని భారత సెలెక్టర్లు నిర్ణయించారు. ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ తరఫున ఆడిన ప్రభ్‌సిమ్రాన్ సింగ్ 168.87 స్ట్రైక్ రేట్‌తో 510 రన్స్ చేసి ఆ జట్టు టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ప్రస్తుతం జింబాబ్వే టూర్‌కు ఎంపికైన టాప్ ఆర్డర్ బ్యాటర్లలో అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్.. వీరంతా ఎడమచేతి వాటం బ్యాటర్లే.. కాబట్టి టాప్ ఆర్డర్‌లో ఒక సాలిడ్ రైట్ హ్యాండ్ బ్యాటర్ ఉంటే బాగుంటుందనే ఉద్దేశంతో ప్రభ్‌సిమ్రాన్‌ను జట్టులోకి తీసుకున్నారు.

**సంజూ ఫామ్‌లో లేకపోవడం కూడా ఒక కారణమే:**

సంజూ శాంసన్‌ను పక్కన పెట్టడానికి అతని ఫామ్ లేమి ప్రధాన కారణం కాదని బీసీసీఐ రిపోర్ట్ చెబుతున్నప్పటికీ, ఇటీవల అతను వరుసగా విఫలం కావడం కూడా మైనస్ అయింది. ఐపీఎల్‌లో రెండు సెంచరీలు కొట్టినప్పటికీ, కొన్ని మ్యాచ్‌ల్లో సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యాడు. ఆ తర్వాత ఐర్లాండ్ సిరీస్‌లో 0, 5 రన్స్.. ఇంగ్లాండ్‌తో జరిగిన మొదటి టీ20లో కేవలం 1 రన్ మాత్రమే చేశాడు. ఈ మూడు మ్యాచుల్లో వైఫల్యాల వల్లే రెండో టీ20లో అతని స్థానంలో 15 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీకి డెబ్యూ ఛాన్స్ ఇచ్చారు.

# నా పేరుతో పిచ్చి పిచ్చి పోస్టులా.. వైరల్ కోసం ఏదైనా చేస్తారా?.. సూర్యకుమార్ ఫుల్ ఫైర్!




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్‌లో గత కొన్ని రోజులుగా కెప్టెన్సీ మార్పుల అంశం హాట్ టాపిక్‌గా నడుస్తోంది. మొన్నటి వరకు టీ20 జట్టుకు కెప్టెన్‌గా ఉన్న సూర్యకుమార్ యాదవ్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పించి, సారథ్యం మొత్తాన్ని శ్రేయస్ అయ్యర్‌కు అప్పగించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ మార్పులపై సూర్య అసంతృప్తిగా ఉన్నాడని, టీమ్ మేనేజ్‌మెంట్‌ను ఏకిపారేస్తూ ఒక స్టేట్‌మెంట్ ఇచ్చాడంటూ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ తెగ వైరల్ అయింది. ఇక ఈ వివాదంపై క్లారిటీ ఇచ్చాడు సూర్యకుమార్. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఆ వైరల్ ప్రకటనతో తనకు ఎలాంటి సంబంధం లేదని తేల్చి చెప్పాడు. అలాంటి ఫేక్ వార్తలను అస్సలు నమ్మొద్దని ఫ్యాన్స్‌కు సూచించాడు.

**ఇన్ స్టా వేదికగా సూర్య ఫైర్:**

ప్రస్తుతం ఉన్న జట్టు కూర్పు పట్ల నేను చాలా సంతోషంగా ఉన్నాను అని సూర్యకుమార్ యాదవ్ తెలిపారు. టీమిండియాకు ఎప్పుడూ మంచి జరగాలనే కోరుకుంటాను.. కుర్రాళ్లు జట్టులో చాలా అద్భుతంగా రాణిస్తున్నారు.. వారికి నా సపోర్ట్ ఎల్లప్పుడూ ఉంటుంది. ముఖ్యంగా 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ.. నీ క్రికెట్ ప్రయాణం ఇప్పుడే మొదలైంది, ప్రతి క్షణాన్ని ఎంజాయ్ చేస్తూ దేశం గర్వపడేలా చేయాలని పేర్కొన్నాడు. ఇకపోతే సోషల్ మీడియాలో నా పేరుతో వైరల్ అవుతున్న పోస్ట్ ఒకటి నా దృష్టికి వచ్చింది.. అదంతా ఫేక్! ఆ నకిలీ వార్తలను నాకు ఆపాదిస్తున్నారు, ఆ కామెంట్స్ నేను చేయలేదు.. దయచేసి ఇలాంటి అబద్ధపు ప్రచారాలను నమ్మకండి.. భారత క్రికెట్‌కు, నా సహచర ఆటగాళ్లకు నా మద్దతు ఎప్పటికీ ఉంటుందని సూర్య భాయ్ వెల్లడించాడు.

**జట్టుకు ఎప్పటికీ నా సపోర్ట్:**

సూర్యకుమార్ యాదవ్ ఇచ్చిన ఈ క్లారిటీతో సోషల్ మీడియాలో జరుగుతున్న కెప్టెన్సీ వివాదానికి ఒక్కసారిగా బ్రేక్ పడింది. టీమ్ మేనేజ్‌మెంట్‌తో తనకు ఎలాంటి విభేదాలు లేవని, కొత్తగా జట్టులోకి వచ్చే కుర్రాళ్లకు తన ఫుల్ సపోర్ట్ ఉంటుందని చెప్పడంతో సూర్య తన క్రీడా స్ఫూర్తిని చాటుకున్నాడు. ఈ స్టేట్‌మెంట్‌తో ఫేక్ వార్తలు ప్రచారం చేసేవాళ్ల నోళ్లు మూతపడ్డాయని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

# రీమేక్‌లకు దూరంగా ఉన్న టాలీవుడ్ స్టార్లు

టాలీవుడ్‌లో రీమేక్ సినిమాలకు ఎప్పటినుంచో ప్రత్యేక స్థానం ఉంది. ఒక భాషలో సూపర్ హిట్ అయిన కథలను మరో భాష ప్రేక్షకులకు అందించేందుకు పలువురు స్టార్ హీరోలు రీమేక్‌లను ఎంచుకున్నారు. అయితే అదే సమయంలో కొందరు అగ్ర హీరోలు మాత్రం తమ కెరీర్ మొత్తం ఒరిజినల్ కథలపైనే నమ్మకం ఉంచుతూ ప్రత్యేక గుర్తింపును సంపాదించారు. ఇప్పటివరకు ఒక్క రీమేక్ సినిమాలో కూడా నటించకుండా తమ ప్రయాణాన్ని కొనసాగిస్తున్న హీరోలు కూడా కొందరున్నారు.







సూపర్ స్టార్ మహేష్ బాబు దాదాపు 25 ఏళ్లకు పైగా సినీ కెరీర్ లో ఒక్క రీమేక్ సినిమా కూడా చేయలేదు. ఒక్కడు నుంచి పోకిరి, దూకుడు, శ్రీమంతుడు, భరత్ అనే నేను, సర్కారు వారి పాట, గుంటూరు కారం వరకు ఆయన చేసిన సినిమాలన్నీ ఒరిజినల్ కథలే. కథల ఎంపికలో కొత్తదనం, డైరెక్టర్ల విజన్‌పై నమ్మకం ఉంచడం మహేష్ స్పెషాలిటీగా భావిస్తారు.

ఇక ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కూడా దాదాపు రెండు దశాబ్దాల కెరీర్‌లో రీమేక్‌లకు దూరంగానే ఉన్నారు. ఆర్య, దేశముదురు, జులాయి, సన్నాఫ్ సత్యమూర్తి, అల వైకుంఠపురములో, పుష్ప వంటి సినిమాలన్నీ ఒరిజినల్ కాన్సెప్ట్‌లతోనే తెరకెక్కాయి. కథలో వైవిధ్యం, పాత్రల్లో కొత్తదనం ఉండేలా చూసుకోవడం బన్నీ కెరీర్‌లో ప్రధాన బలంగా నిలిచింది. ఇక టాలీవుడ్ యంగ్ హీరో విజయ్ దేవరకొండ కూడా తన 15 ఏళ్ల సినీ కెరీర్ లో ఇప్పటివరకు రీమేక్‌లకు అవకాశం ఇవ్వలేదు. పెళ్లిచూపులు, అర్జున్ రెడ్డి, గీత గోవిందం, ట్యాక్సీవాలా, ఖుషి వంటి సినిమాలన్నీ ఒరిజినల్ కథలతోనే ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. యూత్ ను ఆకట్టుకునే కొత్త కాన్సెప్ట్‌లను ఎంచుకోవడంలో విజయ్ ప్రత్యేక శైలిని కొనసాగిస్తున్నారు. అయితే ఎవరైనా సరే రీమేక్‌లు చేయడం తప్పు కాదు. చాలా మంది హీరోలు ఆ రీమేక్స్ తో సక్సెస్‌లు కూడా అందుకున్నారు. కానీ మహేష్ బాబు, అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ మాత్రం ఒరిజినల్ కథలతోనే తమ బ్రాండ్‌ను నిర్మించుకోవడం విశేషం. మారుతున్న ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా కొత్త కథలకు ప్రాధాన్యం ఇస్తూ తమ కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తున్న ఈ హీరోలు, కథ ఎంపికలో తమదైన ప్రత్యేక గుర్తింపును కొనసాగిస్తున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965